అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

బుధవారం 19-4-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 108 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50

పంజాబ్‌లో కదం తొక్కిన గోధుమ రైతులు

కేంద్ర నిర్ణయానికి నిరసనగా రైల్‌రోకో



చండీఘర్ : పంజాబ్‌లో గోధుమ రైతులు కదం తొక్కారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పాడైపోయిన, ముక్కిపోయిన గోధుమలకు కేంద్రం ధర తగ్గించడాన్ని నిరసిస్తూ రైలు పట్టాలపై బైఠాయించారు. రైతుల ఆందోళన కారణంగా అనేక రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. భారతీ కిసాన్ యూనియన్, బీకేయూ (లఖోవాల్) సహా ఏడు రైతు సంఘాలు మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రైల్‌రోకో నిర్వహించాయి. లూధియానా, అమృత్‌సర్, ...5లో

విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

నల్లగొండ ప్రాంతంపై సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ప్రేమ

- కేంద్ర ప్రభుత్వానికి చేతలు తక్కువ.. ప్రచారాలు ఎక్కువ :మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-చౌటుప్పల్

రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి పెద్ద పీట వేస్తోందని ఆర్థిక, వైద్యా, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణకేంద్రంలో రూ.36 కోట్లతో వంద పడకల ప్రభుత్వాస్పత్రి నిర్మాణ పనులకు విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పూల బొకే అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైద్య విద్యలో రాష్ట్రం దేశానికే మోడల్‌గా మారిందన్నారు. 65 ఏండ్ల కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాల హయాంలో వైద్య రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం చౌటుప్పల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి, మర్రిగూడలో 30 పడకల ఆస్పత్రి, నల్లగొండ, సూర్యాపేటలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటుచేశామని తెలిపారు. రాష్ట్రం రాక ముందు మూడు కిడ్నీ డయాలసిస్ సెంటర్లు ఉంటే ఇప్పుడు 102 డయాలసిస్ ...5లో

మేకిన్ ఇండియా అంటే ప్రయివేటీకరణేనా?

మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మూసివేత కుట్రను అడ్డుకుంటాం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్
- ఆర్డినెన్సు ఫ్యాక్టరీ జేఏసీ నాయకులతో భేటీ




నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చిన నాటి నుంచి పబ్లిక్ సెక్టార్ యూనిట్స్(పీఎస్‌యూ) ప్రయివేటీకరణ పరంపర కొనసాగుతోందని, చివరికి దేశానికి రక్షణ కల్పించే రక్షణశాఖకూ ప్రయివేటీకరణ గండం తప్పడం లేదని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చెర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో మెదక్ ఆర్డినెన్సు ఫ్యాక్టరీ పరిరక్షణ జేఏసీ నాయకులు వినోద్‌కుమార్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాల బాటలో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా ప్రయివేటీకరణ చేస్తున్న బీజేపీ ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టారు. మేకిన్ ఇండియా ...5లో

పుల్వామా వైఫల్యానికి ప్రభుత్వానిదే బాధ్యత

అది నివారించగలిగినదే

- జవాన్లను విమానంలో పంపాల్సింది
- పుల్వామా ఘటనపై మాజీ ఆర్మీ చీఫ్ శంకర్ రాయ్



> పుల్వామా ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ అప్పటి జమ్మూకాశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ గళం విప్పిన రెండు రోజుల తర్వాత సైనిక దళాల మాజీ ప్రధానాధికారి కూడా పెదవి విప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది.

న్యూఢిల్లీ : పుల్వామా ఘటన నివారించదగినదేనని భారత సైనిక దళాల మాజీ ప్రధానాధికారి జనరల్ శంకర్ రాయ్ చౌదరి అభిప్రాయపడ్డారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది శ్రీనగర్‌కు రోడ్డు మార్గం ద్వారా కాకుండా విమానంలో వెళ్లి ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదని ఆయన అన్నారు. రోడ్డు మార్గాలు ఎప్పుడూ దాడులకు అనుకూలంగానే ఉంటాయని చెప్పారు. రెండున్నర వేల మందితో 78 వాహనాలు హైవే మీద ప్రయాణించి ఉండాల్సింది కాదని శంకర్ రాయ్ తెలిపారు. పుల్వామాలో 40 మంది జవాన్లు చనిపోవడానికి ప్రధాని నేతృత్వంలోని ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని, ఎందుకంటే ఆయన జాతీయ భద్రతా సలహాదారు కూడా అని చెప్పారు. ఇంటెలిజెన్స్ వైఫల్యానికి కూడా ప్రధానే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. జనరల్ రాయ్ చౌదరి 1994 నవంబర్ నుండి 1997 సెప్టెంబర్ వరకూ ఆర్మీ చీఫ్‌గా వ్యవహరించారు. సైనిక దళాలు భారీ కాన్వాయ్‌తో జాతీయ రహదారుల మీదుగా వెళ్లడం మంచిది కాదు. ఎందుకంటే ఆ మార్గాలు దాడులకు ఎప్పుడూ అనువుగా ఉంటాయి. పుల్వామాలో జమ్ము, శ్రీనగర్ మధ్య ఉన్న రహదారిపై ముజాహదీన్లు దాడి చేశారు. జవాన్లు రోడ్డు మార్గం మీదుగా కాకుండా విమానాలలో వెళ్లి ఉంటే ఈ దాడి జరిగి ఉండేది కాదు.' అని జనరల్ రాయ్ టెలిగ్రాఫ్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. పైగా పుల్వామా ప్రాంతం దాడులకు అత్యంత అనువైన ప్రదేశమని సైన్యంలో 40 సంవత్సరాలు పనిచేసిన రాయ్ చెప్పారు. జమ్మూలోని సాంబా మీదుగా వెళ్లే రోడ్డులో ఉగ్రవాదుల చొరబాట్లు ఎక్కువగా జరుగుతుంటాయని గుర్తు చేశారు. అదీకాక ఆ సరిహద్దు ప్రాంతం పాకిస్తాన్‌కు ఎంతో దూరంలో లేదని చెప్పారు. 'నలభై మంది జవాన్లు అంటే పెద్ద సంఖ్యే. వారిని జమ్మూకాశ్మీర్‌లో మోహరించారు. ఈ దాడిని నూటికి నూరు శాతం ఇంటెలిజెన్స్ వైఫల్యంగానే గుర్తించాలి' అని జనరల్ రాయ్ అన్నారు. పుల్వామా ఘటనపై లేవనెత్తే ప్రశ్నలు జాతి వ్యతిరేకమంటూ బీజేపీ చేస్తున్న వాదనను ఆయన ప్రస్తావిస్తూ ప్రభుత్వం చేతులు కడిగేసుకోవాలని చూస్తోందని వ్యాఖ్యానించారు. జనరల్ రాయ్ గతంలో పరమ్ విశిష్ట్ సేవా పతకాన్ని కూడా పొందారు.

దోషుల విడుదలపై సుప్రీం మండిపాటు...

ఎందుకు విడుదల చేశారు?

నేడు బిల్కిస్.. రేపు ఇంకొకరు..

- ఆ పదకొండు మంది విడుదలకు కారణాలు చెప్పండి
- గుజరాత్ ప్రభుత్వానికి,కేంద్రానికి నోటీసులు
- వచ్చేనెల 2న తుది విచారణ



> ఒక గర్భిణీపై సామూహిక లైంగికదాడి జరిగింది. అనేక మంది చంపబడ్డారు. బాధితురాలి కేసును ప్రామాణిక సెక్షన్ 302(హత్య) కేసులతో మీరు పోల్చలేరు. యాపిల్స్‌ను నారింజపం డ్లతో ఎలా పోల్చలేమో అలాగే ఊచకోతను ఒక హత్యతో పోల్చలేము. నేరాలు సాధారణంగా సమాజానికి, వర్గానికి వ్యతిరేకంగానే జరుగుతాయి" అని ధర్మాసనం తెలిపింది.

> దేని ఆధారంగా దోషులకు రెమిషన్ కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని ప్రశ్నించింది. "ఈ రోజు బిల్కిస్ బానో... రేపు ఇంకా ఎవరైనా. అది మీరు లేదా నేను కావచ్చు. రెమిషన్‌కు అనుమతివ్వడానికి గల కారణాలను మీరు చూపెట్టకపోతే, అప్పుడు మేము మా స్వంత నిర్ణయం తీసుకుంటాం" అని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో దోషుల విడుదలపై సుప్రీంకోర్టు స్పందించింది. వారిని విడుదల చేయడానికి గల కారణాలు తెలియజేయాలని గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే దోషుల రెమిషన్ అనుమతికి సంబంధించిన ఒరిజినల్ ఫైల్‌లతో సిద్ధంగా ఉండాలని తమను సుప్రీంకోర్టు గత నెల 27న జారీ చేసిన ఈ ఆదేశాలను పున:సమీక్షించాలని కోరుతూ తాము పిటిషన్ దాఖలు చేసే అవకాశమున్నదని కేంద్రం, గుజరాత్ ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానానికి తెలిపాయి. ఖైదు కాలంలో 11 మంది దోషులకు పెరోల్‌కు అనుమతించడాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.ఎం జోసెఫ్, బి.వి నాగరత్నలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది.

బిల్కిస్ బానో కేసులో దోషులకు రెమిషన్ కల్పించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు ధర్మాసనం తుది విచారణను ...5లో

పదేండ్లలో గణనీయమైన వృద్ధి

హైదరాబాద్ నగర జీవ వైవిధ్య సూచీ విడుదల

- జీవవైవిధ్యాన్ని రెండోసారి మదింపు చేసిన ఏకైక నగరంగా హైదరాబాద్
- జూన్ 5న అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం : మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగర జీవవైవిధ్య సూచీ(సిటి బయోడైవర్సిటీ ఇండెక్స్)ని మంత్రి కేటీఆర్ మంగళవారం నానక్‌రాంగూడలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రత్యేకంగా బయోడైవర్సిటీ ఇండెక్స్ నివేదికను ...5లో

మే 4 లేదా 5న నిరుద్యోగంపై సమర శంఖం

ముఖ్య అతిథిగా ప్రియాంకగాంధీ

- 21,24, 26 తేదీల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు
- మే 9 నుంచి రెండో విడత హాత్ సే హాత్ జోడో యాత్ర : టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్


రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య, టీఎస్‌పీస్సీ పేపర్ లీకేజీ అంశంపై తమ పార్టీ ఆధ్వర్యంలో సమర శంఖం పూరించనున్నట్టు టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. మే 4 లేదా 5న సరూర్‌నగర్ మైదానంలో భారీ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు.ఆ సభకు కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. లీకేజీ వ్యవహారంపై ఈ నెల 21న నల్గొండలో, 24న ఖమ్మం, 26న ఆదిలాబాద్‌లో నిరసన సభలు నిర్వహిస్తామన్నారు. ఎల్బీనగర్‌లోని శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళు లర్పించి...సరూర్‌నగర్ సభా ప్రాంగణానికి ర్యాలీగా వెళతామని చెప్పారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే యువతకు ఏమీ చేస్తుందో స్పష్టత ఇస్తామన్నారు. ప్రియాంక గాంధీ కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ఉన్నందున మరో రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని చెప్పారు. ఇది కాంగ్రెస్ పార్టీ కోసం కాదనీ, నిరుద్యోగుల కోసం చేస్తున్న పోరాటమని చెప్పారు. ఈ కార్యక్రమాలన్నింటినీ ఓ సామాజిక బాధ్యతగా తీసుకుని విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమానికి నీళ్లు, నిధులు, నియామకాలు నినాదమే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఆ స్ఫూర్తితోనే ...5లో

భానుడి భగభగలు..

మరో వారం రోజుల పాటు ఇదే పరిస్థితి : ఐఎండీ



న్యూఢిల్లీ : భానుడి ప్రతాపంతో యావత్ దేశం అల్లాడుతున్నది. పలు రాష్ట్రాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి. కాగా, మరో వారం రోజుల పాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కొన సాగుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఎండ తీవ్రతతోపాటు వేడిగాలులు వీస్తాయని తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. బీహార్, పశ్చిమ బెంగాల్‌లో రానున్న నాలుగు రోజుల పాటు వేడి గాలులు వీస్తాయని ఐఎండీ తెలిపింది. ఏప్రిల్ 18, 19 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లో హీట్ వేవ్ పరిస్థితులు నెలకొంటాయని అంచనా వేసింది. ఇక సిక్కిం, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో రానున్న రెండు మూడు రోజులు వేడిగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని పేర్కొంది. దేశ రాజధాని ఢిల్లీలోనూ వేడిగాలులు వీస్తున్నాయి. కొన్ని వాతావరణ స్టేషన్లలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కనీసం ఐదు డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగానే నమోదయ్యాయి. పంజాబ్, హర్యానాలలో ...5లో



మత హింసకు పండుగలు ఆయుధాలా?

వడోదరలోనూ అదే తీరు

- ప్రార్థనలు చేస్తున్న సమయంలోనే దాడులు
- తప్పుడు కేసులతో మైనారిటీలపై వేధింపులు

> గత నెల 30న శ్రీరామనవమి పండుగ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన శోభాయాత్రల సమయంలో మతోన్మాదం పడగ విప్పింది. గుజరాత్‌లోని వడోదర కూడా ఇందుకు మినహాయింపు కాదు. అది మధ్యాహ్నం ఒంటి గంట సమయం. ముస్లింలు మసీదులలో ప్రార్థనలు చేసుకుంటున్నారు. అప్పుడే ఉద్రిక్తతలు మొదలయ్యాయి. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ప్రదర్శన మసీదు, దర్గా మీదుగా సాగుతోంది. పోలీసులను మోహరించినప్పటికీ విధ్వంసం, హింస యధేచ్ఛగా సాగాయి. ముస్లింలను, వారి ఆస్తులను లక్ష్యంగా చేసుకొని దాడులు జరిగినప్పటికీ పోలీసులు మాత్రం బాధితులపైనే కేసులు పెట్టారు.



న్యూఢిల్లీ/వడోదర : మదీనా బీబీ ప్రతి రోజు మాదిరిగానే తన కుటుంబసభ్యులతో కలిసి ఫతేపురాలో ఇంటి బయట కూర్చుంది. ఇఫ్తార్ సమయం సమీపిస్తోంది. ఒక్కసారిగా పోలీసులు అక్కడికి చేరుకొని ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. శోభాయాత్రపై రాళ్లు రువ్వారంటూ తప్పుడు కేసు బనాయించారు. ఎంత మొత్తుకున్నా ఎవరూ పట్టించుకోలేదని మదీనా బీబీ వాపోయింది. ఈ నెల 3న వడోదర క్రైమ్‌బ్రాంచ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ అల్లర్లు, రాళ్ల రువ్వడం వంటి ఘటనలకు సంబంధించి మరో 12 మందిని అరెస్ట్ చేశామని తెలిపింది. అంతకుముందే హాతీఖానా-కుంభర్‌వాడా ప్రాంతంలో 23 మందిని అరెస్ట్ చేశారు. ఈ నెల 4న రెండు మతాలకూ చెందిన మరో 60 మందిని అరెస్ట్ చేశారు. 13వ తేదీన మదీనా బీబీ కుటుంబసభ్యుల్లో నలుగురిని విడుదల చేశారు.

పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో 45 మంది ముస్లింల పేర్లు ఉన్నాయని, అందులో ఒక్క హిందువు కూడా లేదని నిందితుల తరఫున వాదిస్తున్న న్యాయవాది ఎస్ఎం. ఇండోరి తెలిపారు. 'వీరికి బెయిల్ ఇప్పించడం చాలా కష్టమవుతోంది. ఒక కోర్టులో బెయిల్ నిరాకరిస్తే సెషన్స్ కోర్టుకు వెళ్లాం. పరీక్షలకు హాజరవ్వాల్సిన ఓ మహిళ, మరో విద్యార్థి తరఫున బెయిల్ పిటిషన్ వేశాం' అని ఆయన చెప్పారు. గత 15 సంవత్సరాలుగా మసీదులో మతబోధకుడిగా పనిచేస్తున్న ముఫ్తీ అనాస్ మాట్లాడుతూ 'ఎన్నో శోభాయాత్రలు చూశాను. కానీ మసీదు, దర్గా మీదుగా ప్రదర్శన సాగడం ఇదే మొదటిసారి. అయినా వారి ఉత్సవం జరుపుకోవాలంటే మా ప్రార్థనా స్థలాలను ధ్వంసం చేయాలా?' అని ప్రశ్నించారు. ఇది పథకం ప్రకారం జరిగిన పనేనని ఆయన చెప్పారు. ప్రార్థనలు చేస్తుంటే మసీదుపై రాళ్లు పడ్డాయని, కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయని, దుండగులు లోపలికి ప్రవేశించి నమాజు చేస్తున్న వారిపై దాడి చేసి గాయపరిచారని ...5లో

స్టే పేరుతో బదిలీలు, పదోన్నతులపై తాత్సారం తగదు :ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



నవతెలంగాణ - హైదరాబాద్

హైకోర్టులో స్టే పేరుతో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై తాత్సారం మంచిది కాదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియపై విద్యాశాఖ తాత్సారం చేస్తున్నదని విమర్శించారు. గతేడాది మే వేసవి సెలవుల్లో ఆ ప్రక్రియను పూర్తిచేస్తామంటూ విద్యాశాఖ మంత్రి గత ఏప్రిల్‌లో ప్రకటించారని గుర్తు చేశారు. కానీ మళ్లీ ఈ ఏడాది ఏప్రిల్ వచ్చినా ఆ ప్రక్రియ కోర్టు స్టేతో ఉండడం విద్యాశాఖ పనితీరుకు నిదర్శనంగా కనిపిస్తున్నదని తెలిపారు. ఈనెల 11న బదిలీల కేసు బెంచిపైకి వచ్చినపుడు జాగ్రత్త వహించలేదనిపిస్తున్నదని పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు బదిలీలు, పదోన్నతులు ఉపాధ్యాయుల సమస్యగా చూస్తున్నట్టుగా కనిపిస్తున్నదని వివరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల బదిలీ అనేది వృత్తి నిర్వహణలో చురుకుదనం పెంచడం తప్ప మరొకటి కాదని తెలిపారు. పదేండ్లకుపైగా ఒకే పాఠశాలలో పనిచేయడం వల్ల స్తబ్దత ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇతర శాఖల్లో మూడేండ్ల నుంచి ఐదేండ్ల సర్వీసు పూర్తయితే బదిలీలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఆ పద్ధతిలోనే ఉపాధ్యాయుల బదిలీలు అమలు చేయాలని సూచించారు. పదోన్నతులు కూడా ఉన్నత పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయ, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయడం తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో కూడా ప్రధానోపాధ్యాయుల పోస్టుల భర్తీ పదోన్నతుల ద్వారానే చేయాలని కోరారు. ఇప్పటికైనా పాఠశాల విద్యాశాఖ సంచాలకులు చురుకుగా వ్యవహరించి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను మే వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని సూచించారు.

కనీస వేతనాలివ్వాలి

- గిరిజన మినీ గురుకులం కాంట్రాక్టు ఉద్యోగుల ఆందోళన



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన మినీ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం బోధన, బోధనేతర సిబ్బందికి కనీస వేతనాలివ్వాలని గిరిజన మినీ గురుకులం కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రుల సముదాయ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు.దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసి బంజారా హిల్స్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గిరిజన మినిగురుకులం కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వి నిర్మల మాట్లాడుతూ రాష్ట్రంలో 29 గిరిజన రెసిడెన్షియల్ మినీ గురుకులం(బాలికల) పాఠశాలలున్నాయనీ, అవి 1999-2000 సంవత్సరంలో ప్రారంభమయ్యాయని తెలిపారు. నాటి నుండి నేటి వరకు ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది తక్కువ వేతనంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. బీఈడీ, టీటీసీ, టెట్‌లలో అర్హత పొంది ఎంతో మంది గిరిజన బాలికలను ఉన్నత స్థానాలకు ఎదిగే విధంగా తోడ్పాటు నందిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో ప్రస్తుతం పోటీ పరీక్షలకు సిద్ధమై ఉద్యోగాలు పొందే వీలు లేకుండా వయోపరిమితి దాటి పోయిందన్నారు.

2018 సంవత్సరం నుంచి ప్రభుత్వం మినీ గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు నెలకు రూ. 15వేలు, బోధనేతర సిబ్బందికి రూ. 7,500, ఏఎన్ఎంలకు రూ. 9వేల చొప్పున వేతనం ఇస్తున్నదని తెలిపారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పోల్చుకుంటే ఆ వేతనంతో బతకటం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవోనెం 22 ప్రకారం అర్హత సీనియార్టీ ఆధారంగా తమను క్రమబద్ధీకరించాలనీ, జీవిత ఆరోగ్య బీమా (హెల్త్ కార్డ్) సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో రజిని, సుశీల, శ్రీలత, నీల, సులోచన, ధృపదా, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

రూ.180 తగ్గిన బంగారం ధర

న్యూఢిల్లీ : దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధర స్వల్పంగా తగ్గినప్పటికీ రూ.60వేల ఎగువనే కొనసాగుతోంది. మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడిపై రూ.180 తగ్గి రూ.60,300గా ఉందని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ వెల్లడించింది. ఇంతక్రితం సెషన్‌లో ఈ లోహం ధర రూ.60,480 వద్ద ముగిసింది. పసిడి బాటలోనే కిలో వెండిపై రూ.240 తగ్గి రూ.75,780 వద్ద నమోదయ్యింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్క ఔన్స్ పసిడి ధర 2,003 డాలర్లుగా, వెండి ధర 25.15 డాలర్లుగా చోటు చేసుకుంది.

పాలమూరు-రంగారెడ్డి' డీపీఆర్ పరిశీలన కొనసాగించాలి

2014లోనే ప్రధాని హామీ ఇచ్చారు

- అప్పర్ భద్రకు ఎలా అనుమతులు ఇచ్చారు
- తెలంగాణకు ఒక న్యాయం.. కర్నాటకకు మరో న్యాయమా ? : కేంద్ర జలశక్తి శాఖకు రాష్ట్రం లేఖ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో నిర్మించే ఇరిగేషన్ ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తచేసింది. కేటాయింపులకు లోబడే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల చేపడితే అనుమతులు ఇవ్వడం లేదనీ, కనీసం డీపీఆర్‌ను పరిశీలించడం లేదని అసహనం వ్యక్తం చేసింది. ఇదే సమయంలో కర్నాటకలోని అప్పర్‌భద్రకు మాత్రం అనుమతులు ఇవ్వడంతోపాటు జాతీయ హోదా కూడా కల్పించిందని గుర్తు చేసింది. తెలంగాణకు ఒక న్యాయం, ఇతర రాష్ట్రాలకు మరో న్యాయమా? అని ప్రశ్నించింది. 2014 ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రధాని మోడీ ఇచ్చిన హామీ ఏమైందని అడిగింది.

ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖకు మంగళవారం తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. కేటాయింపులకు లోబడే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చేపట్టామని స్పష్టం చేసింది. పోలవరం నుంచి కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీలకు బదులుగా సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాలు వాడుకోవచ్చని గోదావరి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ఉదహరించింది. ఈ మేరకు వచ్చే 45 టీఎంసీలు, మైనర్ ఇరిగేషన్‌లో మిగిలిన 45 టీఎంసీలు కలిపి 90 టీఎంసీలతో పాజెక్టును చేపట్టామని అధికారులు ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు కోర్టు పరిధిలో ఉన్నాయంటూ డీపీఆర్ వెనక్కి పంపించడంలో కేంద్రం అంతర్యం ఏమిటని ప్రశ్నించింది. కర్నాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్టును కూడా ఇదే తరహాలో చేపట్టారని వ్యాఖ్యానించింది. మైనర్ ఇరిగేషన్‌లో మిగిలిన జలాలు, పోలవరం నుంచి కృష్ణా డెల్టాకు తరలించిన వాటాలో వచ్చే జలాల ఆధారంగా అప్పర్ భద్రకు ప్రతిపాదించారని పేర్కొన్నారు. కేంద్రం ఆ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వడమే కాకుండా ఏకంగా జాతీయ హోదా కల్పించి, కేంద్ర బడ్జెట్లో నిధులు కూడా విడుదల చేసిందని పేర్కొన్నారు. కరువు పీడిత, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలలో 1200 గ్రామాలకు, 6 జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు తాగునీరు, సాగునీరు అందించడానికి ప్రతిపాదించిన పాలమూరు-రంగారెడ్డికి మాత్రం ఎందుకు అన్యాయం చేస్తున్నారని నిలదీశారు. ప్రాజెక్టులకు అనుమతుల విషయంలో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధంగా వ్యవహరిస్తారా? అని ప్రశ్నించారు.

డీపీఆర్‌ను పరిశీలించాల్సిందే..



2021 జూలై 15వ తేదీన కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ ప్రకారం.. అనుమతి లేని ప్రాజెక్టుల జాబితాలో పాలమూరు-రంగారెడ్డిని చేర్చారనీ, ఆరు నెలల్లోగా అనుమతులు పొందాలని చెప్పారన్నారు. ఈ మేరకే అనుమతుల కోసం డీపీఆర్‌ను సమర్పించినట్టు తెలిపారు. అప్పటి నుంచి ఆరు నెలల్లోగా డీపీఆర్‌ను పరిశీలించి, అనుమతులు ఇచ్చే బాధ్యత కేంద్రానిదేనని గుర్తు చేశారు. కాగా ట్రిబ్యునల్‌లో కేసు విచారణ కొనసాగుతున్నదనే కారణంతో డీపీఆర్‌ను పరిశీలించలేమని కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చెప్పడం అన్యాయమన్నారు. తమకు నీటి కేటాయింపులు చేసే అధికారం లేదని జస్టిస్ బ్రిజేష్ కుమార్ చెప్పారని గుర్తు చేశారు. కాబట్టి డీపీఆర్‌ను పరిశీలించి, ట్రిబ్యునల్ తుది తీర్పునకు లోబడి అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు కేంద్ర జలసంఘాన్ని ఆదేశించాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్‌కు రాష్ట్ర సాగునీటి శాఖ స్పెషల్ సీఎస్ రజత్‌కుమార్ లేఖ రాశారు. కేంద్ర జల సంఘం లేవనెత్తిన అంశాలు అన్నిటికీ సవివరమైన సమాధానాలు సమర్పించామని పేర్కొన్నారు.

ప్యాసింజర్ పోయే.. వందే భారత్ రైళ్లు వచ్చే

కరోనా కాలంలో నిలిపేసిన ప్యాసింజర్ రైళ్లు పునఃప్రారంభించాలి

- నిధుల తగ్గింపుతో ఉపాధి హామీ నిర్వీర్యం : ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పేదోడికి అవసరమైన ప్యాసింజర్ రైలు తీసేసి, ధనవంతుల అవసరాలకు అనుగుణంగా వందే భారత్ రైళ్లను తీసుకొస్తున్నారని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. సోమవారం నాడిక్కడ ఆంధ్ర, తెలంగాణ భవన్‌లో బి. వెంకట్ మీడియాతో మాట్లాడారు. ఇండియన్ రైల్వే దేశ ప్రజలకు చౌకైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించిందని, అత్యంత వేగంగా వెళ్లే రైళ్లు కూడా పేదలు ప్రయాణించేందుకు అనుకూలంగా ఉండేవని అన్నారు. అదే ఇప్పుడు మోడీ ప్రారంభిస్తున్న వందే భారత్ రైళ్లు అత్యంత ఖరీదైన ప్రయాణంతో కూడుకున్నవని తెలిపారు. మరోవైపు కోట్లాది మంది పేదలకు అనుకూలంగా ఉండే ప్యాసింజర్ రైలు రద్దు చేయడమే కాక ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను రద్దు చేస్తున్నారని విమర్శించారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కూడా తత్కాల్ టికెట్లు, ప్రీమియం తత్కాల్ టికెట్లు అంటూ కొత్త కొత్త పేర్లు పెట్టి రూ.1,000 ఉన్న టికెట్ ధరను రూ.3,000కు పెంచి ప్రజల మీద విపరీతమైన భారాలు మోపుతు న్నారని దుయ్యబట్టారు. ఇది రైల్వేలతో ప్రజలకు అందించాల్సిన సౌకర్యాన్ని, సౌలభ్యాన్ని తలకిందులు చేసే విధంగా ఉందని విమర్శించారు. దేశంలో 3,752 రైళ్లు ఉండగా కోవిడ్ కాలంలో ఆపిన ప్యాసింజర్ రైళ్లను ఇంత వరకు ప్రారంభించలేదని, వాటిని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తిరుపతి నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లే 16 ప్యాసింజర్ రైళ్ళను రద్దు చేశారని, మరోవైపు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు తగ్గించి, ఏసి బోగీలు పెంచారని అన్నారు. దీంతో సామాన్యుల కున్న కొద్దిపాటి ప్రయాణ సౌకర్యాలను కూడా కోల్పో తున్నారని తెలిపారు. చౌక ప్రయాణమే కాక దేశంలో ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి అనుసంధా నగా ఉన్న రైల్వే నెట్‌వర్క్‌ను ప్రైవేట్ పరం చేస్తున్నారని విమర్శించారు. రైళ్లు, రైల్వే స్టేషన్లు ప్రైవేటీకరణ చేయడమే కాక, ప్రైవేట్ రైళ్లకు అనుమతిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రతి రోజూ కేంద్రం డీజిల్ రేట్లు పెంచడం, దానికి తోడు తరచు గా టోల్ చార్జీలు పెరగటంతో ఆర్టీసీ బస్సు చార్జీలు క్రమంగా పేదలకు అందకుండా పోతున్నాయని అన్నారు.

నిధుల తగ్గింపుతో ఉపాధి హామీ నిర్వీర్యం

ఉపాధి హామీ చట్టం అమలుకు బీజేపీ మొదటి నుండి వ్యతిరేకంగా ఉందని, ఏదో విధంగా పేదలకు ఉన్న ఉపాధిని కనుమరుగు చేయాలని కుతంత్రాలు పన్నుతోందని విమర్శించారు. బడ్జెట్‌లో నిధులు తగ్గించడంతో పాటు కూలీలకు ఉపయోగం లేని టెక్నాలజీతో ఆన్‌లైన్ మస్టర్ వేయాలని, ఆండ్రాయిడ్ ఫోన్లు వాడాలని అడ్డగోలు పద్ధతులను తెచ్చిందని తెలిపారు. గతేడాది చేసిన పనులకు నేటికీ అనేక రాష్ట్రాలలో బిల్లులు విడుదల కాక కూలీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇటీవల అంబేద్కర్ జయంతి సభలను బీజేపీ ఆర్భాటంగా నిర్వహించిందని, రానున్న ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు నాటకం ఆడుతోందని ధ్వజమెత్తారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేస్తూ, మరో వైపు ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. భారత చరిత్రను బీజేపీ వక్రీకరిస్తున్నదని, చారిత్రక వాస్తవాలన్నీ రూపుమాపాలని ప్రయత్నిస్తుందని అన్నారు. రాజ్యాంగంలోని హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేస్తూ మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని, రాజ్యాంగ రక్షణకు ప్రజలు ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెలుగు రాష్ట్రాలపై మోడీ సర్కార్ కక్ష

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలపై కక్ష కట్టిందని, ప్రజల సంక్షేమానికి రాష్ట్ర అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలుగు ప్రజలకు అన్యాయం చేస్తుంటే ప్రభుత్వాలు మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడాదికిపైగా కార్మికులు, ప్రజలు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకునేందుకు పోరాటం చేస్తుంటే, జగన్ వారికి మద్దతు ప్రకటించటం గాని, కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించటం గాని చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. జగన్మోహన్ రెడ్డి కేసులకు భయపడి ఏపిని కార్పొరేట్ పరం చేస్తున్నారని, పోలవరానికి నిధులు ఇవ్వకపోతే మాట్లాడటం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నియంత్ర పోకడలను, అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచే విధానాలను ప్రతిఘటిస్తూ ఆరు నెలల పాటు దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్ట నున్నట్లు ప్రకటించారు. దళితుల సమస్యలపై దశలవారీగా ఆందోళన చేపడతామని పిలుపునిచ్చారు.

రెండో రోజూ మార్కెట్ల నేల చూపులు

ముంబయి : వరుసగా రెండో రోజూ దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. అమ్మకాల ఒత్తిడితో మంగళవారం బిఎస్ఇ సెన్సెక్స్ 184 పాయింట్లు కోల్పోయి 59,727కు పడిపోయింది. అదే బాటలో ఎన్ఎస్ఇ నిఫ్టీ 47 పాయింట్లు తగ్గి 17,660 వద్ద ముగిసింది. ఉదయం నుంచి మార్కెట్లకు ఏ దశలోనూ కొనుగోళ్ల మద్దతు లభించలేదు. విద్యుత్, టెలికాం రంగ షేర్లు ఎక్కువ ప్రతికూలతను ఎదుర్కోవడంతో పాటు మార్కెట్లను నష్టాల్లోకి లాగాయి. బిఎస్ఇలో మిడ్ క్యాప్ 0.5 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.2 శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇలో వైద్య రంగం, రియాల్టీ సూచీలు ఒక్క శాతం చొప్పున రాణించాయి.

మంత్రి నిరంజన్‌రెడ్డి 85 ఎకరాలు కబ్జా

- కృష్ణానదిలో అక్రమంగా కాంపౌండ్ వాల్
- మంత్రి ఫాంహౌజ్ రోడ్డుకు ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు : రఘునందన్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ శాఖ మంత్రి సి.నిరంజన్‌రెడ్డి కృష్ణానది ఒడ్డున 165 ఎకరాల్లో ఫామ్‌హౌజ్ కట్టి దాని చుట్టూ ప్రహరీ తిప్పారనీ, అందులో 85 ఎకరాలు ఆక్రమించిన భూమే ఉందని బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సీఎం కేసీఆర్‌కన్నా తక్కువనా అనుకున్నాడో ఏమోగానీ మూడు ఫామ్‌హౌజ్‌లను మంత్రి కట్టుకున్నారని విమర్శించారు. వాటి కోసం వ్యవసాయశాఖ ద్వారా వచ్చే రుణాలు, సబ్సిడీలన్నింటినీ బినామీల పేరుతో స్వాహా చేశారని ఆరోపించారు. ఆ తర్వాత తన కుటుంబ సభ్యుల పేరుమీదకు భూములను బదలాయించుకున్నారని విమర్శించారు. 165 ఎకరాల్లో 80 ఎకరాలు మాత్రమే రిజిస్టర్డ్ భూమి అని పత్రాలు చూపించారు. కృష్ణానది లోపలి నుంచి 6 మీటర్ల ఎత్తులో గోడ కూడా కట్టారని ఫొటోలను చూపారు. వాటిపై సీఎం కేసీఆర్ యాక్షన్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి ఫాంహౌజ్ కట్టుకున్న మానవపాడు మండలంలో 21అక్టోబర్ 2021న తహసీల్దార్ కార్యాలయం తగలబడిందని చెప్పారు. ఇప్పటివరకూ దానిపై చార్జిషీట్ నమోదుకాలేదన్నారు. పాత రికార్డులేవీ ఉండవు కాబట్టి మంత్రి యథేచ్ఛగా ప్రభుత్వ భూములను ఆక్రమించారని ఆరోపించారు.

రాజకీయ దురుద్దేశంతోనే

- రఘునందన్‌రావు ఆరోపణలు : మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజకీయ దురుద్దేశంతోనే బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు తనపై ఆరోపణలు చేశారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. రఘునందన్‌రావు ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఈమేరకు మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. నిజాన్ని తెలుసుకోకుండా రాజకీయ దురుద్దేశంతో చేసిన ఆరోపణలకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణానది పరివాహకాన్ని ఆక్రమించి, నిబంధనలు అతిక్రమించి తాను ఫామ్ హౌస్‌లు నిర్మించానంటూ రఘునందన్ రావు ఆరోపిస్తున్నారని విమర్శించారు. వనపర్తి జిల్లా చందూరు మండలంలో 80 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకుని 160 ఎకరాల్లో ప్రహరీగోడ నిర్మించానని చెప్పడం సరైందికాదని పేర్కొన్నారు. 'మా స్వగ్రామం పాన్‌గల్‌లో నాకు ఉన్న భూములు 2014, 2018 ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నవే. ఎస్టీల పేరిట భూములు కొని మార్చుకున్నామన్న మాట అవాస్తవం. కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు రఘునందన్ రంధ్రాన్వేషణ చేశారు. న్యాయంగా చట్టప్రకారం కొనుగోలు చేసిన దాని కన్నా ఒక్క గుంట ఎక్కువ ఉన్నా...ఆ భూముల్ని మా పిల్లలు వదిలేస్తారు. నేను నా పదవికి రాజీనామా చేస్తా. లేకుంటే అసత్య ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేయాలి' అని సవాల్ విసిరారు.

మక్రాన్ చైనా పర్యటన

సామ్రాజ్యవాద దేశాల మధ్య ముదిరిన విబేధాలు!



ఫ్రాన్స్ :ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మక్రాన్ ఇటీవల చేసిన చైనా పర్యటనతో చైనా, రష్యాలపైన అమెరికా, దాని మిత్రదేశాలు ఏ లక్ష్యంతో దాడులు చేస్తున్నాయనేది స్పష్టమైంది. ఆర్థిక సంక్షోభం, అస్థిర ఫైనాన్షి యల్ మార్కెట్లు, వర్గ పోరాటాల పెరుగుదలతో సతమతమౌతున్న సామ్రాజ్యవాద దేశాలు వినాశకర మూడవ ప్రపంచ యుద్ధ ప్రమాదం అంచున మానవాళి భవితను నిలిపి బలవంతంగా ప్రపంచాన్ని మళ్ళీ పంచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. రష్యాని వశపరుచుకుని, ఆ దేశానికున్న విస్తృత మైన సహజ వనరులను దోచుకోవాలనేది, చైనా అప్రతిహత ఆర్థికాభివృద్ధిని నిలువరించాలనేది అమెరికా కూటమి తక్షణ లక్ష్యంగా ఉంది. అయితే ఈ ఘర్షణ తీవ్రతరమౌతు న్న కొద్దీ అమెరికా, ఐరోపాల మధ్య, ఐరోపాలోని ప్రత్యర్థి దేశాల మధ్య విబేధాలు తీవ్ర స్థాయికి చేరాయి.

ఈ మధ్య కాలంలో అమెరికా, చైనాను నిత్యం రెచ్చగొడుతూ ఉంది. 50 సంవత్సరాలపాటు అనుసరించిన "ఒకేఒక చైనా" విధానాన్ని అమెరికా పక్కనబెట్టింది. చైనా సముద్ర తీరంలో అమెరికా మిలిటరీ తరచూ సైనిక విన్యాసాలను నిర్వహిస్తూ వుంది. గతవారంలో చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఫిలిప్పైన్స్‌తో జమిలిగా సైనిక విన్యాసాలను నిర్వహించింది. ఇటు వంటి ఉద్రిక్త వాతావరణంలో మక్రాన్ ఒక పెద్ద డెలిగేషన్‌తో చైనాను సందర్శించాడు. చైనా చేసిన సకల సత్కారాలందుకున్న మక్రాన్ ఆ దేశంతో అనేక లాభసాటి ఆర్థిక ఒప్పందాలను కుదుర్చుకున్నాడు. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చేస్తున్న కృషిని శ్లాఘించాడు. తన తిరుగు ప్రయాణంలో అనేక మంది ఐరోపా రాజకీయ నాయకుల మనసులో వున్నా బయటకు చెప్పని విషయాన్ని మక్రాన్ వ్యక్తపరి చాడు. "పొలిటికో" జర్నలిస్టులకు ఇచ్చిన ఇంటర్వ్యూ లో తను అమెరికా అవలంబి స్తున్న "చైనా విధానం"తో తీవ్రంగా విబేధిస్తున్నానని మక్రాన్ ప్రకటించాడు. ఐరోపా గందరగోళంలో పడి గుడ్డిగా అమెరికా విధానాన్ని అనుసరించకుండా నిజమైన "వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి"ని అభివృద్ధి చేసుకోవాలని, కూటమి తర్కంలో ఇరుక్కుని మనవికాని సంక్షోభాలలో కూరుకుపోకూడదని ఆయన అన్నాడు. ఐరోపా వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని, ఆర్థిక వ్యవస్థను పెంపొందించుకునే ప్రయత్నం చేయాలని, అమెరికాపైన ఆధారపడకుండా ఐరోపా రక్షణ పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని, అందు కోసం "ఐరోపా యుద్ధ ఆర్థికవ్యవస్థ" ఆవశ్యకత ఉంటుందని మక్రాన్ అభిప్రాయపడ్డాడు. అంతేకాదు ప్రపంచంపై అమెరికా డాలర్ ఆధిపత్యం అంతం అవ్వాలని కూడా ఆయన పరోక్షంగా చెప్పాడు.

మక్రాన్ మాట్లాడింది ఫ్రెంచ్ సామ్రాజ్యవాద ప్రతినిధిగానే తప్ప శాంతి దూతగా కానేకాదు. చాలాకాలం ఇతను చైనా పట్ల కఠినంగా వ్యవహరించాలనే దృక్పథాన్ని కలిగివుండేవాడు. వలసలు ఉండటంవల్ల ఫ్రాన్స్ ఇండో-పసిఫిక్ రాజ్యంగా చలామణీ అవుతూ ఆస్ట్రేలియా, జపాన్ వంటి దేశాలతో కలిసి చైనా వ్యతిరేక కూటమిలో భాగస్వామిగా ఉంది. అయితే అమెరికా మక్రాన్‌ను పక్కనబెట్టింది. 2021లో బ్రిటన్, ఆస్ట్రేలియాలతో కలిసి అమెరికా "ఆకస్" కూటమిని ఏర్పాటు చేసినప్పుడు ఆస్ట్రేలియా 56 బిలియన్ డాలర్ల విలువైన ఫ్రెంచ్ జలాంతర్గాముల కొనుగోలును రద్దు చేసింది. దీనితో మక్రాన్ అమెరికా, ఆస్ట్రేలియా రాయబారులను ఉప సంహరించి నిరసన తెలిపాడు. అంతకు ముందే 2017లో తన సోర్బోన్ విశ్వవిద్యాలయం ప్రసంగంలో ప్రస్తావించిన "వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి"ని గురించి ప్రచారాన్ని ముమ్మరం చేశాడు.

చైనా విధానంపై మక్రాన్ చేసిన వ్యాఖ్యలు అమెరికా, ఐరోపాలలో పెద్ద దుమారాన్నే లేపాయి. చైనాను నిలువరించాలనే అమెరికా ప్రయత్నా లకు ఫ్రెంచ్ అధ్యక్షుడు అడ్డుపడుతున్నాడని న్యూయార్క్ టైమ్స్ ఆరోపిం చింది. ఐరోపా రష్యాకు వ్యతిరేకంగా చేస్తున్న యుద్ధానికి నిధులను నిలిపి వేసి వైదొలుగుతామని వాల్ స్ట్రీట్ జర్నల్ ఫ్రాన్స్‌ను బెదిరించింది. యూరోపియన్ యూనియన్, జర్మనీ కూడా తీవ్ర నిరసన తెలియజేశాయి. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ లేయెన్ కూడా మాక్రాన్‌తో చైనా పర్యటించింది. తమ పర్యటనకు ముందు చెప్పినదానికి మక్రాన్ చైనాలో చేసిన దానికి ఏమాత్రం పొంతనలేదని యూరోపియన్ కమిషన్ విమర్శించింది.

ఐరోపాలో ప్రాబల్య రాజ్య విధానం జర్మనీ, ఫ్రాన్స్‌ల మధ్య పాత తగవులను తిరగతోడుతుంది. ఈ రెండు దేశాలు ప్రత్యర్థులుగా మూడు ప్రధాన యుద్ధాలలో భీకరంగా పోరాడాయి. అమెరికా కనుసన్నల్లో ఈ రెండు దేశాల భాగస్వామ్యం, రెండవ ప్రపంచ యుద్ధానంతర ఐరోపా ఐక్యత వర్ధిల్లింది. అమెరికా భౌగోళిక రాజకీయ, ఆర్థిక కారణాల వల్ల ఐరోపాను శాంతపరుస్తోంది. ఒకవేళ ఐరోపా స్వతంత్రంగా ప్రపంచ స్థాయి ప్రాబల్య ప్రాంతంగా వృద్ధి చెందాలని జర్మనీ, ఫ్రాన్స్‌లు భావిం చినా దానికి ఎవరు నాయకత్వం వహించాలనే సమస్య అపరిష్కృతంగానే ఉంటుంది.

ఉక్రెయిన్‌లో అమెరికా కూటమి ప్రమేయంతో జరుగుతున్న యుద్ధం రోజు రోజుకూ తీవ్రతరమౌతోంది. చైనాకు వ్యతిరేకంగా అమెరికా యుద్ధానికి కాలుదువ్వుతోంది. జర్మనీ, ఫ్రాన్స్‌ల ప్రాబల్య రాజ్య కాంక్షతో పెట్టుబడిదారీ యుద్ధ ప్రమాదం ఎల్లవేళలా పొంచివుంటుందన్న వాస్తవం కళ్ళెదుటే ఉంది. సామాజిక అసమానతలను, పర్యావరణ విధ్వంసాన్ని పెంచిపోషించే పెట్టుబడిదారీ వ్యవస్థలో నెలకొన్న పరిష్కరింపజాలని సంక్షోభం సామ్రాజ్యవాద దేశాలను 1914, 1939లో జరిగినట్టుగా మరో వినాశకర ప్రపంచ యుద్ధానికి సన్నద్ధం చేస్తోంది.

25న నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సభలు

ఘనంగా నిర్వహించుకోవాలి :బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సభలను ఈ నెల 25న ప్రతి నియోజకవర్గ కేంద్రంలోనూ ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారంనాడు భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలపై పార్టీ శ్రేణులతో కేటీఆర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు అద్భుతంగా కొనసాగుతున్నాయన్నారు. మధుసూదనాచారి నేతృత్వంలోని కార్యక్రమాల అమలు కమిటీ ఆత్మీయ సమ్మేళనాల నివేదికను ఎప్పటికప్పుడు అధ్యక్షులు, సీఎం కేసీఆర్‌కు అందజేస్తున్నారని తెలిపారు. 25న నియోజకవర్గ కేంద్రంలో జరిగే ప్రతినిధుల సభలు పార్టీ అధిష్టానం నియమించిన ఇన్‌చార్జీలు, స్థానిక ఎమ్మెల్యేల అధ్యక్షతన జరుగుతాయని చెప్పారు. ఆయా జిల్లాల అధ్యక్షులు ఆ సమావేశాల నిర్వహణను సమన్వయం చేసుకోవాలని సూచించారు.

నియోజకవర్గ కేంద్రంలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో 25న ఉదయమే పార్టీ జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఆ తర్వాత ఉదయం 10 గంటల కల్లా నియోజకవర్గ కేంద్రాల్లోని సభాస్థలికి చేరుకోవాలన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ కార్యక్రమాలపై విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలోనూ కనీసం 3000 -3500 మంది ప్రతినిధులతో సభ నిర్వహించాలని నొక్కి చెప్పారు. పార్టీ గ్రామ, వార్డు అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మెన్లు, మార్కెట్ కమిటీల డైరెక్టర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జడ్పీ చైర్మెన్లు, పురపాలికల కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు, పురపాలక సంఘాల చైర్ పర్సన్లు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మెన్లు, నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జడ్పీ చైర్మెన్లు, ఇతర సీనియర్ నాయకులందరూ సమావేశాలకు హాజరయ్యేలా సమన్వయం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలను ఆదేశించారు.

ఉన్నావో బాధితురాలి ఇంటికి నిప్పు

- యూపీలో బరితెగించిన కామాంధ నిందితులు
- మృత్యువుతో పోరాడుతున్న కుమారుడు, చెల్లి



ఉన్నావో : గతేడాది లైంగికదాడికి గురైన మైనర్ దళిత బాలిక ఇంటికి కొంతమంది దుండగులు సోమవారం నిప్పంటించారు. దీంతో ఆ ఇంట్లోని ఇద్దరు చిన్నారుల పరిస్థితి విషమంగా వుంది. ఈ చిన్నారుల్లో ఒకరు బాధిత మహిళ ఆరు మాసాల బిడ్డ కాగా మరొకరు రెండు మాసాల వయస్సున్న చెల్లి. గతేడాదిలైంగిక దాడి ఫలితంగా 11ఏండ్ల బాలిక గర్భవతై బిడ్డను కందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిందితులిద్దరూ ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యారు. నిందితులిద్దరూ మరో ఐదుగురితో కలిసి సోమవారం సాయంత్రం బాధితురాలి పూరిపాకలోకి బలవంతంగా ప్రవేశించారని, కేసు ఉపసంహరించుకోవడానికి బాధితురాలు తిరస్కరించడంతో ఇంటికి నిప్పంటించినట్లు తెలుస్తోంది. బాధితురాలి తల్లిని తీవ్రంగా కొట్టి, అనంతరం ఇంటికి నిప్పంటించి పారిపోయారు. బాధితురాలి కొడుక్కి 35శాతం మేరా కాలిందని, సోదరికి 45శాతం మేరా కాలిందని చీఫ్ మెడికల్ సూపరింటెడెంట్ సుశీల్ శ్రీవాస్తవ తెలిపారు. వారి పరిస్థితి క్షీణిస్తుండడంతో మరింత మెరుగైన చికిత్స కోసం కాన్పూర్‌కు పంపినట్లు చెప్పారు. నిందితుల పక్షానికి మారిపోయిన బాధితురాలి తండ్రిపై బాధితురాలి తాతా, మేనమామలు గొడ్డలితో దాడి చేశారని పూర్వ సర్కిల్ అధికారి సంతోష్ సింగ్ తెలిపారు. ఈ నెల 13న జరిగిన ఈ ఘటనపై ఆమె తల్లి ఫిర్యాదు చేసింది. తీవ్ర గాయాలతో జిల్లా ఆస్పత్రిలో ఆమె తండ్రిని చేర్చారని తెలిపారు. 2022 ఫిబ్రవరి 13న దళిత బాలిపై సామూహిక లైంగికదాడి జరిగింది. ఆ ఏడాది సెప్టెంబరు పిల్లాడికి జన్మనిచ్చిందని పోలీసులు తెలిపారు.

జనగామ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుమతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జనగామ మెడికల్ కాలేజీకి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతించింది. 100 ఎంబీబీఎస్ సీట్లతో 2023-24 సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించుకునేందుకు అనుమతిస్తూ ఎన్ఎంసీ మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్ (ఎంఏఆర్‌బీ) మెంబర్ ప్రెసిడెంట్ జనగామ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు లేఖ రాశారు. ఇటీవల ఆసిఫాబాద్, కామారెడ్డి, ఖమ్మం, వికారాబాద్ మెడికల్ కాలేజీలకు అనుమతి లభించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ఏడాదికి గాను అనుమతి వచ్చిన కాలేజీల సంఖ్య ఐదుకు చేరాయి. మరో నాలుగు కాలేజీల అనుమతుల ప్రక్రియ చివరి దశలో ఉన్నట్టు వైద్యారోగ్యశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. జనగామ మెడికల్ కాలేజీకి అనుమతి రావడం పట్ల వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు.

అన్నిప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో.... నేటి నుంచి బూస్టర్ డోస్ పంపిణీ

- డీహెచ్ డాక్టర్ జి.శ్రీనివాసరావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కరోనా బూస్టర్ డోస్ వేసే కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభం కానున్నది. ప్రపంచవ్యాప్తంగా, దేశంలో కొన్ని రాష్ట్రాల్లో కోవిడ్-19 కేసులు పెరుగుతున్నా టీకాల పంపిణీ విషయంలో కేంద్రం బూస్టర్ డోస్ పంపిణీకి ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమే డోసుల పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా కోవిడ్-19 వ్యాక్సిన్ కొరత ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల కార్బెవ్యాక్స్ డోసులను సేకరించి సిద్ధంగా ఉంచింది. ఇప్పటికే కోవాగ్జిన్ లేదా కోవిషీల్ట్ లను మొదటి, రెండో డోసులుగా వేసుకున్న వారికి ప్రికాషనరీ డోసుగా దీన్ని వేయనున్నారు. మూడో డోసుగా దీన్ని వేసేందుకు కేంద్రం ఆమోదించింది. కాగా.... వ్యాక్సినేషన్ ప్రక్రియకు అంతరాయం కలగకుండా ఇప్పటికే అవసరమైన అన్ని ఏర్పాట్లను చేశారు. డోసులు వేసుకోకుండా మిగిలిపోయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీనివాసరావు ఈ సందర్భంగా కోరారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 26 నుంచి 30 వరకు మోడల్ ఎంసెట్, నీట్

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆర్ఎల్ మూర్తి, నాగరాజు



నవతెలంగాణ - హైదరాబాద్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య పర్యవేక్షణలో మోడల్ ఎంసెట్, నీట్ పరీక్ష ఈనెల 26 నుంచి 30 వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు, హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ గువేరా, కె అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మూర్తి, నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలను నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామీణ, పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత 18 ఏండ్ల నుంచి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సారి రాష్ట్ర వ్యాప్తంగా 300 కేంద్రాలలో ఈ మోడల్ పరీక్షలు ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ జరుగుతాయన్నారు. రాష్ట్రంలో అత్యంత నిష్ణాతులైన, అనుభవం ఉన్న ఫ్యాకల్టీ పర్యవేక్షణలో ప్రశ్నాపత్రాలను రూపొందించి పరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు. కార్పొరేట్ కాలేజీలు ఎంసెట్, నీట్, జేఈఈ కోచింగ్ పేరుతో ఏడాదికి లక్షల రూపాయలు దండుకుంటున్నాయని విమర్శించారు. పేద విద్యార్థులకు అలాంటి అవకాశం లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి కోసమే మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలను నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్, నీట్‌కు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఇది రాయడం వల్ల మెళకువలు తెలుస్తాయని, సబ్జెక్టుపై అవగాహన పెరుగుతుందని వివరించారు. ఈ పరీక్షల్లో విజయం సాధించిన టాప్ పది మంది విద్యార్థులకు బంగారు పతకాలను బహూకరిస్తామని చెప్పారు. విద్యార్థుల తరుపున పోరాటాలే కాకుండా, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఎస్ఎఫ్ఐ ఈ తరహా మోడల్ పరీక్షలను నిర్వహిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు.

మరిన్ని వివరాలకు 9490098292, 8247672658 (హైదరాబాద్-9030881429, 95151 66907) (రంగారెడ్డి-9701883081) (మేడ్చల్- 9618604620) నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా నాయకులు స్టాలిన్, శివ, వాసు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE VII SENIOR CIVIL JUDGE : CITY CIVIL COURT : AT HYDERABAD
O.S. NO. 160 OF 2017

BETWEEN :
ICICI BANK
Rep. by its Authorized Officer, Hyderabad ...**Plaintiff**
AND
VIJAYA AGRO EXPORTS ...**Defendant**

To,
1. VIJAYA AGRO EXPORTS, PLOT No. 102, EPIP PASHAMYLARAM, PATANCHERU, MEDAK.
2. VIJAYA KUMAR B, H.No. 16-3-272/1, PLOT No. 843, KPHB COLONY, HYDERABAD. ...**Defendant**

Please take notice that the Plaintiff has filed the above suit for recovery and the same is coming for your appearance on **09.06.2023.** You are hereby directed to appear before the Hon'ble VII Senior Civil Judge, City Civil Court at Hyderabad either in person or through Advocate on **09.06.2023** at **10.30 A.M.**, failing which the matter will be decided in your absence.

By order of the Court
M.V. KINI & Co.,
Advocates & Solicitors,
Office at H.No.1-8-308/5/1, No. 301 & 302, 3rd Floor, Patigadda, Begumpet, Hyderabad - 500 016

కెనరా బ్యాంక్ Canara Bank
జూబ్లీహిల్స్ బ్రాంచ్, ప్లాట్ నెం.264/ఎ, రోడ్ నెం.10, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033.
Tel:040-234367947/972 Email:cb2493@canarabank.com

లాకర్‌లో కనుగొన్న వస్తువుల వేలం ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న మా యొక్క జూబ్లీహిల్స్ బ్రాంచ్, హైదరాబాద్ యొక్క లాకర్ హోల్డర్ లాకర్ అద్దెకు సంబంధించిన నిర్దిష్ట రుసుమును అనేక నోటీసులు మరియు డిమాండ్ చేసినప్పటికీ తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. లాకర్ హోల్డర్ బ్యాంక్ వద్ద అంగీకరించిన షరతులు మరియు నిబంధనల మేరకు, బ్యాంక్ వారు లాకర్‌ను 29-07-2022 తేదీన అన్ని రకాల ఫార్మాలిటీలను పూర్తి చేసి తెరిచారు. ఈ క్రమంలో **లాకర్‌లో బంగారం మరియు వెండిని కనుగొనడం జరిగింది, వీటిని 03-05-2023** తేదీన వేలం వేయబడును. సంబంధిత లాకర్ హోల్డర్లకు సూచించడమేమనగా వారు తక్షణమే బ్రాంచ్ వారిని ద్యూ డేట్ నాటికి సంప్రదించాలి మరియు వేలం నిర్వహణకు ముందే అన్ని బకాయిలను చెల్లించి సెటిల్ చేసుకోవాలని కోరడమైనది.

క్ర.సం.	లాకర్ నెం.	లాకర్ అకౌంట్ నెంబర్	నికర బరువు	లాకర్ అద్దెకు తీసుకున్నవారి యొక్క పేరు
1	295	123001404386	0.900 గ్రాములు (బంగారం)	రామాపురం సాయినాథ్
2	295	123001404386	470.4 గ్రాములు (వెండి)	రామాపురం సాయినాథ్

తేది:19-04-2023, ప్రదేశం: హైదరాబాద్ — అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఫారం నెం.యుఆర్‌సి-2

చట్టంలోని చాప్టర్-XXI యొక్క పార్ట్-I క్రింద రిజిస్ట్రేషన్ గురించిన ప్రకటన ఇస్తున్న నోటీసు (కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్-374 (బి) మరియు కంపెనీస్ (అథారైజ్డ్ టు రిజిస్టర్) రూల్స్, 2014 యొక్క రూల్-4(1)ను అనుసరించి).

1) కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 366 యొక్క ఉప-సెక్షన్ (2)ను అనుసరించి ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, వాటాల ద్వారా కంపెనీ లిమిటెడ్‌గా కంపెనీల చట్టం, 2013లోని చాప్టర్-XXI యొక్క పార్ట్-I క్రింద "కెన్ మోర్ ఎంటర్‌ప్రైజెస్" భాగస్వామ్య సంస్థ నమోదుకు సంబంధించి రిజిస్ట్రార్, హైదరాబాద్ వారికి దరఖాస్తు చేయబడినది.

2) కంపెనీ యొక్క ప్రధాన లక్ష్యాలు దిగువ విధంగా ఉన్నవి:
ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు మరియు వాటి భాగాల హోల్‌సేల్, ఎలక్ట్రానిక్ వాల్వ్‌లు మరియు ట్యూబ్‌లు, సెమీ కండక్టర్ డివైస్‌లు, మైక్రోచిప్‌లు, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లు మరియు ప్రింటెడ్ సర్క్యూట్‌లు, ఇతర ప్రాథమిక/తయారీ చేసిన ఆహార పదార్థాల హోల్‌సేల్ వ్యాపారాన్ని కొనసాగించడానికి.

3) ప్రతిపాదిత కంపెనీ యొక్క డ్రాఫ్ట్ మెమోరాండమ్ మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ యొక్క కాపీని ఆఫీసు: ఇ.నెం.ఎంఐజి-9/డి, ఫ్లాట్ నెం.201, జెఎస్ఆర్‌వి ప్లాజా, అభిరుచి స్వగృహ స్వీట్స్ ప్రక్కన, ఎస్ఆర్ నగర్, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా-500038 వద్ద తనిఖీ చేసుకోవచ్చును.

4) ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా ఈ దరఖాస్తుకు సంబంధించి అభ్యంతరాలున్న ఎవరైనా వ్యక్తి, కంపెనీకి దాని రిజిస్టర్డు ఆఫీస్‌కు ఒక కాపీతో ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి ఇరవై ఒక రోజుల్లోపు రిజిస్ట్రార్, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (సిఆర్‌సి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ ఆఫైర్స్ (ఐఐసిఎ), ప్లాట్ నెం.6, 7, 8, సెక్టార్-5, ఐఎంటి మానేసర్, జిల్లా గుర్గామ్ (హర్యానా), పిన్‌కోడ్-122050 వారికి వ్రాత పూర్వకంగా వారి అభ్యంతరాలను తెలియజేయవచ్చును.

తేది: 17 ఏప్రిల్, 2023
ప్రదేశం: హైదరాబాద్

మెసర్స్ కెన్ మోర్ ఎంటర్‌ప్రైజెస్ తరపున
సం/- కనుమూరు మహేష్ రెడ్డి
కనుమూరు మేఘన, పార్ట్‌నర్స్

PUBLIC NOTICE

Notice is hereby given that the Certificate(s) for the undermentioned Equity Shares of the Company have been lost/misplaced and the holder(s) Purchaser(s) of the said Equity shares have applied to the Company to issue duplicate Share Certificate(s)
Any person who has a claim in respect of the said Shares should lodge the same with the Company at its Registered Office within 21 days from this date else Company will proceed to issue duplicate Certificate(s) to the aforesaid applicants without any further intimation.

Company Name	Folio Number	Share Cert. Number	Distinctive Numbers From	Distinctive Numbers To	No.of.Share
Tata Elxsi Ltd.	EXM0007780	146211	20094331	20094430	100

Date:17-04-2023

Sd/-
Mr. GUTTIKONDA MURALI MOHAN
(New Name of Share Holder)

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్ సిబ్బందిని పర్మినెంట్ చేయండి

సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖ



నవతెలంగాణ - హైదరాబాద్

రాష్ట్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి పెండింగ్ వేతనాలు, లాక్‌డౌన్ కాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు మంగళవారం ఆయన లేఖ రాశారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో సుమారు 3,070 మంది డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైమ్ తదితర పేర్లతో గత 35 ఏండ్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ శాఖ పరిధిలో పనిచేస్తున్న దినసరి వేతన కార్మికులను (డైలీవేజ్ వర్కర్స్) పర్మినెంట్ చేయాలని కోరారు. విద్యార్థుల సంఖ్య కనుగుణంగా పోస్టులను మంజూరు చేసి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పిస్తామని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, డైలీవేజ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. డైలీవేజ్, కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్ కోసం జీవో నెంబర్ 16ను 2016, ఫిబ్రవరి 26న ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. హైకోర్టు ఆఫ్ హైదరాబాద్ కూడా జీవో నెంబర్ 16 మార్గదర్శకాల ప్రకారం గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలంటూ 2017, ఏప్రిల్ 26న తీర్పునిచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో 2017, సెప్టెంబర్ 15న గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ మెమో నెంబర్ సి2/1846/2016 (సూచిక-3)ను ఇచ్చారని వివరించారు. 2016, ఫిబ్రవరి 26 నాటికి పదేండ్ల సర్వీస్ పూర్తిచేసిన వారి రెగ్యులరైజేషన్ కోసం వివరాలు అందించాలని కోరారని పేర్కొన్నారు. ఇప్పటికీ ఈ సర్క్యులర్ అమలుకు నోచుకోలేదని తెలిపారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకను గుణంగా నూతన పోస్టులను మంజూరు చేయడం లేదని విమర్శించారు. దీంతో అవసరాన్ని బట్టి విద్యార్థుల సంఖ్యకనుగుణంగా డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ పేరుతో వర్కర్లను నియ మించుకుం టున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు.

బడ్జెట్ కేటాయింపుల్లేవ్

డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఖ్యకనుగుణంగా అవసరమైన బడ్జెట్ కేటాయింపులు జరగడం లేదని జూలకంటి తెలిపారు. ఫలితంగా నెలలు, ఏండ్ల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉంటున్నాయని పేర్కొన్నారు. వారికి గత 35 ఏండ్లుగా జిల్లా కలెక్టర్ల గెజిట్ ప్రకారం వేతనాలను చెల్లిస్తున్నారని వివరించారు. కానీ ఇటీవల కొన్ని జిల్లాల్లో జిల్లా కలెక్టర్ గెజిట్‌లను అమలు చేయడం లేదని తెలిపారు. లాక్‌డౌన్ కాలంలో కార్మికులందరికీ పూర్తి వేతనం చెల్లించాలని జీఓ నెంబర్ 45ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని గుర్తు చేశారు. ఈ జీఓను అమలుచేసి గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ వేతనాలు చెల్లించాలని కోరారు. ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు రోజుకి 16 గంటలు శ్రమ చేస్తూ గిరిజన విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. వారికి కనీస వేతనాలు ఇవ్వటం లేదని పేర్కొన్నారు. జిల్లాకు ఓ రకంగా వేతనాలను చెల్లిస్తున్నారని తెలిపారు. అవికూడా సక్రమంగా ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పార్ట్‌టైమ్ పేరుతో తక్కువగా వేతనాలు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. నిత్యం నిప్పుల దగ్గర వంట చేస్తూ అనారోగ్యాల పాలవుతున్నా పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించటం లేదని వివరించారు. సరైన జాబ్ చార్ట్ లేదని తెలిపారు. విపరీతమైన పనిభారం ఉంటున్నదని పేర్కొన్నారు. కావున గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని తెలిపారు. పెండింగ్, లాక్‌డౌన్ కాలంలో వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని, ఇతర న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని జూలకంటి డిమాండ్ చేశారు.

TATA
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
సంప్రదించు చిరునామా: 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్, గణపత్రావ్ కదం మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబయి 400013 సంప్రదించాల్సిన నెం. (022) 61827414, (022) 61827375

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటెరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)

ఏదైతే, క్రింది సంతకందారు ది టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ చూపినట్లుగా తేదీన డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీతలను సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. రుణగ్రహీత, మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరురూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంలోకి తీసుకున్నారు.
ప్రత్యేకించి రుణగ్రహీత, మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అయినది, టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి దిగువ పేర్కొన్న మొత్తాలను మరియు డిమాండ్ నోటీసు తేది నుండి దానిపై వడ్డీ మరియు పెనల్ వడ్డీ, చార్జీలు, ఖర్చులు మొదలగునవి చెల్లించుటకులోబడి ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధ వహించవలసిందిగా కోరబడుచున్నది.

క్ర.సం.	రుణ ఖాతా సంఖ్య	బాధ్యులు/చట్టబద్ధ వారసులు/ చట్టబద్ధ ప్రతినిధుల పేరు	మొత్తం & డిమాండ్ నోటీసు తేది	స్వాధీనతా తేది
1.	10355098	గోల్డ్‌స్టోన్ ఇన్‌ఫ్రా (రుణగ్రహీత) శ్రీ.రవీంద్రరెడ్డి మారం, శ్రీమతి వాణిరెడ్డి మారంరెడ్డి (సహ-రుణగ్రహీత), శ్రీ.సయ్యద్ సలీముద్దీన్, శ్రీ.సయ్యద్ రియాజుద్దీన్ మరియు శ్రీమతి మెహనాజ్ ఫాతిమా (తాకట్టుదారులు)	రూ.2,90,33,417.27 (రూపాయలు రెండు కోట్ల తొంభై లక్షల ముప్పైమూడు వేల నాలుగువందల పదిహేడు & ఇరవైఏడు పైసలు మాత్రమే)	15.04.2023

సెక్యూర్డ్ అసెట్స్/స్థిరాస్తుల వివరణ: ఫుప్పల్‌గూడ గ్రామం మరియు గ్రామపంచాయతీ, రాజేంద్రనగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, టి.ఎస్.వద్దగల 11 యూనిట్ల 605.42చ.గ.ల విస్తీర్ణపు సర్వే నెం.247(పార్ట్)లోని వ్యవసాయ భూమి మొత్తం భాగం. "జెవెల్ పార్క్ పెర్ల్" నివాసిత ప్రాజెక్టు టైటిల్ (గతంలో "స్కై వెస్ట్"గా తెలిసినది) యొక్క ఫార్మింగ్ పార్ట్ మరియు సరిహద్దులు: పూర్తి విస్తీర్ణపు సరిహద్దులు: ఉత్తరం: పొరుగువారి స్థలం, దక్షిణం: పొరుగువారి స్థలం& రోడ్డు, తూర్పు: 30' వెడల్పు రోడ్ & సయ్యద్ సయీముద్దీన్‌కు చెందిన సర్వే నెం.246(బి), పడమర: కొరమయ్య సర్వే నెం.247 (పార్ట్). 70.63 చ.గ.ల విడదీయలేని స్థలభాగంతో 1730చ.అ.ల విస్తీర్ణపు బ్లాక్-ఏ 4వ అంతస్తులోని ఫ్లాట్ నెం.ఏ-402 సరిహద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: కారిడార్, పడమర: ఓపెన్ టు స్కై. 68.99 చ.గ.ల విడదీయలేని స్థలభాగంతో 1690చ.అ.ల విస్తీర్ణపు బ్లాక్-ఏ 4వ అంతస్తులోని ఫ్లాట్ నెం.ఏ-405 సరిహద్దులు: ఉత్తరం: ఏ-402, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: కారిడార్.

ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి
తేది: 15-04-2023 — టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున

బహిరంగ ప్రకటన

ICICI Bank — **బ్రాంచి ఆఫీసు:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్స్, బొమ్మనహళ్లి హౌసూర్, మెయిన్ రోడ్, బెంగళూరు-560068.

దిగువ పేర్కొన్న రుణగ్రహీత/లు వారు బ్యాంకు నుండి పొందిన రుణ సదుపాయాలకు సంబంధించి అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించుటలో డిఫాల్ట్ చెందినందున మరియు రుణాలు నాన్- పెర్ఫామింగ్ అసెట్స్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్-2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసును వారి గతంలో తెలిసిన చిరునామాలు కలిగిన వారికి నోటీసు జారీచేయబడినది, అయితే, అది వారికి చేరకుండానే వెనుదిరిగింది కావున, ఈ బహిరంగ ప్రకటన రూపేనా తెలియజేస్తున్నాము.

క్ర. సం.	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు/ (రుణ ఖాతా నెంబరు) & చిరునామా	సెక్యూర్డ్ అసెట్/ స్వాధీనం చేసుకొను ఆస్తి చిరునామా	నోటీసు పంపిన తేది/ నోటీసు తేది నాటికి బకాయి మొత్తాలు	ఎన్‌పిఏ తేది
1.	కొత్త శిల్పా/ గోన శ్రీకాంత్ రావు/ గోన వాసుదేవ రావు/ 8-6-416-1-పి, హస్తినాపురం ఈస్ట్ హస్తినాపురం, కర్మాన్‌ఘాట్,హైదరాబాద్-500079- Lbhyd00005773498/ LBHYD00005790617	కర్మాన్‌ఘాట్ గ్రామం, సరూర్‌నగర్ రెవెన్యూ మండలం, ఎల్.బి.నగర్ మున్సిపాలిటీ పరిధి, రంగారెడ్డి జిల్లా, రిజిస్ట్రేషన్ ఉప జిల్లా, హైదరాబాద్ ఈస్ట్ వద్దగల సర్వే నెం.57/8 యొక్క ఫార్మింగ్ పార్ట్ 200చ.గ.లు లేదా 167.23చ.మీ.ల విస్తీర్ణపు ప్లాట్ నెం.1 పార్ట్‌గల స్థలం యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.1 పార్ట్, దక్షిణం: ప్లాట్ నెం.1 పార్ట్, తూర్పు: 25' వెడల్పు రోడ్డు, పడమర: పొరుగువారి స్థలం.	20/03/2023 Rs. 39,79, 984.00/-	07/01/ 2023

నోటీసు సరిగా బట్వాడాఅగుట కొరకు తగిన చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు/ మరియు/లేదా వారి హామీదారులు (వర్తించినట్లుగా) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నియమాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవటంతో పాటు ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులు కాలవ్యవధిలోగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది.

తేది: ఏప్రిల్ 19, 2023 — అధీకృత అధికారి
ప్రదేశం: హైదరాబాద్ — ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా పేరుగలది)
IDFC FIRST Bank
CIN : L65110TN2014PLC097792
రిజిస్టర్డు ఆఫీసు: కెఆర్ఎం టవర్స్, 7వ అంతస్తు, హారింగ్‌టన్ రోడ్, చెట్‌పేట్, చెన్నై-600031. టెలి: +91 44 4564 4000/ ఫ్యాక్స్: +91 44 4564 4022.
అధీకృత అధికారి: శ్రీ. శివ్‌కాంత్ తివారి/ సంప్రదించు నెంబరు: **7004073072.**

అనుబంధం-4-A (రూల్ 8(6) ప్రొవిజన్ చూడండి)
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.
ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు ప్రకటన ఇవ్వడమేమనగా సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టిన/చార్జ్‌చేసిన దిగువ వివరించిన స్థిరాస్తిని, **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా పేరుగలది** యొక్క అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనంలోకి తీసుకోబడినది, దానిని **1) మధు చింతకింది, 2) చింతకింది అంజనేయులు, 3) చింతకింది** నుండి **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌కు** బకాయిఉన్న **12.04.2012** నాటికి **రూ.22,87,119.63/-** (ఇరవైరెండు లక్షల ఎనభైఏడు వేల ఒకవంద పందొమ్మిది & అరవైమూడు పైసలు మాత్రమే) యొక్క రికవరీ కొరకు "ఎక్కడ ఎలా ఉన్నది మరియు అక్కడ అలాగే ప్రాతిపదికన" **10 మే-2023**న విక్రయించబడును. **రిజర్వు ధర రూ.15,90,400/-** (రూపాయలు పదిహేను లక్షల తొంభైవేల నాలుగు వందలు మాత్రమే) మరియు **ధరావత్తు రూ.1,59,040/-** (రూపాయలు ఒకలక్ష యాభైతొమ్మిది వేల నలభై మాత్రమే) గా ఉంటుంది.

తాకట్టు ఆస్తి యొక్క వివరణ

"గ్రీన్ పార్క్", బ్రహ్మణపల్లి గ్రామం, బీబీనగర్ మండలం, యాదాద్రి-భువనగిరి జిల్లా, జి.పి.బ్రహ్మణపల్లి, ఐఎం.పి.పి.బీబీనగర్, జెడ్.పి.పి.యాదాద్రి భువనగిరి, రిజిస్ట్రేషన్ జిల్లా నల్గొండ, రిజిస్ట్రేషన్ ఉప జిల్లా బీబీనగర్ వద్దగల 284చ.గ.లు లేదా 237.42చ.మీ.లకు సమానమైన విస్తీర్ణపు ఏరియాతో సర్వే నెం.62/ఎ‌యులోని ప్లాట్ నెం.69 మొత్తం భాగం మరియు **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్‌నెం.70, **దక్షిణం:** 30' వెడల్పు రోడ్డు, **తూర్పు:** ప్లాట్ నెం.68, **పడమర:** 33' వెడల్పు రోడ్డు.
అమ్మకం యొక్క వివరణాత్మక నియమ& నిబంధనల కొరకు, దయచేసి **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్** వెబ్‌సైట్ అనగా., www.idfcfirstbank.com లో ఇవ్వబడిన లింక్‌ను పరిశీలించండి.

సం/-
అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా పేరుగలది)
తేది: 19-04-2023

పవిత్రతకు, సోదరభావానికి ప్రతీక రంజాన్

రెవెన్యూ ముఖ్యకార్యదర్శి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్

- ట్రెసా ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్‌విందు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పవిత్రతకు, సోదరభావానికి ప్రతీక రంజాన్ అని రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్ అన్నారు. రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ట్రెసా ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు వంగ రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నవీన్ మిట్టల్ మాట్లాడుతూ రంజాన్ విశిష్టతను తెలిపారు. త్యాగానికి, సోదరభావానికి ప్రతీక రంజాన్ అని, ఈ మాసంలో ముస్లీం సోదరులంతా ఎంతో భక్తి శ్రద్ధలతో ఉంటారని ఆయన తెలిపారు. మనషులంతా సమానమేనని, అందరూ సోదర భావంతో ఉండాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టెస్రా ప్రధాన కార్యదర్శి కె. గౌతమ్‌కుమార్, సీసీఎల్ఏ సెక్రటరీ కె.హైమావతి, ప్రత్యేక అధికారి సత్యశారద, ట్రెసా అసోసియేట్ అధ్యక్షులు మన్నె ప్రభాకర్, సీసీఎల్ఏ యూనిట్ అధ్యక్షులు ఎల్లారెడ్డి, ట్రెసా ఉపాధ్యక్షులు బాణాల రాంరెడ్డి, కె.నిరంజన్‌రావ్, రాష్ట్ర నాయకులు రమేష్, నజీమ్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, ఫహీంఖాద్రి, వివిధ జిల్లాల అధ్యక్షులు కె. రామకష్ణ, ఎండీ.వకీల్, సుధాకర్, సీసీఎల్ఏ యూనిట్ ముస్లిం సోదరులు, రెవెన్యూ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 52 కరోనా కేసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇటీవల కాలంలో రాష్ట్రంలో అత్యధికంగా ఒక్క రోజులో 52 కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంగళవారం కోవిడ్ స్టేటస్ బులెటిన్ విడుదల చేసింది. 40 మంది కరోనా నుంచి కోలుకున్నారు. 281 యాక్టివ్ కేసులున్నాయి. కరోనా అనుమానిత లక్షణాలున్న 7,154 మందికి టెస్టులు చేయగా వారిలో 0.71 శాతం మందిలో కోవిడ్-19 ఉన్నట్టు ఫలితాల్లో వెల్లడైంది. అంతకుముందు వారంలో సోమవారం 41, ఆదివారం 30, శనివారం 31, శుక్రవారం 43, గురువారం 45, బుధవారం 39 చొప్పున కేసులొచ్చిన సంగతి తెలిసిందే.

నిరుద్యోగుల కష్టమంతా నీటిపాలు :వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పేపర్ లీకేజీతో నిరుద్యోగుల కష్టమంతా నీటిపాలైందని వైఎస్ ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల మంగళవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యో గులు ఆత్మహత్యలకు పాల్ప డుతున్నా.. ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుకూడా లేదని విమర్శిం చారు. టీఎస్‌పీఎస్‌సీ బోర్డు అంగట్లో సరుకుగా మారిందని పేర్కొన్నారు. నిరుద్యోగుల పక్షాన గళమెత్తితే నిర్బంధాన్ని ప్రయో గిస్తున్నారని విమర్శించారు. హౌజ్ అరెస్టులు చేయిస్తున్నారని ఆరోపిం చారు. అందువల్ల ఆ బోర్డును వెంటనే ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.

HDFC WITH YOU, RIGHT THROUGH
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన (ఇ-బిడ్డింగ్ ద్వారా మాత్రమే అమ్మకం)
హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్
బ్రాంచి: హెచ్‌డిఎఫ్‌సి హౌస్, 3-6-310, హైదరాబాద్ రోడ్, బషీర్‌బాగ్, హైదరాబాద్-500029.
Tel: 67699000, CIN: L70100MH1977PLC019916, Website: www.hdfc.com

సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.
ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి కాలం (ఎ)లో పేర్కొన్న రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ప్రకటన ఇవ్వడమేమనగా, కాలం (సి)లో వివరించిన దిగువ వివరించిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టబడినవి/ చార్జ్‌చేయబడినవి, వాటిని హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్) సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క అధీకృత అధికారిచే కాలం (డి)లో వివరించినట్లు నిర్మాణాత్మకంగా/భౌతికంగా స్వాధీనం చేసుకోబడినవి, వాటిని దిగువ పేర్కొన్న వివరాల ప్రకారం "ఎక్కడ ఎలా ఉన్నది" మరియు "అది అక్కడ అలాగే ప్రాతిపదికన" విక్రయించబడుతుంది.
ఇందుమూలంగా రుణగ్రహీత/ తాకట్టుదారు(లు)/చట్టబద్ధ వారసులు, చట్టబద్ధ ప్రతినిధులు (తెలిసిన లేదా తెలియని), ఎగ్జిక్యూటర్(లు), అడ్మినిస్ట్రేటర్(లు), వారసు(లు) మరియు సదరు రుణగ్రహీతలు/తాకట్టుదారులు (మరణించిన) వారి అసైన్స్‌కు ప్రకటన ఇవ్వడమేమనగా, సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) క్రింద కాలం (ఎ)లో సూచించినట్లు, అమ్మకం యొక్క వివరణాత్మక నియమ నిబంధనల కొరకు దయచేసి, హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్) సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క వెబ్‌సైట్ అనగా www.hdfc.com లో ఇవ్వబడిన లింకును చూడగలరు.

	(A)	(B)	(C)	(D)	(E)	(F)	(G)	(H)	(I)
క్ర. సం.	రుణగ్రహీతలు/ మరియు హామీదారు(ల) పేర్లు	రికవరీచేయాల్సిన బకాయి (సెక్యూర్డ్ డెటర్) మొత్తం(రూ)	స్థిరాస్తి/సెక్యూర్డ్ అసెట్ వివరణ (1చ.మీ. అనునది 10.76చ.అ.లకు సమానం)	స్వాధీనతా విధానం	రిజర్వు ధర (రూ.)	ధరావత్తు (రూ)	వేలం తేది & సమయం	సెక్యూర్డు ఆస్తి పరిశీలన తేది	బిడ్ సమర్పించడానికి చివరి తేది
1	శ్రీ. మహ్మద్ అహ్సానుల్లా అమీర్ (రుణగ్రహీత) శ్రీ.షరీఫ్ అబ్దుల్ రవూఫ్ (పవర్ ఆఫ్ అటార్నీ)	31.08.2016 నాటికి రూ. 40,97,751/- (రూపాయలు నలభై లక్షల తొంభై ఏడువేల ఏడువందల యాభై ఒకటి మాత్రమే).	మక్తా మహబూబ్‌పేట్ గ్రామం, శేరిలింగం మండలం మరియు మున్సిపాలిటీ, రంగారెడ్డి జిల్లా వద్దగల సర్వే నెం.లు 28, 34, 35, 36, 37 & 37/ఏలోని 3 ఎకరాల 34 గుంటల పూర్తి విస్తీర్ణపు మెట్ట వ్యవసాయ ల్యాండ్స్‌లో ఆస్తి యొక్క ఫార్మింగ్ పార్ట్ మరియు 57చ.గ.ల విస్తీర్ణపు విడదీయలేని స్థలభాగంతోసహా 2 కార్ పార్కింగ్ స్పేస్‌లు నెం.జి-7 మరియు 1795చ.అ.లు లేదా 166.76చ.మీ.ల (ఉమ్మడి ఏరియాతోకలిపి) విస్తీర్ణపు "స్కై సిటీ"గా తెలిసిన బిల్డింగ్ కాంప్లెక్స్‌లో బ్లాక్-ఏ (1), (గ్రౌండ్) ఫ్లోర్‌లోని నివాసిత ఫ్లాట్ జి-7 మొత్తం మరియు సరిహద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై & ఫ్లాట్ నెం.జి-8, దక్షిణం: ఓపెన్ టు స్కై మరియు ఫ్లాట్ నెం.జి-6 తూర్పు: కారిడార్, పడమర: బ్లాక్ "బి" సంప్రదించు వ్యక్తి: శ్రీ.ఎం.పవన్ రెడ్డి, సంప్రదించు నెం.8897054206	భౌతికంగా	Rs. 51,70,000/-	Rs. 5,17,000/-	11.05.2023 ఉ.10.30గం.ల నుండి ఉ. 11.30గం.ల వరకు (అమ్మకం ముగింపు వరకు 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)	29/04/2023 11.00 AM to 4.00 PM	09/05/2023 before 5.00 PM
2	శ్రీ. రవి కిరణ్ బి (రుణగ్రహీత)	31.07.2014 నాటికి రూ. 17,64,091/- (రూపాయలు పదిహేడు లక్షల అరవైనాలుగు వేల తొంభై ఒకటి మాత్రమే).	"లక్ష్మి నగర్", గోపాలపురం గ్రామం యొక్క గ్రామ కంఠం సర్వే నెం. 1/4, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్‌లోపు, గోపాలపట్నం ఎస్.ఆర్.ఓ.లిమిట్స్, విశాఖపట్నం వద్దగల "అప్సాజి టవర్స్" యొక్క స్టిల్ట్ ఫ్లోర్‌లోని 80.00చ.అ.ల కార్ పార్కింగ్ మరియు 2వ అంతస్తులోని 1325చ.అ.లు లేదా 123.096చ.మీ.ల ప్లింత్ ఏరియాతో ఫౌండేషన్ లెవెల్ నివాసిత యూనిట్ ఫ్లాట్ నెం.ఎస్.ఎఫ్-1 వరకు నిర్మాణంతోసహా సైట్ 838.1చ.గ.లకుగాను 36.63చ.గ.లు లేదా 30.627చ.మీ.ల విస్తీర్ణపు విడదీయలేని స్థలభాగంతో సైట్ విస్తీర్ణం మొత్తం మరియు సరిహద్దులు: 2వ అంతస్తులోని ఫ్లాట్ నెం.ఎస్.ఎఫ్1 సరిహద్దులు: తూర్పు: ఓపెన్ సెట్‌బ్యాక్ స్పేస్, దక్షిణం: ఫ్లాట్ నెం.ఎస్.ఎఫ్-2 & ఉమ్మడి కారిడార్, పడమర: ఓపెన్ సెట్‌బ్యాక్ స్పేస్, ఉత్తరం: ఓపెన్ సెట్‌బ్యాక్ స్పేస్. సంప్రదించు వ్యక్తి: శ్రీ.గిరిష్ రెడ్డి, సంప్రదించు నెం.8555823418	భౌతికంగా	Rs. 29,15,000/-	Rs. 2,91,500/-	11.05.2023 ఉ.11.30గం.ల నుండి మ. 13.30గం.ల వరకు (అమ్మకం ముగింపు వరకు 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)	29/04/2023 11.00 AM to 4.00 PM	09/05/2023 before 5.00 PM

చెల్లింపు తేది మరియు /లేదా రియలైజేషన్ తేది వరకు చెల్లించిన ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు, 18% వార్షిక వర్తింపు తదుపరి వడ్డీతోసహా.
రుణభారాలు/ క్లెయింల డిస్‌క్లోజర్:హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ యొక్క అధీకృత అధికారికి తెలిసినంత వరకు మరియు సమాచారం ఉన్నంత మేరకు పై స్థిరాస్తులు/ సెక్యూర్డ్ అసెట్స్‌కు సంబంధించి ఏలాంటి రుణభారాలు లేవు.

తేది: 18-04-2023
ప్రదేశం: హైదరాబాద్
హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్
సం/- అధీకృత అధికారి
రిజిస్టర్డు ఆఫీసు: రామన్ హౌస్, హెచ్.టి.పరేఖ్ మార్గ్, 169, బ్యాక్‌బే రిక్లేమేషన్, ముంబయి-400020.

GOCL Corporation Limited
CIN: L24292TG1961PLC000876
Registered Office: IDL Road, Kukatpally, Hyderabad-500 072.
Ph: 040-23810671-9; Fax: 040-23813860;
Web: www.goclcorp.com; Email Id: secretarial@goclcorp.com

పోస్టల్ బ్యాలెట్ నోటీసు మరియు ఇ-ఓటింగ్ సమాచారం

ఇందుమూలంగా సభ్యులకు తెలియజేయునది ఏమనగా కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 108 మరియు సెక్షన్ 110లోని నిబంధనల ప్రకారం మరియు ఇతర వర్తింపదగిన నిబంధనల మేరకు, ఎప్పటికప్పుడు సవరించబడిన నిబంధనలు ('ద యాక్ట్') తో పాటు కంపెనీలు (మేనేజ్‌మెంట్ & అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014 ('ద రూల్స్') లోని నిబంధనల ప్రకారం కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం జారీ చేసిన ('ఎంసిఏ') సర్క్యులర్స్‌కు సమ్మతిగా జనరల్ సర్క్యులర్ నెం.14/2020, తేది.8 ఏప్రిల్, 2020, జనరల్ సర్క్యులర్ నెం.17/2020 తేది.13 ఏప్రిల్, 2020, నెం.20/2020, తేది:5,మే,2020, జనరల్ సర్క్యులర్ నెం.22/2020 తేది.15 జూన్, 2020, జనరల్ సర్క్యులర్ నెం.33/2020 తేది.28 సెప్టెంబర్, 2020, జనరల్ సర్క్యులర్ నెం.39/2020 తేది.31 డిసెంబర్, 2020, జనరల్ సర్క్యులర్ నెం.10/2021 తేది.23 జూన్, 2021 మరియు జనరల్ సర్క్యులర్ నెం.20/2021, తేది:8,డిసెంబర్,2021, సర్క్యులర్ నెం.03/2022, తేది:5, మే, 2022 మరియు 11/2022, తేది:28, డిసెంబర్, 2022 ('ఎంసిఏ సర్క్యులర్లు'), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ ఆఫ్ ఇండియా ద్వారా జారీ చేయబడిన సెక్రటేరియల్ స్టాండర్డ్ ఆన్ జనరల్ మీటింగ్స్ ("ఎస్ఎస్-2") మరియు సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (లిస్టింగ్ రెగ్యులేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 44 ప్రకారం మరియు సవరించబడిన నిబంధనలు (ద "ఎల్ఓడిఆర్ రెగ్యులేషన్స్") మరియు ఇతర వర్తింపదగిన నిబంధనలు, రూల్స్ మరియు రెగ్యులేషన్స్ (చట్టబద్ధమైన మాడిఫికేషన్స్ లేదా రీఎనాక్ట్‌మెంట్లు కాలానుగుణంగా సవరించబడిన నిబంధనల ప్రకారం) సభ్యుల యొక్క సమ్మతి మేరకు జిఓసిఎల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ద కంపెనీ) వారు దిగువ పేర్కొన్న తీర్మానాలకు సంబంధించి ఆమోదం కోసం రిమోట్ ఇ-ఓటింగ్ ("ఇ-ఓటింగ్") నిర్వహించనున్నారు.

తీర్మానాల యొక్క వివరణ:
1) శ్రీ జయుర్ వింతోపంత్ వారిని (డిఐఎన్: 00048789) స్వతంత్ర్య డైరెక్టర్‌గా 27,మార్చి,2023 నుంచి ఐదేండ్ల కాలపరిమితి కోసం నియమించడం.
2) శ్రీ గోపాల్ రామన్ గారిని (డిఐఎన్: 03286754) గారిని డైరెక్టర్‌గా (నాన్ ఎగ్జిక్యూటివ్ & నాన్ ఇండిపెండెంట్) నియమించడం.

ఎంసిఏ సర్క్యులర్స్‌కు అనుగుణంగా, కంపెనీ వారు పోస్టల్ బ్యాలెట్ నోటీసు 13, ఏప్రిల్,2023 యొక్క ఎలక్ట్రానిక్ కాపీలతో పాటుగా వివరణాత్మ స్టేట్‌మెంట్‌ను మంగళవారం, 18, ఏప్రిల్, 2023 తేదీన ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా కంపెనీ వద్ద /డిపాజిటరీ పార్టిసిపెంట్స్ వద్ద శుక్రవారం, 14,ఏప్రిల్, 2023 తేదీ ("కటాఫ్ తేదీ") నాటికి రిజిస్టర్ అయిన సభ్యులందరికీ వారి యొక్క ఇ-మెయిల్ అడ్రస్‌లకు ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా పంపించడం జరిగింది.
ఇ-ఓటింగ్ నిర్వహణ కోసం కంపెనీ వారు కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ వారిని ("కెఫిన్" లేదా "కెఫిన్‌టెక్") నియమించారు. రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా ఓటింగ్ నమోదు కోసం అనుసరించాల్సిన పద్ధతులను పోస్టల్ బ్యాలెట్ నోటీసులో పొందుపర్చబడింది. రిమోట్ ఇ-ఓటింగ్ విధానం **సోమవారం, 24,ఏప్రిల్,2023** ఉదయం గం.9 (ఐఎస్‌టి) ప్రారంభమై **మంగళవారం, 23, మే,2023,** సాయంత్రం గం.5కు ముగిస్తుంది. నిర్దిష్ట గడువు ముగిసిన తర్వాత కెఫిన్‌టెక్ వారు ఇ-ఓటింగ్ మాడ్యూల్‌ను నిలిపివేస్తారు.
సంబంధిత నోటీసును పొందేందుకు కంపెనీ యొక్క వెబ్‌సైట్ www.goclcorp.com వద్ద సంప్రదించాలి, బిఎస్ఇ లిమిటెడ్ ("బిఎస్ఇ") యొక్క సంబంధిత సెక్షన్ వద్ద www.bseindia.com వద్ద సంప్రదించాలి మరియు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ("ఎన్ఎస్ఇ") యొక్క వెబ్‌సైట్ www.nseindia.com వద్ద సంప్రదించవచ్చును , వీటి వద్ద కంపెనీ యొక్క ఈక్విటీ వాటాలు లిస్ట్ చేయబడి ఉంటాయి మరియు కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ వారి యొక్క (ఇంతకుముందు కెఫిన్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ ("కెఫిన్") http://evoting.kfintech.com వద్ద కూడా వివరాలను పొందవచ్చును.
సభ్యులు ఎవరైతే వారి యొక్క ఇ-మెయిల్ అడ్రస్‌లను అప్‌డేట్ చేసుకోలేకపోయారో మరియు ఎలక్ట్రానిక్ రూపంలో కంపెనీలో వాటాలను కల్గివున్న వారంతా డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌వ వద్ద వారి యొక్క వివరాలను నమోదు చేసుకోవాలి, ఒకవేళ వాటాలు భౌతిక రూపంలో ఉన్నట్లయితే కంపెనీ యొక్క రిజిస్ట్రార్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్‌కు అనగా, కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ వారికి einward.ris@kfintech.com వద్ద ఇ-మెయిల్ ద్వారా లేదా పోస్ట్ ద్వారా అయినట్లయితే సెలీనియం, టవర్ బి, ప్లాట్ నెం.31& 32, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ, హైదరాబాద్-500 032, ఇండియా చిరునామాకు పంపించాలి.
బోర్డు వారు సిఎస్ ఎ.రవికుమార్ (మెంబర్‌షిప్ నెం.ఎఫ్‌సిఎస్ 5335) (సిపి నెం.4318), మెసర్స్ రవి& సుబ్రహ్మణ్యం, ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీస్ వారిని పోస్టల్ బ్యాలెట్/ఇ-ఓటింగ్ నిర్వహణను పారదర్శకంగా నిర్వహించేందుకు వీలుగా స్క్రూటినైజర్‌గా ("స్క్రూటినైజర్") నియమించడం జరిగింది. స్క్రూటినైజర్ వారి యొక్క రిపోర్టును కంపెనీ యొక్క చైర్మన్/ మేనేజింగ్ డైరెక్టర్‌కు సమర్పిస్తారు లేదా చైర్మన్ ద్వారా నియమించబడిన అధీకృత వ్యక్తికి రిపోర్టును సమర్పిస్తారు, పోస్టల్ బ్యాలెట్ యొక్క ఫలితాలను ఇ-ఓటింగ్ నిర్వహణ ముగిసిన 48 గంటల లోపు ప్రకటించబడును. ఫలితాలను ప్రకటించే క్రమంలో స్క్రూటినైజర్ యొక్క నివేదికను పోస్టల్ బ్యాలెట్‌లో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా ప్రకటించబడును.
సందేహాలు/బాధలు/ఫిర్యాదులు ఉన్నట్లయితే, సభ్యులంతా రిమోట్ ఇ-ఓటింగ్ యొక్క యూజర్ మాన్యువల్ లేదా సహాయం కోసం మరియు తరుచుగా అడిగిన ప్రశ్నలను చూసేందుకు (ఎఫ్ఏక్యూస్) http://evoting.kfintech.com వద్ద పొందవచ్చును లేదా కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ వారిని సెలీనియం, టవర్ బి, ప్లాట్ నెం.31& 32, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ, హైదరాబాద్-500 032, తెలంగాణ, ఇండియా చిరునామా వద్ద సంప్రదించాలి, ఇ-మెయిల్: einward.ris@kfintech.com టోల్ ఫ్రీ: 1800-3094-001, లేదా కంపెనీ వారిని secretarial@goclcorp.com వద్ద సంప్రదించాలి.

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల యొక్క ఆదేశాల మేరకు
జిఓసిఎల్ కార్పొరేషన్ లిమిటెడ్ కొరకు
సం/-
ఎ.సత్యనారాయణ
కంపెనీ సెక్రటరీ
తేది:18, ఏప్రిల్, 2023.
ప్రదేశం: హైదరాబాద్

సంపాదకీయం


'లైవ్ కిల్లింగ్స్'

నేరాలకు పాల్పడడంతో జీవితం మొదలుపెట్టి రాజకీయాల్లోనూ ఎదిగిన అతీఖ్ అహ్మద్, అతని సోదరుడు అష్రాఫ్‌లను పోలీసుల సమక్షంలోనే బాహాటంగా కాల్చి చంపారు. ఈ ఉదంతం యోగీ పాలనలో రాజకీయాలు, నేరాలు ఎంతగట్టిగా పెనవేసుకు పోయాయో రుజువు చేస్తోంది. మీడియా సమావేశంలో, మీడియా ప్రతినిధులలాగా

అతీఖ్ హత్య గురించి మాట్లాడినా, జరిగిన తీరును సందేహించినా చాలా మందికి కోపం వస్తున్నది. అతిఖ్, అతని కుటుంబసభ్యులు, వారు చేసిన నేరాలు ఘోరాలు తీవ్రమైనవి. అటువంటి నేరస్తులను తీవ్రంగా శిక్షించాల్సిందే అందులో సందేహం లేదు. కానీ, కోర్టులు చేయవలసిన పనిని, ఇతర మార్గాల ద్వారా చేయడమంటే న్యాయవ్యవస్థను ధిక్కరించడమే. ఇటువంటి విధానాలను అనుసరించి హీరోలుగా మారే రాజకీయ నేతలు అంతిమంగా ఫాసిస్టు పాలనకే దోహదకారులు అవుతారు. ఇది అతీఖ్‌కు సంబంధించిన విషయం కాదు. దేశ న్యాయపాలనకు సంబంధించిన సమస్య.

మారువేషంలో వచ్చిన దుండగులు కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య ఉన్న నేరగాళ్లను హత్యచేసి, కనీసం తప్పించుకునే ప్రయత్నం కూడా చేయకపోవడం అనేక అనుమానాలను రేకెత్తిస్తోంది. పైగా హత్య చేసిన లవలేశ్ తివారీ, సన్నీ సింగ్, అరుణ్ మౌర్య "జైశ్రీ రాం" నినాదాలు చేయడం ఈ హత్యలో హిందుత్వ రాజకీయాలున్నాయి అనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. యోగీ ప్రభుత్వం వెంటనే ముగ్గురు సభ్యులతో కూడిన దర్యాప్తు సంఘాన్ని(సిట్) నియమించడం ఆహ్వానించదగ్గ విషయమే అయినా, అది కూడా పలు సందేహాలకు తావిస్తోంది.

సుప్రసిద్ధ కార్టూనిస్టు సతీశ్ ఆచార్య ఈ హత్యోదంతంపై గీసిన వ్యంగ్య చిత్రంలో వీటిని 'ప్రత్యక్ష హత్యలు!' అని వ్యాఖ్యానించారు. న్యాయదేవతను దగ్గరగా కాల్చిచంపుతున్న 'శక్తులు' ఒకవైపు, అసత్య కథనాలతో పాత్రికేయతను హత్య చేస్తున్న 'అధికార మీడియా' మరొకవైపు! ఎంతటి దౌర్జన్యమైనా చాటుమాటుగా, ముసుగులు వేసుకుని చేసే రోజులు పోయాయి! అంతా 'లైవ్'!! అన్నట్టు ఉంది యోగి పాలన తీరు. నేరాలను అదుపు చేయడం అంటే నేరస్తులను హతమార్చడం కాదు. నిందితులకైనా, నేరస్తులకైనా వారికి కోర్టు శిక్ష విధించే దాకా తగిన భద్రత కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. ఈ బాధ్యతకు అక్కడి ప్రభుత్వం పూర్తిగా తిలోదకాలు ఇచ్చింది. కాబట్టే అతి దగ్గరి నుంచి తొమ్మిది రౌండ్లు కాల్పులు జరిపినా పోలీసులు కిమ్మనలేదు. ఇదంతా గమనిస్తే ఇందులో ఏదో నిగూఢమైన లక్ష్యం ఉందన్న అనుమానం మరింత బలపడుతోంది.



ఎన్‌కౌంటర్లు, కస్టడీ హత్యల సమయంలో పోలీసులు చెప్పే కథలన్నీ పూసగుచ్చినట్టు ఒకే విధంగా ఉంటాయి. ప్రయాగ్‌రాజ్ స్క్రిప్టే ఇక్కడా పునరావృతమైంది. పేరుమోసిన గ్యాంగ్‌స్టర్లను తరలించేటప్పుడు కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. బయటి నుంచి వ్యక్తులొచ్చి పాయింట్ బ్లాంక్‌లో తుపాకీ గురిపెట్టి కాల్చడం పోలీసుల మద్దతు లేకుండానే జరుగుతుందా? ఇటువంటి ఘటనలు ప్రభుత్వానికి తెలీకుండా జరిగాయి అంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరు. ఈ హత్యలకు రెండు రోజుల ముందు గురువారం ఝాన్సీ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉమేష్‌పాల్ హత్య కేసులో నిందితులైన అతీక్ కుమారుడు అసద్, అతని సహచరుడు గులాం హతులయ్యారు. 2005లో జరిగిన బిఎస్‌పి ఎంఎల్ఎ రాజ్‌పాల్ హత్య కేసులో కీలక సాక్షి అయిన ఉమేష్‌పాల్ ఈ ఏడాది ఫిబ్రవరి 24న హత్యకు గురయ్యాడు. ఆ కేసులో అతీక్, అష్రాఫ్, అసద్, గులాం నిందితులు. ఇప్పుడు ఆ నలుగురూ హతమయ్యారు. దర్యాప్తులు, కోర్టులు ఇవేమీ లేకుండా నిందితులను లేపేయడమనే సిద్ధాంతాన్ని యోగి ప్రభుత్వం అమలు చేస్తోందని సతీశ్ ఆచార్య కార్టూన్ స్పష్టం చేస్తోంది. అది కూడా ఒక మతానికి సంబంధించిన వారే లక్ష్యం కావడం గమనార్హం.

యూపీలో యోగి ప్రభుత్వం వచ్చింది మొదలు ముస్లింల అక్రమ నిర్బంధాలు, ఎన్‌కౌంటర్లు అప్రతిహతంగా సాగిపోతున్నాయి. వాటిపై దర్యాప్తులు, విచారణలు ఏమీ ఉండవు. రాష్ట్రంలో నేరస్తుల, అసాంఘిక శక్తుల పీచమణిచేందుకు కఠినంగా వ్యవహరిస్తున్నామని యోగి సర్కారు తమ చట్ట వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక చర్యలను నిస్సిగ్గుగా సమర్థించుకుంటోంది. ఇదే సమయంలో ఆర్ఎస్ఎస్ హిందూ మతోన్మాద మూకలకు, ప్రయివేటు సైన్యాలకు పూర్తి మద్దతిస్తోంది. గోరక్షణ పేరిట ఆ రాష్ట్రంలో ముస్లింలు, దళితులపై జరిగిన దాడులు అన్నీ ఇన్నీ కావు. తరచూ పురివిప్పుతున్న మత ఘర్షణలను అదుపు చేయడంలో వైఫల్యాలను మూటగట్టుకోవడంతో పాటు ఒక వర్గానికి ప్రభుత్వం కొమ్ము కాస్తోంది.

అతీఖ్ హత్య గురించి మాట్లాడినా, జరిగిన తీరును సందేహించినా చాలా మందికి కోపం వస్తున్నది. అతిఖ్, అతని కుటుంబసభ్యులు, వారు చేసిన నేరాలు ఘోరాలు తీవ్రమైనవి. అటువంటి నేరస్తులను తీవ్రంగా శిక్షించాల్సిందే అందులో సందేహం లేదు. కానీ, కోర్టులు చేయవలసిన పనిని, ఇతర మార్గాల ద్వారా చేయడమంటే న్యాయవ్యవస్థను ధిక్కరించడమే. ఇటువంటి విధానాలను అనుసరించి హీరోలుగా మారే రాజకీయ నేతలు అంతిమంగా ఫాసిస్టు పాలనకే దోహదకారులు అవుతారు. ఇది అతీఖ్‌కు సంబంధించిన విషయం కాదు. దేశ న్యాయపాలనకు సంబంధించిన సమస్య.

సూడాన్‌లో భద్రతా దళాల మధ్య అంతర్యుద్ధం, నలుగుతున్న జనం!

ఏదైనా ఒక దేశంలో అణచివేతకు పాల్పడుతున్న భద్రతా దళాలు - తిరగబడిన ప్రజాపక్ష సాయుధ దళాల అంతర్యుద్ధం సాధారణం. దానికి భిన్నంగా ఆఫ్రికాలోని సూడాన్‌లో మిలిటరీ-పారా మిలిటరీ అధికార పోరుతో జనాన్ని చంపుతున్నాయి. ఇది రాసిన సమయానికి దాదాపు మూడు వందల మంది మరణించగా రెండువేల మందికిపైగా పౌరులు గాయపడినట్లు వార్తలు. మిలిటరీ రాజధాని ఖార్టుమ్ నగరంలో కొన్ని ప్రాంతాలపై వైమానికదాడులు జరుపుతున్నట్లు సమాచారం. ఇది అక్కడి తీవ్ర పరిస్థితికి నిదర్శనం. ఆ దాడుల్లో ఏం జరిగిందీ ఇంకా వెల్లడి కావాల్సి ఉంది. పౌరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, భద్రతా దళాలు పోరు విరమించాలని సూడాన్ కమ్యూనిస్టు పార్టీ కోరింది. ఈ నెల 12న ప్రారంభమైన పరస్పరదాడులు ఏ పర్యవసానాలకు దారితీసేదీ, అసలేం జరుగుతున్నదీ పూర్తిగా వెల్లడికావటం లేదు. ఎవరు ముందు దాడులకు దిగారన్నదాని మీద ఎవరి కథనాలు వారు వినిపిస్తున్నారు.



ఎం. కోటేశ్వరరావు

మిలిటరీ అధిపతి అబ్దెల్ ఫతా అల్ బుర్హాన్, పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్(ఆర్ఎస్ఎఫ్) అధిపతి హిమెతీ ఆధిపత్య కుమ్ములాటలే గాక వర్తమాన పరిణామాల్లో ఇంకా ఇతర అంశాలు కూడా పని చేస్తున్నాయి. గతంలో జరిగిన అంతర్యుద్ధం ముగింపు కోసం జరిగిన ఒప్పందాల్లో ఆర్ఎస్ఎఫ్ మిలిటరీలో విలీనం ఒకటి. ఒప్పందం మీద సంతకాలు జరిగిన రెండు సంవత్సరాల్లో అది పూర్తి కావాలని అంగీకరించినట్లు మిలిటరీ అధిపతి బుర్హాన్ చెబుతుండగా, కాదు పది సంవత్సరాలని హిమెతీ భాష్యం చెబుతున్నాడు. అంటే పది సంవత్సరాల పాటు ఆర్ఎస్ఎఫ్ స్వతంత్ర ప్రతిపత్తిగలిగిన సంస్థగా తన ఆధిపత్యంలో కొనసాగాలని, ఆ మేరకు తనకు అధికారంలో వాటా దక్కాలని డిమాండ్ చేస్తున్నాడు. ఇది పైకి కనిపిస్తున్న కారణంగా కనిపిస్తున్నప్పటికీ అంతకు ముందు జరిగిన పరిణామాలను బట్టి ఎవరూ మిలిటరీ పాలనకు స్వస్తి చెప్పి పౌరపాలన ఏర్పాటుకు అంగీకరించేందుకు సిద్ధం కాదని, అధికారాన్ని స్వంతం చేసుకొనేందుకే ఇదంతా అన్న అభిప్రాయం కూడా వెల్లడౌతున్నది. "సాయుధ వివాదాన్ని మరింతగా కొనసాగించటంలో రెండు శక్తులకు పరస్పర ప్రయోజనం ఉంది, దీన్ని సాకుగా చూపి పౌరశక్తులకు అధికారాన్ని బదలాయించకుండా చూస్తున్నాయని" సూడాన్ కమ్యూనిస్టు పార్టీ విదేశాంగ వ్యవహారాల కార్యదర్శి సాలె మహమ్మద్ చెప్పారు.

తాజా పరిణామాల పూర్వపరాలను ఒకసారి అవలోకిద్దాం. 1989కి ముందు ప్రధానిగా ఉన్న సాదిక్ అల్ మహదీ ప్రజావ్యతిరేకిగా మారటాన్ని అవకాశంగా తీసుకొని కుట్ర ద్వారా అల్ బషీర్ అధికారానికి వచ్చి నియంతగా మారాడు. తీవ్రమైన ఇస్లామిక్ విధానాలు, మానవహక్కుల ఉల్లంఘనలు, అణచివేతలకు పాల్పడటంతో అనేక తిరుగుబాట్లు జరిగినా వాటిని అణచివేశాడు. 2018 డిసెంబరు 19న ప్రారంభమైన నిరసనలు బషీర్ అధికారాన్ని కుదిపివేశాయి. దీన్ని డిసెంబరు లేదా సూడాన్ విప్లవంగా వర్ణించారు. మూడు దశాబ్దాల పాలన తరువాత భద్రతా దళాల తిరుగుబాటుతో 2019 ఏప్రిల్ 11న అధికారాన్ని వదులుకున్నాడు. ఆ స్థానంలో సంధికాల మిలిటరీ మండలి(టిఎంఎసి) అధికారానికి వచ్చింది.వచ్చిన వెంటనే ఇది కూడా జనాన్ని అణచివేసేందుకు పూనుకుంది. దానిలో భాగంగా ప్రజాస్వామ్యపునరుద్ధరణ కోరిన జనాలపై జూన్ మూడున రాజధాని ఖార్టుమ్‌లో భద్రతాదళాలు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి మారణకాండకు పాల్పడ్డాయి. అనేక మంది యువతులు మానభంగానికి గురయ్యారు, 128 మంది మరణించగా 650 మంది గాయపడ్డారు. తరువాత జూలై, ఆగస్టు మాసాల్లో స్వేచ్ఛ, మార్పును కోరే శక్తుల కూటమి(ఎఫ్ఎఫ్‌సి)తో టిఎంసి ఒక ఒప్పందం చేసుకుంది.దాని ప్రకారం కొత్త రాజ్యాంగ రచన,2022లో ఎన్నికలు, ఆలోగా తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు వంటి అంశాలు ఉన్నాయి. ఐదుగురు మిలిటరీ ప్రతినిధులు, ఐదుగురు పౌర ప్రతినిధులు, ఇరుపక్షాలకూ ఆమోదమైన మరొక పౌరప్రతినిధితో సంపూర్ణ అధికారాలు గల 11 మందితో మండలి ఏర్పాటు. అది మూడు సంవత్సరాల మూడునెలలపాటు కొనసాగటం, తొలి 21 మాసాలు దానికి మిలిటరీ ప్రతినిధి, మిగిలిన పద్దెనిమిది మాసాలు పౌర ప్రతినిధి అధిపతిగా ఉండటం, పౌర ప్రధాని, మంత్రి మండలిని ఎఫ్ఎఫ్‌సి నియమించటం, పదకొండు మంది ప్రతినిధుల మండలి, మంత్రివర్గ ఏర్పాటు తరువాత తాత్కాలిక పార్లమెంటు ఏర్పాటు,2019 తిరుగుబాటు, ఖార్టూమ్ ఊచకోత మీద పారదర్శకంగా స్వతంత్ర విచారణ అంశాలున్నాయి.

ఈ ఒప్పందం జరిగినప్పటి నుంచీ దానికి తూట్లు పొడిచేందుకు కుట్రలు చేశారు. 2020లో మాజీ అధ్యక్షుడు అల్ బషీర్ అనుచరులుగా ఉన్న మిలిటరీ అధికారులు తిరుగుబాటు నాటకం, ప్రధానిగా ఉన్న అబ్దుల్లా హమ్‌దోక్‌పై హత్యాయత్నం జరిగింది. దాని వెనుక ఎవరున్నదీ ఇప్పటికీ వెల్లడికాలేదంటే ప్రస్తుత మిలిటరీ పాలకులే అన్నది స్పష్టం. ఒప్పందం ప్రకారం 2021 ఫిబ్రవరిలో సర్వసత్తాక అధికార మండలి అధ్యక్షపదవి నుంచి మిలిటరీ అధికారి బుర్హాన్ తప్పుకోవాలి. దాన్ని తుంగలో తొక్కి శాంతి ఒప్పందం పేరుతో మరొక 20నెలలు కొనసాగేందుకు అంగీకరించారు. దాన్ని కూడా ఉల్లంఘించి అదే ఏడాది అక్టోబరు 25న తిరుగుబాటు చేసి పూర్తి అధికారం తనదిగా ప్రకటించుకున్న బుర్హాన్, పదకొండు మంది కమిటీని రద్దు చేశాడు. గతేడాది జరగాల్సిన ఎన్నికలూ లేవు. అణచివేతకు పూనుకున్నాడు.

ఒప్పందం ప్రకారం 2021 ఫిబ్రవరిలో సర్వసత్తాక అధికార మండలి అధ్యక్షపదవి నుంచి మిలిటరీ అధికారి బుర్హాన్ తప్పుకోవాలి. దాన్ని తుంగలో తొక్కి శాంతి ఒప్పందం పేరుతో మరొక 20నెలలు కొనసాగేందుకు అంగీకరించారు. దాన్ని కూడా ఉల్లంఘించి అదే ఏడాది అక్టోబరు 25న తిరుగుబాటు చేసి పూర్తి అధికారం తనదిగా ప్రకటించుకున్న బుర్హాన్, పదకొండు మంది కమిటీని రద్దు చేశాడు. గతేడాది జరగాల్సిన ఎన్నికలూ లేవు. అణచివేతకు పూనుకున్నాడు. ప్రజాస్వామ్యం గురించి కబుర్లు చెప్పే అమెరికా, ఇతర పశ్చిమ దేశాలూ బుర్హాన్ మిలిటరీ నిరంకుశపాలనకు ఏదో ఒకసాకుతో మద్దతు ఇస్తున్నాయి.

ప్రజాస్వామ్యం గురించి కబుర్లు చెప్పే అమెరికా, ఇతర పశ్చిమ దేశాలూ బుర్హాన్ మిలిటరీ నిరంకుశపాలనకు ఏదో ఒకసాకుతో మద్దతు ఇస్తున్నాయి. తిరిగి ప్రజా ఉద్యమం లేచే అవకాశం ఉండటం, కమ్యూనిస్టు పార్టీ, దానితో కలసి పని చేస్తున్న సంస్థలు ప్రజాస్వామ్యం కోసం ఉద్యమించటం ప్రారంభమైంది. ప్రదర్శకులపై దమనకాండకు పాల్పడి 120మందిని చంపటంతో పరిస్థితి చేయి దాటుతుందని భావించి మరొక ప్రహసనానికి తెరలేపారు. మిలిటరీ నియంత, మితవాద శక్తులతో కూడిన ఎఫ్ఎఫ్‌సి మధ్య 2022 డిసెంబరులో అధికార భాగస్వామ్య అవగాహన కుదిరింది. దాన్ని ఐదువేలకు పైగా ఉన్న స్థానిక ప్రతిఘటన కమిటీలు తిరస్కరించాయి. ఒప్పందాన్ని ఒక కుట్రగా పేర్కొన్నాయి. పాలకులు గద్దె దిగేవరకూ పోరు ఆపకూడదని నిర్ణయించాయి. తాజా అవగాహన మేరకు పౌర సమాజానికి చెందిన ప్రధాన మంత్రి మిలిటరీ దళాల ప్రధాన అధికారిగా ఉంటారు. తరువాత దీని మీద వివరణ ఇచ్చిన బుర్హాన్ విలేకర్లతో మాట్లాడుతూ మిలిటరీ ప్రధాన అధికారి అంటే నియామకాలు జరపటం గానీ, అధికారిక సమావేశాలకు అధ్యక్షత వహించటం గానీ ఉండదని, తనకు నివేదించిన వాటిని ఆమోదించటమే అన్నారు. అయినప్పటికీ ఒప్పందానికి అంగీకారమే అని ఎఫ్ఎఫ్‌సి తలూపింది. ఇంకా అనేక అంశలపై



రాజీ, లొంగుబాటును ప్రదర్శించింది. అవగాహనను ఖరారు చేస్తూ ఒప్పందంపై ఏప్రిల్ ఒకటిన సంతకాలు జరపాలన్నదాన్ని ఆరవ తేదీకి వాయిదా వేశారు. పదకొండవ తేదీ నాటికి కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావాలని, రెండు సంవత్సరాల్లో ఎన్నికలు జరపాలని చెప్పారు. కొత్త సర్కార్ ఏర్పాటు జరగలేదు. పన్నెండవ తేదీన మిలిటరీ-పారామిలిటరీ పరస్పరదాడులకు దిగాయి. దీనికి తెరవెనుక జరిగిన పరిణామాలే మూలం.

అవే మిలిటరీ-పారామిలిటరీ దళాల మధ్య తాజా ఆయుధపోరుకు దారితీశాయి. ఆర్ఎస్ఎఫ్‌ను రెండు సంవత్సరాల్లో మిలిటరీలో విలీనం చేస్తే ప్రస్తుతం దాని అధిపతిగా ఉన్న హిమెతీ అధికారుల మందలో ఒకడిగా ఉంటాడు తప్ప దానిలోని లక్ష మందికి అధిపతిగా ఇంకేమాత్రం ఉండడు. అందువలన మిలిటరీలో విలీనం పదేండ్లలో జరగాలని అతడు అడ్డం తిరిగాడు. దానికి బుర్హాన్ అంగీకరించలేదు. దానికి మరొక మెలికపెట్టి గతంలో కుదిరిన అవగాహనతో నిమిత్తం లేని ఇతర పార్టీలు, శక్తులను కూడా ఒప్పందంలో చేర్చాలని కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చాడు. మాజీ నియంత బషీర్‌కు మద్దతుదారుగా ఉన్న ఇస్లామిస్ట్ నేషనల్ కాంగ్రెస్‌ను చేర్చాలని పట్టుబడుతున్నాడు. ఈ వివాదంలో ఆర్ఎస్ఎఫ్‌కు మద్దతు ఇవ్వటం ద్వారా ఎఫ్ఎఫ్‌సి తన విశ్వసనీయతను కోల్పోయిందని గతంలో ఆ సంస్థలో ఒక ప్రధాన భాగస్వామిగా ఉండి తరువాత

అల్ బషీర్ పాలన అంతమైన తరువాత అధికారానికి వచ్చిన సంధికాలపు మిలిటరీ మండలి కొన్ని సంస్కరణల అమలు గురించి చెప్పినప్పటికీ అది కూడా పౌరుల మీద ఊచకోతకు పాల్పడింది. మిలిటరీతో రాజీపడుతున్న ఎఫ్ఎఫ్‌సి వైఖరిని తప్పుపడుతూ ఆ సంస్థ నుంచి 2020 నవంబరు ఏడున కమ్యూనిస్టు పార్టీ వెలుపలికి వచ్చింది. భావ సారూప్యత, మిలిటరీ పాలనను వ్యతిరేకించే ఇతర శక్తులతో కొత్త కూటమిని ఏర్పాటు చేసింది.దానికి విప్లవాత్మక మార్పుల శక్తులు (ఎఫ్ఆర్‌సి) అని పేరు పెట్టారు.దీని నాయకత్వాన గతేడాది భారీ ప్రదర్శనలు, నిరసన తెలిపారు.

వెలుపలికి వచ్చిన కమ్యూనిస్టు పార్టీ స్పష్టం చేసింది. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే విప్లవ కార్యాచరణకు తిరిగి ఉపక్రమించటం, ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పరచటం తప్ప మరొక మార్గం లేదని కూడా పేర్కొన్నది. నియంత బషీర్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరులో కలసి వచ్చిన ఉదారవాద, మితవాద శక్తులతో కలసి కమ్యూనిస్టు పార్టీ కూటమిలో చేరింది. అల్ బషీర్ పాలన అంతమైన తరువాత అధికారానికి వచ్చిన సంధికాలపు మిలిటరీ మండలి కొన్ని సంస్కరణల అమలు గురించి చెప్పినప్పటికీ అది కూడా పౌరుల మీద ఊచకోతకు పాల్పడింది. మిలిటరీతో రాజీపడుతున్న ఎఫ్ఎఫ్‌సి వైఖరిని తప్పుపడుతూ ఆ సంస్థ నుంచి 2020 నవంబరు ఏడున కమ్యూనిస్టు పార్టీ వెలుపలికి వచ్చింది. భావ సారూప్యత, మిలిటరీ పాలనను వ్యతిరేకించే ఇతర శక్తులతో కొత్త కూటమిని ఏర్పాటు చేసింది.దానికి విప్లవాత్మక మార్పుల శక్తులు (ఎఫ్ఆర్‌సి) అని పేరు పెట్టారు. దీని నాయకత్వాన గతేడాది భారీ ప్రదర్శనలు, నిరసన తెలిపారు.

సూడాన్‌లో జరుగుతున్న పరిణామాల్లో పారామిలిటరీ దళాలు రాజధానిలోని అధ్యక్ష భవనాన్ని, విమానాశ్రయాన్ని పట్టుకున్నట్లు నిర్ధారణగాని వార్తలు వచ్చాయి.మరోవైపు ఈ దళాలు రక్షణ కోసం పౌరనివాసాల్లో చేరి రక్షణ పొందుతున్నట్లు మరికొన్ని వార్తలు. ఈ నేపథ్యంలో కోటి మంది జనాభా ఉన్న ఖార్టుమ్, పరిసర ప్రాంతాలపై మిలిటరీ వైమానిక దాడులకు పాల్పడుతున్నట్లు ఒక కథనం. ఆ దాడులు జరుపుతున్నది ఈజిప్టు మిలిటరీ అని కూడా చెబుతున్నారు. ఇవన్నీ కూడా గందరగోళం కలిగిస్తున్నాయి. సూడాన్ మిలిటరీ, పారామిలిటరీ ప్రజలను అణచివేసేందుకే గతంలో పని చేసింది. పాలకులు కిరాయి మూకలను సమీకరించి డార్ఫర్, ఇతర ప్రాంతాల్లో ప్రజా ఉద్యమాన్ని అణచివేశారు. తరువాత వాటిని 2013లో పారామిలిటరీగా మార్చారు. ఇటీవలి అధికార పంపిణీలో మిలిటరీ నేత, పారామిలిటరీ నేతలు ఇద్దరూ అధికార వ్యవస్థను ఆక్రమించారు. పారామిలిటరీ అధిపతికి బంగారు గనులు కూడా ఉన్నాయి. నియంత బషీర్‌ను గద్దె దింపిన తరువాత దేశ రిజర్వుబ్యాంక్‌కు వంద కోట్ల డాలర్లను అందచేశాడంటే ఏ స్థితిలో ప్రజల సంపదలను కొల్లగొట్టిందీ అర్థం చేసుకోవచ్చు. బహుశా ఇది కూడా తాజా ఘర్షణలకు మూలం కావచ్చు. ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

సెల్:8331013288



ఇంకా తేరుకోని నవాడా

ఎంతో ఉత్సాహంగా, భక్తిభావంతో పండుగ జరుపు కుంటున్న ప్రజలకు ఏం తెలుసు? కొద్దిసేపటికే అక్కడ పెద్ద ఎత్తున హింస చెలరేగుతుందని? తమ కండ్ల ముందే అంతా సర్వనాశనం అవుతుందని? బీహార్‌లోని నవాడాలో గత నెల 31న చోటుచేసుకున్న మతపరమైన హింసాకాండ, విధ్వంసం నుండి ఇంకా ఆ ప్రాంతం తేరుకోలేదు. ఎక్కడ చూసినా కాలిబూడిదైన వాహనాలు, తగలబడిపోయిన దుకాణాలు, ఇళ్లు, దోపిడీకి గురైన వ్యాపార సము దాయాలే కన్పిస్తున్నాయి. ఎప్పుడూ ప్రశాంతంగా కన్పించే ఈ పురాతన నవాడా పట్టణంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా జరిగిన ఊరేగింపు హింసకు దారితీసింది. ఇప్పటికీ రోడ్లపై చెల్లాచెదురుగా పడి ఉన్న రాళ్లు, పగిలి పోయిన గ్లాసు ముక్కలు ఆ దారుణ ఘటనకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తుంటే, అల్లరిమూకలు చెలరేగిపోయి కొన్ని గంటల పాటు విధ్వంసాన్ని సృష్టించారు.

అయితే వాస్తవానికి అక్కడ జరిగిందేమిటి? రామనవమి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించేందుకు బజరంగ్‌దళ్ సంస్థకు అధికారులు అనుమతి ఇచ్చారు. ఆ రోజు దుకాణాలు తెరవద్దంటూ నిర్వాహకులు అంతకు ముందు ప్రచారం చేశారు. శోభాయాత్రకు యాభై వేల మంది హాజరయ్యారని జిల్లా మెజిస్ట్రేట్ శశాంక్ శుభంకర్ చెప్పారు. అయితే కేవలం ఐదు వేల మందికి మాత్రమే అనుమతి ఉంది. పోలీసుల సంఖ్యతో పోలిస్తే ప్రదర్శనకారుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. డీజేలు ఉపయోగించడం, ఆయుధాలు ధరించడం వంటి చర్యలను నిషేధించామని అధికారులు చెబుతున్నప్పటికీ ట్రక్కులపై పెద్ద పెద్ద లౌడ్‌స్పీకర్లను ఏర్పాటు చేశారు. రెచ్చగొట్టే పాటలు, నినాదాలను వినిపించారు. ఊరేగింపు ఒక మసీదు వద్దకు చేరగానే డీజేలలో వినిపించిన పాటల స్వరం ఒక్కసారిగా మారిపోయింది. రామమందిరం నిర్మిస్తామని, ముస్లింలకు వేరే స్థలం చూపుతామని, వారు కూడా రామనామమే జపించాలని నినాదాలు విన్పించాయి. 'వారిని చంపండి... లేదా పాకిస్థాన్‌కు పంపండి' అనే పాట విన్పించారు. ఇలాంటి రెచ్చగొట్టే పాటలు వేస్తూ... అభ్యంతరకరమైన నినాదాలు చేస్తూ... ఊరేగింపులో ముందుకు కదిలారు. జిల్లా మెజిస్ట్రేట్ కూడా దీనిని అంగీకరించారు. అయితే పోలీసులు స్వాధీనం చేసుకున్న సీడీలు, పెన్‌డ్రైవ్‌లలో అలాంటి నినాదాలు, పాటలు వినిపించలేదని సెలవిచ్చారు.

'డీజేలను నిషేధించాం. అయితే వాటిని బలవంతంగా తొలగించ లేకపోయాం. అలా చేస్తే పరిస్థితి మరింత విషమిస్తుంది' అని మెజిస్ట్రేట్ చెప్పుకొచ్చారు. ప్రదర్శన మసీదు ముం దుకు రాగానే కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే ఇరుపక్షాల పెద్దలు నచ్చచెప్పడంతో ప్రదర్శన ముందుకు సాగింది. ఈ దశలో కొందరు గూండాలు ఇద్దరు ముస్లిం యువకులను అడ్డగించి జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేయాలని బలవంత పెట్టారు. నిరా కరించిన యువకుడిని తీవ్రంగా హింసించారు. అంతలోనే ఒక శ్మశానవాటిక వద్ద కాషాయ జెండాను ఎగరేయడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఇరు పక్షాలు పరస్పరం ఘర్షణకు దిగాయి. తొక్కిసలాట జరిగింది. దుండగులు రెండు బస్సులకు నిప్పుపెట్టారు. వాహనాలు, దుకాణాలు, ఇళ్లను తగలబెట్టారు. ముందస్తు ప్రణాళికతోనే ఈ విధ్వంసానికి పాల్పడ్డారు. అధికార జేడీయూకు చెందిన నాయకుడి సిటీ ప్యాలెస్‌కు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో మూడంతస్తుల ఆ మ్యారేజ్‌హాలు పూర్తిగా ధ్వంసమైంది. వెయ్యి మంది సాయుధ దుండగులు ఆ భవనాన్ని చుట్టుముట్టడంతో ఎవరూ అక్కడికి వెళ్లలేకపోయారు. అదే సమయంలో అల్లరిమూకలు రోడ్లపై రాళ్లు రువ్వారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. డీవీఆర్‌ను ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎవరూ స్పందించ లేదు. అగ్నిమాపక వాహనాలు వచ్చేసరికే అంతా బూడిద అయింది. సిటీ ప్యాలెస్ ఎదురుగా ఉన్న ఓ హోటల్‌కు కూడా దుండగులు నిప్పంటించారు. జనరేటర్‌ను తగలబెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. విద్యుత్ సర ఫరా నిలిచి పోవడంతో సీసీటీవీ కెమేరాలు పని చేయలేదు. ముస్లింల దుకాణాలు, ఇళ్లు, ప్రార్థనా స్థలాలే లక్ష్యంగా దాడులు జరిగినట్టు ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. సుమారు వెయ్యి మంది మతోన్మాదులు ఓ మసీదులో ప్రవేశించి రెండు గుమ్మటాలను కూల్చేశారు. క్యాంపస్‌లో నిలిపివున్న వాహనాలను తగలబెట్టారు. సుమారు 45నిమిషాల పాటు విధ్వంసం సాగినా పోలీసులు ఆ ఛాయలకు కూడా రాలేదు. పండ్లు, కూరగాయలు అమ్ముకునే వారిని కూడా దుండగులు వదలలేదు. వారికీ జీవనోపాధి లేకుండా చేశారు. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు.

మరో ఘటనలో వెయ్యి మంది మతోన్మాదులు పెట్రోల్ బాంబులతో మదర్సాపై దాడి చేసి తగలబెట్టారు. లైబ్రరీలోని ఐదు వేల పుస్తకాలు అగ్నికి ఆహుతయ్యాయి. 'డిజిటల్ దునియా' పేరిట షాపు నడుపుతున్న ఆజామ్ తన అనుభవాన్ని వివరిస్తూ తన దుకాణాన్ని అల్లరిమూకలు దోచుకున్నారని వాపోయారు. ఇప్పటివరకూ ఎవరూ తనకు సాయపడలేదని చెప్పారు. బీహార్‌లో రామనవమి సందర్భంగా జరిగిన హింసాకాండ చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచిపోతుంది. ఈ ఘటన అనేక మంది హృదయాలను గాయపరిచింది. ఆ గాయాలు మానడానికి చాలా సమయం పడుతుంది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

ప్రత్యామ్నాయ వివాహ పద్ధతికై ఓ ప్రయత్నం...

ప్రత్యామ్నాయ వివాహ పద్ధతులు కోరుకుంటున్న వారు ఏ అంశాలకు ప్రాధాన్యత యివ్వాలో ఒక కుటుంబం ఎదుర్కొన్న సమస్యలు - పరిష్కారానికై చేసిన కృషి-అనుభవాలు.

మా పెద్దమ్మాయి తను ప్రేమించిన తన క్లాస్‌మెట్ ఇద్దరూ పెళ్ళి చేసుకుంటామన్నారు. ఓకే అన్నాం. కాని ఆ అబ్బాయి వారిది సాంప్రదాయ కుటుంబం. కులాంతర వివాహానికి వారిని ఒప్పించటానికి అబ్బాయి ఎంతో కృషి చేయాల్సి వచ్చింది. పెండ్లి ప్రత్యామ్నాయ పద్ధతిలో జరగాలన్న దానిపై మరో సమస్య ఎదురైంది. సాంప్రదాయ వాదులను కూడా మెప్పించేలా ప్రత్యామ్నాయ వివాహ పద్ధతిని రూపొందించటం, ఆ పద్ధతికూడా వినోదంతో కూడిన వేడుకగా ఉండాలనే పిల్లల అభిప్రాయాలకు అనుగుణంగా రూపొందిచాల్సిన అవసరం ఏర్పడింది.


అలాంటి తగిన వివాహ పద్ధతికై వామపక్ష, అభ్యుదయ వాదులను సంప్రదించటం జరిగింది. కాని నమూనాగా ఏమీ దొరకలేదు. కుటుంబంలో మొదట కొంత నిరుత్సాహపడ్డాం. దాదాపు 4 దశాబ్దాలు పైగా ఉద్యమంలో పనిచేస్తున్నాం. ఇంట్లో పిల్లలు అభ్యుదయ పద్ధతిలో పెండ్లి చేసుకోవటానికి సిద్ధంగా ఉంటే వారికి ఒక పద్ధతి చూపెట్టలేని స్థితిలో ఉండటం అన్యాయమనిపించింది. కుటుంబంలో పట్టుదల పెరిగింది. విషయం అర్థం చేసుకున్న కుటుంబ సభ్యులు, కొద్దిమంది ఉద్యమ సహచరులు తోడుగా నిలిచారు.

వివిధ ప్రదేశాలలో జరుగుతున్న పెళ్ళిళ్ళ రీతులపై మా పరిశీలన ప్రారంభమయ్యింది. దేశంలో వివిధ ప్రాంతాలలో జరిగే సాంప్రదాయ పెండ్లిండ్లలో సింపుల్గా జరిగే పద్ధతులు కూడా కనిపించాయి. కొన్ని చోట్ల తాళి, కాలి మెట్లకు ప్రాధాన్యతే లేదు. మరికొన్ని చోట్ల జీలకరబెల్లం, కన్యాదానం చేసే పద్ధతే లేదు. సింపుల్‌గా చేసుకునే సాంప్రదాయ పెండ్లి కేరళీయులలో కనిపించింది. అమ్మాయి, అబ్బాయి ఎన్నికలోనే ఎంతో అభ్యుదయంగా ఈశాన్య రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాలలో కొనసాగుతున్నది. మొదట అమ్మాయి అబ్బాయిని ఎన్నిక చేసుకొని తన తల్లిదండ్రులకు చెపుతుంది. అబ్బాయి వారి తల్లిదండ్రులతో మాట్లాడి పెళ్ళి నిర్ణయించటం జరుగుతుంది. ఈ పద్ధతి ఎంతో అబ్బుర మనిపించింది. అన్ని సాంప్ర దాయ పెండ్లిండ్లలోనూ మతాచారాలతో పాటు వేడుకగా జరుపుకునే పద్ధతులు కూడా ఎక్కువగా కనిపించాయి. తెలుగు రాష్ట్రాల మైదాన ప్రాంతాల్లో జరుగుతున్న హిందూ వివాహ పద్ధతుల్లో స్త్రీ, పురుషుల మధ్య అసమానతలకు అవకాశం ఉండే రీతులు ఎక్కువగా ఉన్నాయని అర్థమైంది.

వధూవరుల మధ్య అసమానతలకు అవకాశం లేకుండా, వివాహం వేడుకగా జరిగేలా ఇరు కుటుంబాల ఆమోదంతో వివాహ పద్ధతి రూపొందించటానికి దాదాపు 6 మాసాలు పట్టింది. ఎదుర్కోలు, సన్నాయి మేళం, వధూవరులపై పూలు జల్లుతూ వేదికపైకి ఆహ్వానించటం, ప్రమాణ పత్రాలు చదివించటం, ఉంగరాలు మార్చిడి, దండలు మార్చుకోవటం, అనంతరం పూలతో తలంబ్రాలు పోసుకోవటంతో వివాహం పూర్తవుతుంది. ఆ తరువాత ప్రశ్నలతో వేడుకగా వధూవరులతో వేదికపైనే ఆటలాడించటం జరిగింది. పెండ్లికి హాజరయిన అతిథులను ఈ పద్ధతి ఎంతో అలరించింది. అందులో సాంప్రదాయ పెళ్ళిని ఎక్కువగా యిష్టపడే బంధు మిత్రులు కూడా తాళి, కన్యాదానం లాంటివి మినహా, వివాహం ఎంతో వేడుకగా, ఆహ్లాదకరంగా చేశారని అభినందనలు తెలిపారు. ఉభయ కుటుంబాలకు ఎంతో రిలాక్స్ అనిపించింది. అభ్యుదయ వివాహం ఇంత వేడుకగా ఉంటే మేం కూడా ఇలాంటి పెండ్లి చేసుకుంటామని కొన్ని తెలిసిన కుటుంబాల యూత్ కొందరు కలిసి చెప్పారు. 2015 నవంబర్ నుండి నేటి వరకు మమ్మల్ని సంప్రదించి ఉభయ రాష్ట్రాల్లో దాదాపు 10మంది ఈ పద్ధతిలో వివాహం చేసుకున్నారు.

ఇక రెండో అమ్మాయి పెండ్లి విషయంలో మరొక సమస్య ఎదురైంది. తెలిసిన పెద్దలు అమ్మాయికి ఒక సంబంధాన్ని సూచన చేశారు. అబ్బాయి తల్లిదండ్రులు కుటుంబ నేపథ్యం చాలా బాగుంది. వామపక్ష భావాలున్న కుటుంబం. రెండు కుటుంబాల తరపున ఈ పెండ్లి జరిగితే బాగుంటుదనుకున్నాం. కానీ పిల్లలిద్దరికి గతంలో అసలు పరిచయమే లేదు. పిల్లలిద్దరూ ముందు మాట్లాడుకోవాలని ఇరు కుటుంబాల వారం భావించాం. కేవలం పెద్దల నిర్ణయంతో కాకుండా పిల్లలు ఇష్టపడి పెండ్లి చేసుకోవాలనుకున్నాం. పిల్లలిద్దరూ ఒక నిర్ణయానికి రావటానికి 9 మాసాల సమయం తీసుకున్నారు. ఆ తరవాత ఇద్దరూ ఇష్టపడి పెండ్లి చేసుకుంటామన్నారు.

ఇక వివాహ పద్ధతిపై ఇద్దరు పిల్లల మధ్య, రెండు కుటుంబాలలోనూ చర్చలు జరిగాయి. వైవాహిక జీవితం లోకి అడుగిడే వధూవరుల మధ్య అసమానతలకు అవకాశం లేకుండా, వివాహం వేడుకగా జరపాలని భావించాం. గత అనుభవంతో వివాహాన్ని ఇంకా మెరుగ్గా చేయాలనుకున్నాం. పెళ్ళిసందడి సమయం అందరికి అనుకూలంగా



సాయంత్రం 6గంటలకు అనుకున్నాం.

వధూవరుల తల్లి దండ్రులు నలుగురం సాయంత్రం 6గంటల నుండి వేదిక గేటు వద్ద విచ్చేసిన బంధు మిత్రులకు ఆహ్వానం పలికాం. అదే సమయంలో సన్నాయి బృందం స్టేజిపైన పెండ్లి పాటలతో అలరించారు. సాయంత్రం 6గంటల 30నిమిషాలకు వధువు, వరుడు బంధు మిత్ర బృందాలతో హాలులోకి రెండు వైపుల నుండి ప్రవేశించారు. ఇరు బృందాలు, ఎదుర్కోలుతో పరామర్శలు, చమత్కార సంభాషణలు నడిచాయి. ఆ తరువాత వధూవరులు ఒకరికొకరు స్వీటు తినిపించుకున్నారు. అనంతరం సన్నాయి బృందం స్వాగతంతో వధూవరులు ముందు నడువగా, వారి వెనక కుటుంబ సభ్యులు, మిత్ర బృందం అనుసరించారు. వేదిక వద్దకు వెళ్లే దారిలో ఇరు వైపుల అమ్మాయిలు, అబ్బాయిలు నిలబడి పూలు జల్లుతూ వధువు వరులకు స్వాగతం పలికారు. స్టేజిపైకి వధూవరులు-వారి కుటుంబ సభ్యులను పిలిచారు. పెళ్ళి పెద్ద 'ఐద్వా' రాష్ట్ర నాయకురాలు స్వరూప రాణిని పెండ్లి నిర్వహణకై వేదిక పైకి ఆహ్వానించారు. వధూవరులతో మొదట ప్రమాణ పత్రాలు చదివించారు. ప్రమాణ పత్రాలపై సాక్షుల సంతకాల అనంతరం ఉంగరాలు, దండలు మార్చుకున్నారు. వధూవరు లిద్దరు దంపతులుగా మారినట్లుగా పెళ్ళి పెద్ద ప్రకటించారు. నేటి అవసరాలకనుగుణంగా జరుగుతున్న ఈ వివాహ పద్ధతి గురించి, వైవాహిక జీవితంలో దంపతులు ప్రాణమిత్రులుగా మెలగాల్సిన విషయాలపై పెళ్ళి నిర్వాహకురాలు కొద్దిసేపు మాట్లాడారు. ఆ తర్వాత పూల తలంబ్రాలు పోసుకునే వేడుక కొంతసేపు నడిచింది. అనంతరం వైవాహిక జీవితం భవిష్యత్తులో సుఖ సంతోషాలతో గడపటానికి అవసరమైన సూచనలు, నిబంధనలతో పెళ్ళి ఒప్పందాన్ని స్నేహితులు వధూవరులకు అందచేశారు. తగిన సమాధానాలతో వధూవరులు స్పందించి సంతకాలు చేయటం వినోద భరితంగా సాగింది. ఆ తర్వాత వధూవరులు ఒకరి పట్ల మరొకరికి ఉన్న అంచనాలపై అడిగిన ప్రశ్నలు, చమత్కారంగా వారిచ్చిన సమాధానాలతో వినోద భరితంగా జరిగింది. సాంప్రదాయ పద్ధతి కాదు కనుక పెండ్లిలో తరువాత సీను ఏం ఉంటుందోనన్న ఆసక్తితో పెళ్ళికొచ్చిన అతిథులందరూ చివరి వరకూ తిలకించారు. వేడుకలో భాగస్వాములయ్యారు.

ఈ వివాహ పద్ధతిలో వధూవరుల మధ్య జెండర్ వివక్షతకు తావు లేకుండా, వైవాహిక జీవితంలో ఇద్దరూ సమానమేనన్నది ప్రామాణికంగా తీసుకోవటం జరిగింది. ఈ వివాహ వేడుకలో సాంప్రదాయానికి సంబంధించినవి కొన్ని, మరి కొన్ని నేటి కాలానికి సంబంధించిన వాటిని కలిపి పెట్టడం

ప్రత్యామ్నాయమంటే ఉన్న దాంట్లో నుండి మెరుగైనది సృష్టించటమే కదా, అంతేగాని పాతవాటిని పూర్తిగా తొలగించి ప్రత్యామ్నాయాన్ని శూన్యం నుండి సృష్టించలేం! అలాంటి వాటికి జనామోదం కూడా కష్టమే! ఈ వివాహ పద్ధతిలో అర్థంకాని అంశాలు ఏమీ ఉండవు. పెళ్ళికి వచ్చిన అతిథుల్లో వీలయినంత మందిని వేడుకలో భాగస్వామ్యులను చేయవచ్చు. ఆచరణలో ప్రత్యామ్నాయ పద్ధతులకై శక్తికొలది ప్రయత్నం చేయాలన్న ధోరణి, సమాజ మార్పు కోసం కృషి చేసే వారిలో ఉంటేనే, ప్రజలపై ప్రభావం ఉంటుంది.

జరిగింది. ఉదా: ఉంగరాలు, తలంబ్రాలు (బియ్యం బదులు పూల తలంబ్రాలు వాడాము) తరతరాలుగా పెళ్ళికి సింబల్‌గా గుర్తింపు పొందినవి. అందులో వధూవరుల మధ్య అసమానతలకు అవకాశం లేదు. పైగా అందరి నుండి ఆమోదం కూడా ఉంటుంది.

ప్రత్యామ్నాయమంటే ఉన్న దాంట్లో నుండి మెరుగైనది సృష్టించటమే కదా, అంతేగాని పాతవాటిని పూర్తిగా తొలగించి ప్రత్యామ్నాయాన్ని శూన్యం నుండి సృష్టించలేం! అలాంటి వాటికి జనామోదం కూడా కష్టమే! ఈ వివాహ పద్ధతిలో అర్థంకాని అంశాలు ఏమీ ఉండవు. పెళ్ళికి వచ్చిన అతిథుల్లో వీలయినంత మందిని వేడుకలో భాగస్వామ్యులను చేయవచ్చు. ఆచరణలో ప్రత్యామ్నాయ పద్ధతులకై శక్తికొలది ప్రయత్నం చేయాలన్న ధోరణి, సమాజ మార్పు కోసం కృషి చేసే వారిలో ఉంటేనే, ప్రజలపై ప్రభావం ఉంటుంది. ప్రత్యామ్నాయ పద్ధతి అమలులో కుటుంబంలో సమస్య ఎదురవగానే పరిష్కారానికి కృషి చేయకుండా, రాజీ ధోరణికి అలవాటు పడితే ప్రత్యామ్నాయాలకై ప్రజల్లో నిజాయితీగా ప్రచారం చేయలేం. ప్రత్యామ్నాయ పద్ధతులకై మార్పు కోరుకునే వారికి మా ఈ చిరు ప్రయత్నం ఉపయోగ పడాలనే ఉద్దేశంతో అందరి దృష్టికి తీసుకొస్తున్నాం.

- పద్మ హరి, 9493216695
- సీహెచ్. కృష్ణారావు.9490098586

సంతోషం మీ సొంతం...

కొందరు ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్న వారిలో దిగులుగా ఉంటారు. వారి ముఖంలో మచ్చుకైనా ఆనంద కనిపించదు. అలాంటి వారు ఇతరులకు సాయం చేయండి. అందులో ఎంతో ఆనందం ఉంటుంది. ఇలా సాయం చేయడం, అందరితోనూ దయగా మెలగడం వల్ల మన శరీరంలో ఆక్సిటోసిన్ హార్మోన్లు విడుదలై సంతోషంగా ఉంటామని పరిశోధనలు చెబుతున్నాయి.



❑ అన్ని విషయాలు మనం అనుకున్నట్లే జరగాలనీ, అందరినీ సంతృప్తి పరచాలనీ అనుకోవద్దు. పరిస్థితులు ఎలా ఉన్నా మన పరిధిలో ఉన్న విషయాల మీదే దృష్టి సారించాలి. అప్పుడు ఒత్తిడికి లోనవకుండా ఆనందంగా ఉండగలం.

❑ రోజూ వారీ పనులు, బాధ్యతల్లో ఒకదానికొకటి మిళితం చేయకుండా మనకు సంతోషాన్నిచ్చే ఏదో ఒక పని కోసం నిత్యం కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. పాటలు పాడటం, డ్యాన్స్ వేయడం, వయొలిన్ వాయించడం, చిత్రలేఖనం, ఆటలు ఇలా ఏదో ఒక పనిలో భాగస్వాములవ్వాలి.

❑ రోజూ నవ్వడానికి ప్రయత్నించాలి. నవ్వినప్పుడే వర్తమాన జీవితాన్ని సంతోషంగా ఆస్వాదించగలం.

❑ మంచి లేదా చెడు దేన్నైనా సమానంగా స్వీకరించాలి. ప్రతి విషయాన్ని తవ్వుకుంటూ కూర్చుంటే ప్రయోజనం ఉండదు.

❑ జీవితంలో మనం పొందిన ప్రతి ఒక్క దానికి కృతజ్ఞతా భావంతో ఉండాలి. నిరాశా నిస్పృహలు దరిచేరినప్పుడు మనం ఏమేం పొందామో తలచుకొని సంతోషంగా ఉండగలగాలి.

❑ అసలు వ్యాయామం చేయని వాళ్లకంటే రోజులో కనీసం పది నిమిషాల పాటు కసరత్తులు చేసేవాళ్లు ఎక్కువ సంతోషంగా ఉంటారని పరిశోధనలు చెబుతున్నాయి. కాబట్టి మీ దినచర్యలో వ్యాపామాన్ని భాగం చేసుకోండి.



ఘాలి లలితా ప్రవల్లిక... రచనల్లో వైవిధ్యం ఆమె ప్రత్యేకం. రాసేది సమాజ హితమై ఉండాలని కోరుకునే రచయిత్రి. స్వచ్ఛమైన తెల్లటి కాగితమంటి పిల్లలు నైతిక విలువలు మరుస్తున్నారని నిత్యం ఆవేదన చెందుతుంటారు. సాహిత్యం ఆ లోటును భర్తీ చేయాలని తపిస్తున్నారు. విలువలతో కూడిన, విజ్ఞాన వంతమైన సాహిత్యాన్ని సమాజం ముందు ఉంచుతున్న ఆమె సాహిత్య ప్రస్థానం ఆమె మాటల్లోనే...

రచనల్లో నైతిక విలువలుండాలి

కృష్ణాజిల్లా వేమవరం గ్రామంలో పుట్టాను. విశాఖ, కృష్ణాజిల్లాల్లోని పల్లె వాతావరణంలో పెరిగాను. అమ్మ అచ్యుతం, గృహిణి. మా నాన్న నందిగామ హనుమంతరావు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా విశాఖ జిల్లాలోని వివిధ గ్రామాలలో జడ్పీ హైస్కూల్లో పని చేశారు. నా విద్యాభ్యాసం రెండో తరగతి వరకు పెందుర్తిలో జరిగింది. ఐదో తరగతి వరకు సబ్బవరం, పదో తరగతి మునగపాకలో పూర్తి చేసి ఇంటర్ కోసం అనకాపల్లిలో చేరాను. తర్వాత నెల్లూరు వి.ఆర్ లా కాలేజీలో చదివాను. నా బీఏ ఉస్మానియా యూనివర్సిటీ. బీఈడీ ఆంధ్ర యూనివర్సిటీ. ఎమ్మె తెలుగు వెంకటేశ్వర యూనివర్సిటీ. అయితే సెకండ్ ఇయర్ ఎగ్జామ్స్ రాయలేదు.



లైబ్రరీలోనే ఎక్కువ సమయం

చిన్నప్పటి నుంచి పుస్తకపఠనం మీద ఆసక్తి ఉండేది. ఏ పుస్తకం కనపడినా వదలకుండా చదివేదాన్ని. విశాఖ జిల్లా మునగపాకలో ఉన్నప్పుడు మా ఇంటి ఎదురుగా లైబ్రరీ ఉండటంతో ఎక్కువ సమయం అందులోనే గడిపే దాన్ని. అయితే పిల్లల కథలు, పుస్తకాలు తప్పించి నవలలు చదవొద్దనే వారు ఇంట్లో. నాన్న నిద్రపోగానే దాచుకున్న డిటెక్టివ్ నవలలు తీసి చదువుకునేదాన్ని. మళ్లీ వాటిని యదా స్థానంలో పెట్టేదాన్ని. లైబ్రేరియన్‌కి బుక్స్‌కి స్టాంపింగ్స్, కౌంటింగ్‌లలో సహాయం చేసి లైబ్రరీ మూయగానే కొన్ని బుక్స్ ఇంటికి తెచ్చుకునేదాన్ని. మళ్లీ లైబ్రరీ తీసేసరికి ఆ బుక్స్ వారికి అందించేదాన్ని. ఈ విధంగా చాలా పుస్తకాలు చదివాను.

అందరి ప్రభావంతో...

నాన్న డ్రిల్ మాస్టర్. వారు చిన్న చిన్న నాటికలు, బుర్ర కథలు రాసి స్కూల్ పిల్లల చేత వేయించేవారు. మా పెదనాన్న సీతారామాంజనేయ శర్మ వారు స్కూల్ హెడ్మాస్టర్. వారు జానపద పాటలు రాసి స్కూల్ పిల్లల చేత డాన్సులు వేయించేవారు. మా మేనమామ వేమవరపు కృష్ణ బ్రహ్మం పాటలు రాసేవారు. వారి ప్రభావమో లేక పుస్తక పఠన ప్రభావమో తెలియదు కానీ నేను మాత్రం చిన్న వయసులోనే రాయాలనే కోరికతో పిల్ల కవిత్వానికి ఊపిరి పోశాను.

ఒకే మూసలో ఇష్టం ఉండదు

రాయడంలో మా నాన్నే నా స్ఫూర్తి. అంతేకాదు యండమూరి వీరేంద్రనాథ్ నవలలు విస్తృతంగా చదివేదాన్ని. ఆ విధంగా వివిధ ప్రక్రియల్లో రాయాలనే కోరిక ఉండేది. అలాగే రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలి, శ్రీశ్రీ మహాప్రస్థానం. ఈ రెండూ నాకు బాగా నచ్చేవి. ఏ మంచి రచన చదివినా వారిలా నేనూ రాయాలని అనిపించేది. ఒకే మూసలో, ఒకే ముద్రతో రాయటం మాత్రం నాకు ఇష్టం ఉండదు.

గొలుసు నవలలు

కవితలు, కథలు, గజల్స్, గేయాలు పద్యాలు, నానీలు ఇలా ఎన్నో ప్రక్రియల్లో రచనలు చేశాను. 'మట్టి పాదాలు' కవితా సంపుటి, 'ఆహా కథాకుసుమాలు', 'మర్మదేశం' సైంటిఫిక్ ఫిక్షన్ బాలల నవల ఇప్పటి వరకు నేను ముద్రించిన పుస్తకాలు. నిహారిక, మానసవీణ, పసరు కథలు, గొలుసు నవలలలో ఒక భాగంగా రాసాను. 26 మందితో 'వీరభద్ర గుట్ట' అనే గొలుసు నవల రాయించాను. ప్రస్తుతం 108 మందితో 'మాయా లోకం' అనే మరో గొలుసు నవల రాయిస్తున్నాను. పిల్లలచే 'నల్ల హంస' అనే గొలుసు నవల రాయించే ప్రయత్నంలో ఉన్నాను. నా 'మర్మదేశం' నవల ఎందరో మహానుభావుల ప్రశంసలు పొందింది. ఇంకా కొన్ని కథలు, కవితలు, ఓ నవల, గజల్స్, శతకాలు పుస్తకాలుగా తీసుకురావలసి ఉంది.

నైతిక విలువలు నేర్పాలి

సాహిత్య ప్రభావం సమాజంపై ఎక్కువగా ఉంటుంది. సమాజాన్ని మార్చడంలో, తీర్చి దిద్దడంలో సాహిత్యం కూడా కీలకపాత్ర పోషిస్తుంది. మన అమ్మ, బామ్మ, అమ్మమ్మ, తాతయ్యలు చెప్పే పంచతంత్ర, పేదరాశి పెద్దమ్మ, చందమామ కథలతోనే మొదలవుతుంది మన జీవితం. ఆ ప్రభావం పిల్లల మీద ఎంతగానో పనిచేస్తుంది. అందుకే అప్పట్లో నీతి కథలు చెప్పే వారు పిల్లలకు. వారి ప్రవర్తనను తీర్చేదిద్దగలిగేది కథలే. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు, కామిక్ బుక్స్ కరువైపోయాయి. బిజీబిజీ జీవితాల్లో ఫోన్ చేరువయ్యింది. అప్తులు దూరమయ్యారు. సినిమాల ప్రభావం పిల్లల మీద ఎక్కువగా పడుతోంది. మంచి కన్నా చెడుని ఎక్కువగా స్వీకరిస్తూ అవినీతిపరులుగా, సంస్కార హీనులై, మూర్ఖత్వం మూసలో మునిగితేలుతున్నారు. పాటలకు అర్థాలు తెలియకపోయినా పరవశించి పాడుతు న్నారు. బుల్లితెర సీరియల్స్‌లో లీనమై కన్నీరు కారుస్తున్నారు. అందుకే రచయితలు తమ రచనల ద్వారా మంచి చెడుల విచక్షణ తెలియజేయాలి. నైతిక విలువలు తెలియజేసే రచనలు చేయాలి.

అవకాశాలు వదులుకోవల్సి వస్తుంది

మహిళ అంటేనే కొన్ని సమస్యలు ఇంట్లో, బయట తలెత్తుతాయి. ముఖ్యంగా పత్రికలలో మన రచనలు చూసి ఫోన్ నెంబర్లు చూసి ఫలానా రచన బాగుంది అని ఫోన్లు చేస్తూ ఆ పరిచయాన్ని కంటిన్యూ చేయడానికి చూసే మగవాళ్ళు చాలామంది ఉంటారు. వెకిలి మాటలతో వేధించే వాళ్ళూ ఉంటారు. తమ రచనలలో ఉన్నతమైన భావాలతో మహిళలను గౌరవించే కవులు సైతం మహిళా రచయిత్రుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం నేను గమనించాను. కొన్ని నేను ఎదుర్కొన్నాను. అలాంటి వారిని దూరం పెట్టాను. ప్రతి రచయిత్రికి పైకి రావాలనే కోరిక ఉంటుంది. కొన్ని కార్యక్రమాల కోసం ఇతర ప్రాంతానికి వెళ్ళవలసి వచ్చేటప్పుడు చాలా సమస్యలు ఎదురవుతాయి. ఇంట్లో వారి సహకారం లేకపోతే ఒంటరిగా ఆ మహిళ ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒంటరిగా వెళ్లలేని మహిళలు మాత్రం తమకు వచ్చిన కొన్ని అవకాశాలను వదులుకోవాల్సి వస్తుంది.

సామాజిక అభ్యున్నతికై...



ఓ రచయిత్రిగా రేపటి భవితను తీర్చిదిద్దడం నా లక్ష్యం. నైతిక విలువలు తెలుపుతూ, సామాజిక చైతన్యం కలిగించే దిశలో రచనలు చేయాలి. పక్షపాతం లేకుండా, కల్మషం ఎరుగక నా కలం దేశ, సామాజిక అభ్యున్నతి దిశగా సాగిపోవాలి. సమాజ హితం కోరే రచనలు చేయడమే నా కర్తవ్యం. అలాగే కీర్తి ప్రతిష్టలు తెచ్చే మరిన్ని రచనలు చేయాలని అనుకుంటున్నాను. బాల, బాలికలను రచయితలుగా తీర్చిదిద్దాలనేదే నా కోరిక.

సమన్వయం కష్టమే...

కుటుంబం, ఉద్యోగం, సాహిత్యం... ఈ మూడింటి సమన్వయం అంత తేలికైనది కాదు. కచ్చితంగా సమస్యలు ఎదురవుతాయి. నెల్లూరులో ఉన్నప్పుడు స్కూల్ టీచర్‌గా, పార్ట్ టైం కాలేజీ లెక్చరర్‌గా, ట్యూషన్స్, ఇల్లు ఇంట్లో పనులు, సాహిత్య మీటింగులతో సతమతమయ్యే దాన్ని. ప్రైవేట్ స్కూలు టీచర్‌గా చాలా చాకిరీనే ఉండేది. సమయం దొరికేది కాదు. ఆరోగ్యం బాగుంది కనుక పరుగులు తీసేదాన్ని. ప్రస్తుతం ఉద్యోగ బాధ్యత నుంచి వైదొలిగాను. ఎందుకంటే స్కూల్ పిల్లలను ఆడిస్తూ కింద పడి వెన్ను విరిగిపోయింది. దాంతో ప్రస్తుతం ఇంట్లోనే ఉంటున్నాను.

పురస్కారాలు...

ఇప్పటి వరకు నేను చేసిన సాహిత్య సేవకు గాను జిల్లా కలెక్టర్‌చే ఉగాది పురస్కారాలు, గురజాడ అప్పారావు ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి రాష్ట్రీయ పురస్కారం, సావిత్రిబాయి పూలే, ఆదర్శ మహిళా, పాతూరి మాణిక్యమ్మ కీర్తి పురస్కారం, గుర్రాల రమణమ్మా సాహితీ పురస్కారం, గుఱ్ఱం జాషువా పురస్కారం, సత్యశ్రీ పురస్కారం, గాడ్ఫాదర్ ఫౌండేషన్ నుంచి సాహితీ పురస్కారం, సరోజినీ నాయుడు సాహితీ పురస్కారం, విద్వాన్ విశ్వం ఉత్తమ కథా పురస్కారం, అక్షరయాన్ నుంచి తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా, తానా వారి నుంచి 10,000 నగదు, సరోజినీ నాయుడు ఎక్స్ లెన్స్ అవార్డు, ప్రతిలిపి బెంగుళూరు వారి నుంచి 'సాహితీ విశారద' బిరుదు, తెలుగు కవితా వైభవం హైద్రాబాదు వారి నుంచి సహస్ర కవిమిత్ర పురస్కారాలు అందుకున్నాను.

\- సలీమ



పంజాబ్‌లో కదం తొక్కిన గోధుమ రైతులు

(మొదటిపేజీ తరువాయి)

బఠిండా, ఫిరోజ్‌పూర్, సంగ్రూర్, ఫజిల్కా, గురుదాస్‌పూర్, తరన్‌తరన్ సహా పలు ప్రాంతాలలో రైళ్ల రాకపోకలను రైతులు అడ్డుకున్నారు. కొన్ని చోట్ల పట్టాలపై టెంట్లు కూడా వేశారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న గోధుమలను కొనుగోలు చేసే సమయంలో కేంద్రం ధరను తగ్గించడాన్ని నిరసిస్తూ రైల్‌రోకో చేపట్టామని బీకేయూ (ఏక్తా ఉగ్రహణ్) ప్రధాన కార్యదర్శి సుఖ్‌దేవ్ సింగ్ కొక్రికలాన్ తెలిపారు. కేంద్ర నిర్ణయం రైతు వ్యతిరేకమని విమర్శించారు. సంక్షోభ సమయంలో రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం గోధుమల ధరను తగ్గించి కొనడం దారుణమని ఫిరోజ్‌పూర్‌లో ఓ రైతు సంఘం నేత ఆవేదన వ్యక్తం చేశారు. కాగా పంజాబ్, చండీఘర్, హర్యానా, రాజస్థాన్‌లో గోధుమ సేకరణకు సంబంధించి నాణ్యతా నిబంధనలను ప్రభుత్వం సడలించిందని, రైతుల ప్రయోజనాలు కాపాడటమే దీని ఉద్దేశమని ప్రభుత్వ అధికారి ఒకరు గత వారం తెలిపారు. చెడిపోయిన, ముక్కిపోయిన గోధుమల కొనుగోలుకు సంబంధించి ఆరు శాతం వరకూ ఎలాంటి ధర తగ్గింపు ఉండదని ప్రభుత్వం చెబుతోంది.

వర్షాల కారణంగా దెబ్బతిన్న గోధుమల అమ్మకంలో రైతులకు జరిగే నష్టాన్ని తమ ప్రభుత్వం భరిస్తుందని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ చెప్పారు.

మత హింసకు పండుగలు ఆయుధాలా?

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. మధ్యాహ్నం నమాజ్ చేస్తుంటే దుండగులు తమ ఇళ్లపై రాళ్లు రువ్వారని ఖేరున్నీసా అనే మహిళ వాపోయింది. ఆ ప్రాంతంలో దేవాలయం ఏమీ లేదని, హిందువులు కూడా ఎవరూ నివసించడం లేదని, అలాంటప్పుడు అక్కడ వారికి ఏం పనని ప్రశ్నించింది. పోలీసులు వచ్చేసరికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని స్థానికులు తెలిపారు. మధ్యాహ్నం, సాయంత్రం ప్రార్థనలు జరిగేటప్పుడే దుండగులు విధ్వంసానికి పాల్పడ్డారని చెప్పారు. గత సంవత్సరం కూడా ఇదే విధంగా అల్లర్లు జరిగాయని లౌకికవాదంపై అధ్యయనం చేస్తున్న కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ నేహా ధబాడే గుర్తు చేశారు. ముస్లింలను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేందుకు హిందూ పండుగను ఓ ఆయుధంగా వాడుకుంటున్నారని ఆమె చెప్పారు. హింసాకాండ అనంతరం ముస్లింలను కేసుల్లో ఇరికిస్తున్నారని అన్నారు. పోలీసులు అమాయకులను నిర్బంధించి ప్రశ్నిస్తున్నారని, మహిళలు సహా అనేకమంది ముస్లింలను అరెస్ట్ చేస్తున్నారని తెలిపారు. ఒకవైపు హింసను సహించబోమని చెబుతూనే రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలను వేధిస్తోందని ధబాడే విమర్శించారు. హిందువుల పండుగలపై ముస్లింలు దాడులు చేస్తున్నారంటూ ఎదురు కేసులు పెడుతున్నారని ఆమె వాపోయారు.

ఎందుకు విడుదల చేశారు?

(మొదటిపేజీ తరువాయి)

వచ్చేనెల 2న చేపట్టనున్నది. ఈ కేసులో నోటీసులు అందిన అందరు దోషులు తమ స్పందనను సమర్పించాలని ఆదేశించింది. రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేసే విషయంలో వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని కేంద్రానికి, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. 2002లో గుజరాత్‌లోని గోద్రా అల్లర్ల సమయంలో బిల్కిస్ బానోపై సామూహిక లైంగికదాడి, ఆమె కుటుంబ సభ్యుల హత్యను భయంకరమైన చర్యగా సుప్రీంకోర్టు గతనెల 27న అభివర్ణించింది. ఇతర హత్యల కేసుల్లో పాటించినట్టుగానే ఈ కేసులో దోషులకు రెమిషన్ కల్పించడంపై ఏకరీతి ప్రమాణాలు పాటించారా? అని ఆ సమయంలో గుజరాత్ ప్రభుత్వాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది.

బాధితురాలు బిల్కిస్ బానో దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రం, గుజరాత్ ప్రభుత్వం, ఇతరులు తమ స్పందనను తెలియజేయాలని ఆదేశించింది. ఈ కేసులో 11 మంది దోషుల రెమిషన్‌కు అనుమతినిస్తూ వారిని విడుదల చేయడాన్ని బిల్కిస్ బానో సవాలు చేశారు. అలాగే, సీపీఐ(ఎం) నేత సుభాషిణి అలీ, స్వతంత్ర పాత్రికేయురాలు రేవతి లాల్, లక్నో యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ రూప్ రేఖా వర్మ, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రా లు కూడా ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)లు దాఖలు చేసిన విషయం విదితమే. దోషులను గుజరాత్ ప్రభుత్వం గతేడాది ఆగస్టు 15న విడుదల చేసిన విషయం తెలిసిందే.

మే 4 లేదా 5న నిరుద్యోగంపై సమర శంఖం

(మొదటిపేజీ తరువాయి)

ఎంతో మంది యువకులు ఉద్యమం చేస్తేనే రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో యువత సమిధలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు.

ఉద్యోగాల హామీనే మోడీతోనే అధికారంలోకి...

ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామనే హామీతోనే నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చారని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆ లెక్కన ఇప్పటికీ 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా, కానీ ఆ మాటను నిలబెట్టుకోకుండా నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. ఉద్యోగాల కోసం ఇప్పటికే 22.6 కోట్ల దరఖాస్తులు వస్తే, 7,22,311 ఉద్యోగాలిచ్చామంటూ పార్లమెంట్‌లో ఒక ప్రశ్నకు ప్రధాని సమాధానమిచ్చారని గుర్తు చేశారు. దీంతో నిరుద్యోగులను మోసం చేసినట్టు ప్రధాని అంగీకరించారని గుర్తు చేశారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే ఒకే రోజులో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్ అంటున్నారనీ, బండి మాటలు వింటే నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ భారీ వరదల సమయంలో బండి సంజయ్ మాట్లాడుతూ... బైక్ పోతే బైక్ ఇస్తామంటూ హామీనిచ్చారని గుర్తు చేశారు. ఆ తర్వాత ఇన్సూరెన్స్ ఉంది కదా? అని చెప్పి మాట తప్పారని విమర్శించారు. అసలు ఏ శాఖలో ఎన్ని ఉద్యోగ ఖాళీలుగా ఉన్నాయో బండికి తెలుసా? అని ప్రశ్నించారు. ప్రస్తుతమున్న ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం కాదనీ, ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఇంటికో ఉద్యోగమని సీఎం కేసీఆర్, ఒకే రోజు 2లక్షల ఉద్యోగాలని ఇస్తామంటూ బండి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రజాక్షేత్రం నుంచి పార్లమెంట్ వరకు నిరుద్యోగుల కోసం కొట్లాడింది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు.

బండిగారూ...నిరుద్యోగ మార్చ్ మోడీ ఇంటి దగ్గర చేయండి

బీజేపీ తలపెట్టిన నిరుద్యోగ మార్చ్ హైదరాబాద్‌లో కాదనీ, మోడీ ఇంటి దగ్గర చేయాలని రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా బండికి సూచించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ పాపం ముమ్మాటికీ రాష్ట్ర సర్కారుదేనని ఆరోపించారు. ఈ కేసును సీబీఐతో విచారణ చేయించాల్సిందేనని డిమాండ్ చేశారు. పేపర్ లీకులో అసలు నిందితులు తప్పించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో కేటీఆర్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలనీ, సంబంధిత కమిషన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మేకిన్ ఇండియా అంటే ప్రయివేటీకరణేనా?

(మొదటిపేజీ తరువాయి)

ముసుగులో పీఎస్‌యూలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న ప్రధాని నరేంద్రమోడీ వైఖరి ఏమాత్రం సరికాదని అన్నారు. మెదక్ ఆర్డినెన్సు ఫ్యాక్టరీకి వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా సిక్ యూనిట్‌గా చిత్రీకరించి మూసేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని, వాటిని తిప్పి కొడతామని హెచ్చరించారు. ఆ ఫ్యాక్టరీలో యుద్ధ ట్యాంకర్లు, బుల్లెట్ ప్రూఫ్, ల్యాండ్ మైన్స్ ప్రూఫ్ వాహనాలు, లాంచర్లు వంటి దేశ రక్షణ కోసం కీలక ఉత్పత్తులు తయారవుతాయని పేర్కొన్నారు. అందు వల్ల ఆ కార్మాగారానికి వర్క్ ఆర్డర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీలో పని చేస్తున్న సుమారు మూడున్నర వేల మంది ఉద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడటం మానుకోవాలని ప్రభుత్వానికి హితవుపలికారు. వినోద్‌కుమార్‌తో భేటీ అయిన వారిలో మెదక్ ఆర్డినెన్సు ఫ్యాక్టరీ జేఏసీ నాయకులు రమణారెడ్డి, ప్రభు, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, శివకుమార్, రాజయ్య, యాదగిరి, అశోక్, మల్లికార్జున్‌రెడ్డి, ప్రభు, శివశంకర్‌నాయక్, బీఆర్‌ఎస్. కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ ఉన్నారు.

ఇజ్రాయెల్ జైళ్లలో ఖైదీలుగా 5 వేల మంది పాలస్తీనీయులు

గాజా : ఆక్రమిత భూభాగం కోసం ఇజ్రాయెల్ సైన్యం పాలస్తీనాపై గత కొన్నేళ్లుగా దాడులు సాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ దాడుల్లో ఎంతోమంది పాలస్తీనియన్లు మృతి చెందారు. మరెంతోమంది పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్నారు. తాజాగా ఇజ్రాయెల్ జైళ్లలో ఐదు వేల మంది పాలస్తీనియన్లు ఖైదీలుగా ఉన్నారని ఓ నివేదిక వెల్లడించింది. ఫిబ్రవరి 17వ తేదీ పాలస్తీనా ఖైదీల దినోత్సవం సందర్భంగా ఖైదీలు, మాజీ ఖైదీల వ్యవహారాల కోసం ఏర్పాటు చేసిన పాలస్తీనా కమిషన్, పాలస్తీనియన్ ఖైదీల సంఘం, ఖైదీల మద్దతు.. మానవ హక్కుల కోసం ఏర్పాటు చేసిన అడ్డమీర్ అసోసియేషన్, పాలస్తీనియన్ సమాచార కేంద్రం వాడి హిల్వే సంయుక్తంగా వెల్లడించిన నివేదిక తెలిపింది. ఇజ్రాయెల్ అధికారికంగా సుమారు 4,900 మంది పాలస్తీనియన్లను ఖైదీలుగా బంధించింది. వారిలో 31 మంది మహిళలు, 160 మంది మైనర్లు, 1000 మంది ఎక్కువ మందిని ఎలాంటి అభియోగం లేకుండా నిర్బంధంలో ఉన్నారని ఆ నివేదిక బహిర్గతం చేసింది.


విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్లు ఏర్పాటుచేశామన్నారు. ఉచిత బస్‌పాస్ సౌకర్యం, డయాలసిస్ పేషెంట్లకు రూ.2000 పింఛన్ సీఎం కేసీఆర్ అందిస్తున్నారని చెప్పారు. ఉద్యమ నాయకునిగా ఈ ప్రాంతంలో పర్యటించిన కేసీఆర్ ఇక్కడి ప్రజల అవస్థలు చూసి చలించిపోయారన్నారు. మునుగోడు, నాంపల్లి, చండూరు, నారాయణపురం మండలాలకు పీహెచ్‌సీలు 24 గంటలపాటు ఉండేలా చేస్తామన్నారు. కేంద్రం నిధులు ఇవ్వకున్నా సీఎం కేసీఆర్ 8 మెడికల్ కాలేజీలు ప్రారంభించారని, ఈ ఏడాది మరో 9 మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం పట్టణాలు, పల్లెల్లో బస్తీ దవాఖానాలు ఏర్పాటుచేశామని, ఏప్రిల్ చివరిలోపు రాష్ట్రమంతటా న్యూట్రిషన్ కిట్లు అందిస్తామన్నారు. నాడు వైద్యానికి, విద్యకు కరువు ప్రాంతంగా ఉన్న రాష్ట్రం నేడు సూపర్ స్పెషాలిటీ వైద్యానికి, నాణ్యమైన వైద్య విద్యకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. 2014కు ముందు తెలంగాణలో 20 మెడికల్ కాలేజీలు ఉంటే 2022 నాటికి 46కు చేరుకున్నాయని, ఈ ఏడాది 9 కలుపుకుంటే మొత్తం 55కు చేరుతుందన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో వైద్య కళాశాలలు ఏర్పాటుచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 26 జిల్లాల్లో కళాశాలలు ఏర్పాటుచేశామన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో కేవలం 35శాతం మాత్రమే ప్రసవాలు జరగగా ప్రస్తుతం 64శాతానికి పెరిగిందన్నారు. బీబీనగర్‌లోని ఎయిమ్స్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం 2018లో 200 ఎకరాల భూమిని కేటాయిస్తే ప్రధానమంత్రి మోడీ ఇటీవల శంకుస్థాపన చేసి గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న వైద్య సేవల పట్ల నీతి అయోగ్‌ను 15వ ఆర్థికసంఘం ప్రశంసలు కురిపించిందని తెలిపారు. చౌటుప్పల్‌లో నూతనంగా ఏర్పాటుచేస్తున్న వంద పడకల ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్‌నూ అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, సింగిల్‌విండో చైర్మెన్ చింతల దామోదర్‌రెడ్డి, పల్లె రవికుమార్‌గౌడ్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పదేండ్లలో గణనీయమైన వృద్ధి

(మొదటిపేజీ తరువాయి)



తయారు చేసిన ఏకైక భారతదేశ నగరంగా హైదరాబాద్ ఘనత సాధించింది. గతంలో ఒకసారి 2012లో (సిఒపి 11 సమావేశం) హైదరాబాద్, 2017లో కోల్‌కత్తా నగర జీవవైవిధ్య సూచిని రూపొందించాయని చెప్పారు. అయితే, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా బయోడైవర్సిటీ ఇండెక్స్‌ను తిరిగి రెండోసారి రూపొందించిన నగరంగా హైదరాబాద్ రికార్డులకు ఎక్కిందన్నారు. నగరంలో ఉన్న జీవవైవిధ్య పరిరక్షణ, పర్యవేక్షణ, అభివృద్ధికి ఈ బయోడైవర్సిటీ ఇండెక్స్ ఎంతగానో ఉపయోగపడనుందని చెప్పారు.

నివేదికలోని వివరాలు..

బయోడైవర్సిటీ రంగంలో సింగపూర్ చేసిన భాగస్వామ్యానికి గుర్తింపుగా దీన్ని సింగపూర్ ఇండెక్స్ పేరుతో పిలుస్తున్నారు. నగర జీవవైవిధ్యం సూచీ వల్ల ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న బయోడైవర్సిటీ కన్జర్వేషన్ ప్రయత్నాలు, ఈ రంగంలో స్థానిక ప్రభుత్వాలు అందిస్తున్న సహకారం, జీవవైవిధ్య వృద్ధి కోసం రూపొందించిన మార్గదర్శకాలు వంటి మెత్తం 23 రకాల అంశాలను కొలమానంగా తీసుకొని, ఈ సూచీని రూపొందించారు. తాజాగా జీహెచ్‌ఎంసీ ఈ బయోడైవర్సిటీ ఇండెక్స్ కోసం జరిపిన అధ్యయనంలో 92 మార్కులకుగాను 57 మార్కులను సాధించింది. అయితే, 2012లో నగరంలో అప్పుడు జరిపిన బయోడైవర్సిటీ ఇండెక్స్ అధ్యయనంలో 36 మార్కులు మాత్రమే లభించాయి. పది సంవత్సరాలుగా హైదరాబాద్‌లో జీవవైవిధ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాల వల్ల బయోడైవర్సిటీ సూచీలో గణనీయమైన వృద్ధిని సాధించింది.

జీవవైవిధ్యానికి కేంద్రాలుగా..

హైదరాబాద్‌లో ప్రస్తుతం దాదాపు రెండు వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న 1350కి పైగా జల వనరులు, 1600 హెక్టార్లలో విస్తరించిన సహజ రాళ్లగుట్టలు(రాక్ ఫార్మేషన్స్), రెండు జాతీయ పార్కులు(కేబీఆర్‌తో పాటు హరిణి వనస్థలి) నగరంలో జీవవైవిధ్యానికి ఎంతగానో దోహదం చేస్తున్నాయని ఈ నివేదికలో తేలింది. దీంతోపాటు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, ఇక్రిసాట్ వంటి సంస్థలకు ఉన్న సువిశాలమైన క్యాంపస్‌లు జీవవైవిధ్యానికి కేంద్రాలుగా ఉన్నాయని తేలింది. హైదరాబాద్‌లో 1305 వృక్షజాతులు ఉండగా, 577 ప్రాంతీయ వృక్ష జాతులు, 728 ఇతర ప్రాంత వృక్ష జాతులు నగరంలో ఉన్నాయని తేలింది. 30 రకాల తూనీగ జాతులు, 141 జాతుల సీతాకోక చిలుకలు, 42 రకాల సాలీడు పురుగులు, 60 రకాల చేపలు, 16 రకాల ఉభయచర జాతులు, 41 రకాల సరీసృపాలు, 315 పక్షి జాతులు, 58 క్షీరదాలు ఉన్నట్టు ఈ నివేదికలో వెల్లడైంది.

అధికారులకు మంత్రి అభినందనలు

హైదరాబాద్ నగరం కోసం ప్రత్యేకంగా జీవవైవిధ్య సూచీ నివేదికను తయారు చేసిన అధికారులను మంత్రి కేటీఆర్ అభినందించారు. ప్రపంచ స్థాయి నగరంగా మారే పరిణామ క్రమంలో జీవవైవిధ్యం అత్యంత కీలకమైన అంశమన్నారు. జీవించు– జీవించనివ్వు అన్న స్ఫూర్తి ఆధారంగా నగరీకరణ జరిగినప్పుడే ప్రకృతితో మమేకమై బతకగలిగే పరిస్థితి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరితహారం, చెరువుల సంరక్షణ – బలోపేతం, అడవుల పెంపకం, అర్బన్ లంగ్ స్పేసెస్ వంటి అభివృద్ధి కార్యక్రమాలు నగర జీవవైవిధ్యానికి ఎంతగానో ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. జూన్ 5వ తేదీన అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి ప్రజల్లో బయోడైవర్సిటీ పట్ల మరింత అవగాహన పెంచేలా చర్యలు చేపడతామన్నారు. ఆరోజు పట్టణాల్లో హరితాన్ని పెంచిన పురపాలికలకు, సిబ్బందికి హరిత అవార్డులు అందజేస్తామని మంత్రి వెల్లడించారు.

భానుడి భగభగలు..

(మొదటిపేజీ తరువాయి)

కూడా వేడి వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. హర్యానాలో 41.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో వేడిగాలులు వ్యాపించాయి. రెండు రాష్ట్రాల ఉమ్మడి రాజధాని ఛండీగఢ్‌లో వేడి తీవ్రత అత్యధికంగా 40 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

కుక్కల దాడిలో గాయపడిన కోతిని కాపాడిన గట్టు గిరి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

కుక్కల దాడిలో గాయపడి నడవలేని స్థితిలోవున్న (వానరం) కోతిని మాతదేవోభవ అనాథ ఆశ్రమం వ్యవస్థాపకులు గట్టు గిరి మానవతా హృదయంతో కాపాడారు. మంగళవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ గ్రామంలో ఓ వానరం వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడింది. నడవలేని స్థితిలోవున్న దాన్ని గట్టు గిరి మానవత్వంతో దగ్గరకు తీసుకొని తినడానికి పండ్లను అందించారు. ఈక్రమంలో కొంచెం కొలుకున్న వానరాన్ని హైదరాబాద్‌లోని నారాయణగూడ సూపర్ స్పెషాలిటీ వెటర్నరీ హస్పిటల్‌కు తీసుకెళ్లారు. దాంతో పరిశీంచిన వైద్యులు చికిత్సను అందించారు. బుధవారం అటవీశాఖ అధికారులను సంప్రదించి వానరాన్ని వారికి అప్పగిస్తామని గట్టు గిరి తెలిపారు.

ఆదర్శనగర్‌లో ఈఎస్‌ఐసీ సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈఎస్‌ఐసీ న్యూఢిల్లీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని ఆదర్శనగర్ రిజినల్ కార్యాలయంలో సువిధా సమాగమ సమావేశం జరిగింది. ప్రధానంగా ఈఎస్‌ఐసీ బెనిఫిట్స్ గురించి కంపెనీ ప్రతినిధులకు, బీమాదారులకు తెలియజేశారు. అలాగే యజమానుదారులు, బీమాదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటికి పరిష్కార మార్గాలను సూచించారు. ఈ కార్యక్రమంలో బెనిఫిట్స్ బ్రాంచ్ డైరెక్టర్ సాయికుమార్, సూపరింటెండెంట్ అనంతకృష్ణ, నాగరాజు, నవతెలంగాణ ప్రతినిధి కిషన్, విద్యాభారతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ప్రతినిధి కే హనుమంతరావు, , ఇతర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి
- రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మామిడిపల్లి గ్రామం నుండి శంషాబాద్‌కు వెళ్లే నాలుగు రోడ్ల రహదారి విస్తరణ పనులు, రూ.29.50 కోట్ల నిధులతో చేపట్టిన అభివద్ధి పనులకు ప్రభుత్వం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఈ రహదారి విస్తరణ వలన విమానాశ్రయానికి అనుసంధానంగా ఉంటూ ప్రజల, రహదారుల రాకపోకలు సులభవుతాయని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఇప్పటికే మహేశ్వరం నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రతినిదులు, అధికారులు పనిచేస్తున్నారని మంత్రి పేర్కన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు నిమ్మల నరేంద్ర గౌడ్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు చుక్కా శివకుమార్, యాతం పవన్ యాదవ్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కష్ణ మోహన్ రెడ్డి, డిఈఈ జ్యోతి, స్థానిక నాయకులు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేత

సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేదింటి ఆడబిడ్డలకు అందించే కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకం చిరు కానుక లాంటిదని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపాలిటీలో షాది ముబారక్, కల్యాణ లక్ష్మి పథకం ద్వారా ఐదు కోట్ల 39 లక్షల 62వేల 524 రూపాయల చెక్కులను మరాఠా భవన్‌లో లబ్దిదారులకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం ద్వార బాలాపూర్ మండలంలో రూ.59 కోట్ల 53 లక్షల 13వేల 600 అందచేయడం జరిగిందని మంత్రి తెలిపారు. జల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి ద్వార లబ్ధిదారులకు ఒకే రోజున షాదీ ముబారక్ 522, కళ్యాణ లక్ష్మి17 మొత్తం 539 చెక్కులను అందించామని వివరించారు. ఇంత గొప్ప పథకాలను రూపకల్పన చేసిన సీఎం కేసీఆర్ ప్రతి పేదింటి ఆడబిడ్డకు మేనమామలా అదుకుంటున్నారని తెలిపారు. ఆపదలో ఆదుకున్న సీఎం కేసీఆర్‌ను మర్చిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్లా బిన్ సాది, వైస్ చైర్మన్ యూసుఫ్ పటేల్, కందుకూర్ ఆర్డిఓ, బాలాపూర్ మండల తహశీల్దార జనార్దన్ రావు, జల్ పల్లి మున్సిపాలిటీ కమిషనర్ వసంత, కౌన్సిలర్లు బి..యాదగిరి, కే.లక్ష్మి నారాయణ, శంకర్, పమిద అఫ్జల్, కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కష్టారెడ్డి, అనుబంధ సంఘాల నాయకులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎక్బాల్ ఖలీఫా, మహిళా నాయకురాలు, అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అంకిత భావంతో సిబ్బంది పనితో బాధితులకు న్యాయం

- డీపీవీ పాఠశాలలో బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి 20ఏండ్ల జైలు
- షీటీమ్స్‌ను, కోర్టు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన సీపీ సీవీ ఆనంద్



నవతెలంగాణ-సిటీబ్యూరో

సిబ్బంది అంకిత భావంతో పనిచేయడం వల్లా బాధితులకు న్యాయం జరిగింది. నేరస్తుడు జైలుపాల య్యాడు. అభంశుభం తెలియని ఎల్‌కేజీ చదువుతున్న ఐదేండ్ల చిన్నారిపై గత అక్టోబర్ మాసంలో డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడిన సంఘటన సంచలనం రేపింది. బంజారా హిల్స్ రోడ్డు నం. 14లోని డీపీవీ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్న ఐదేండ్ల బాలికపై అదే స్కూల్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న భీమన రజినీకుమార్(34) లైంగికదాడికి సంఘటన తెలిసిందే. బాధితుల నుంచి ఫిర్యాదును అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు వెంటనే పోక్సో కింద కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేవలం 34రోజుల్లో 19 మంది సాక్ష్యుల నుంచి వివరాలు సేకరించి కోర్టులో ఛార్జ్‌షీట్ వేశారు. అప్పటి నుంచి నాంపల్లి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ కొనసాగింది. పోక్సో కేసులో ఇరు పక్షాల వాదనలు, పోలీసులు సమర్పించిన సాక్ష్యాలను పరిశీలించిన నాంపల్లి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు.. నిందితుడు రజినీకుమార్‌ను దోషిగా తేల్చింది. అతనికి 20 ఏండ్ల జైలు శిక్షతోపాటు రూ.5000ల జరిమానా విధించింది. తప్పుచేసిన వారు ఎట్టిపరిస్థితుల్లో తప్పించుకోకుండా ఉండాలని షీ బృందాలు, బంజారాహిల్స్ పోలీసులు పక్కాగా సాక్ష్యాలను సేకరించి కోర్టులో సమర్పించారు. నిందితునికి శిక్షపడడంలో పూర్తిగా బాధితులకు చేయూతనందించారు. షీ బృందాలు, భరోసా టీమ్స్‌లు బాధితులకు కౌన్సిలింగ్ చేసి, వారిలో ధైర్యాన్ని నింపారు. ఇదిలావుండగా మంగళవారం డ్రైవర్ రజినీకుమార్‌కు జైలు శిక్షపడడంతో బాధితులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. సమాజంలో పోలీస్‌శాఖ ప్రతిష్టతను మరింత పెంచడంతో సీపీ సీవీ ఆనంద్.. కోర్టు సిబ్బందిని, షీ బృందాలను, భరోసా బృందాలతోపాటు బంజారాహిల్స్ పోలీసులను ప్రత్యేకంగా అభినందించారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీసీపీ జోయేల్ డేవిస్, డీసీపీ శిరిషా రాఘవేంద్రతోపాటు తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఉన్న డ్రయినేజీని సరిచేయండి

- ఎమ్మెల్యేను కోరిన కాలనీవాసులు



నవతెలంగాణ-హయత్ నగర్

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో వివేకానంద నగర్ పేస్ 2 కాలనీలో డ్రయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు మంగళవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆ సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని గుర్తు చేశారు. అక్కడ ఉన్న మ్యాన్ హెూల్స్ కూలిపోవడం వల్ల భూగర్భ జలాలు డ్రైనేజీతో కలుషితం అవుతున్నాయని, దానివల్ల అన్ని అపార్ట్‌మెంట్లలో బోర్ వెల్ నందు కలుషిత నీరు వచ్చిందని తెలిపారు. ఆ డ్రైనేజీని తాత్కాలికంగా హాస్టల్ పక్క నుంచి మళ్లించామన్నారు. అయినా లోపల లీకేజీలు అవుతున్నాయని తెలిపారు. వెంటనే ఎల్.బి.నగర్ సర్కిల్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ వినోద్‌తో మాట్లాడారు. మరమ్మతులకు గురైన యూజీడీ పైప్‌లైన్స్ స్థానంలో కొత్తవి వేయాలని ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో పని పూర్తవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ వినోద్ మాట్లాడుతూ.. ఆ పైప్ లైన్స్ దాదాపు18 ఫీట్ల మేర కింద.. డ్రైనేజీ పైప్ లైన్స్ ఉండడం వల్ల కొంత సమయం పడుతుందని చెప్పారు. ఆ మేరకు యుద్ధప్రాతిపదికన పనులు చేయాలని ఎమ్మెల్యే చెప్పారు. రాబోయే రోజుల్లో శాశ్వత పరిష్కారం దిశగా డ్రైన్స్ పనులు చేయిస్తామని కాలనీవాసులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ కాలనీ పేస్ 2 అధ్యక్షులు శ్యాంసుందర్ రెడ్డి, సభ్యులు విజయభాస్కర్ రెడ్డి, కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, శ్రీరామ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ - ఘట్కేసర్

దౌర్జన్యంగా ప్లాట్లు కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేస్తున్న రియల్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ చౌదరి గుడా గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు కొంగరి శంకర్, కొర్రెముల మాజీ ఉపసర్పంచ్, పల్లె బాబురావుగౌడ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చౌదరిగూడ గ్రామంలోని సర్వే నెంబర్ 714లో 1972లో గ్రామపంచాయతీ లేఔట్ చేశారని, కానీ, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు 2000లో నకిలీ డాక్యుమెంట్ తయారు చేసి వ్యవసాయ భూమిగా మార్చుకున్నారని చెప్పారు. గతంలో ఉన్న లేఅవుట్ ప్రకారం.. అందులో వార్డు సభ్యుడు కొంగరి శంకర్, కొర్రెముల మాజీ ఉపసర్పంచ్, పల్లె బాబురావు 714 సర్వే నెంబర్‌లో 1600 గజాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. కానీ, ఆ స్థలాలకు కబ్జా చేసి ఇండ్లు నిర్మిస్తున్న వారిని ప్రశ్నిస్తే.. మీ భూమి మీకు ఇస్తామంటున్నారని చెప్పారు. కానీ ప్లాట్ల యజమానులకు తెలియకుండా కబ్జా చేసి ఇండ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్ నాయకుడు బహిరంగ క్షమాపణ చెప్పాలి

- కార్పొరేటర్ ముద్దా పవన్ కుమార్



నవతెలంగాణ - మీర్‌పేట్

మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు, మీర్‌పేట్ కార్పొరేటర్ ముద్దా పవన్ కుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుల అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లో నిబద్ధతతో ప్రజల కోసం పని చేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. తన తల్లి వయస్సులో ఉన్న ఒక మహిళపై వ్యక్తిగత జీవితాన్ని ఉద్దేశించి మాట్లాడటం కాంగ్రెస్ నాయకులకు సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ నాయకులు 24గంటల్లో బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని యెడల సబితమ్మ అభిమానులు, బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహావేశాలకు గురవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మీర్‌పేట్ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు నాగరాజు, తుక్కుగుడ అధ్యక్షుడు రాజు, కందుకూరు యువజన విభాగం నాయకులు కార్తీక్, దీక్షిత్, ప్రవీణ్ రెడ్డి, హరీష్, విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నారు.

ఆలయానికి ఉప్పల శ్రీనివాస్ గుప్త దంపతుల వెండి విరాళం



నవతెలంగాణ -నాగోల్

మంగళవారం హైదరాబాద్‌లోని సుభాష్ చంద్ర బోస్ నగర్, న్యూ హఫీజ్‌పేటలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంను రాష్ట్ర పర్యాటక అభివద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల్ శ్రీనివాసులు గుప్త సతీసమ్మేతంగా సందర్శించి, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం మకరతోరణంకు కిలో వెండి విరాళంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయానికి విచ్చేసిన ఉప్పల శ్రీనివాస్-స్వప్న దంపతులకు శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ కమీటీ సభ్యులు, పండితులు, పూజారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సామూహిక అర్చనతో పాటు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్, సభ్యులు కలిసి స్వామి వారి కండువాలతో, సత్కరించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ శ్రీ అభయాంజనేయ స్వామి వారి దర్శనం కోసం, వారి ఆశీస్సులు పొందడం కోసం కుటుంబంతో కలిసి వచ్చామని తెలిపారు. స్వామి వారికి అభిషేకం, అర్చన చేయడం జరిగిందన్నారు. అందరితోపాటు మా కుటుంబాన్ని కూడా చల్లగా చూడాలని, స్వామి వారికి కిలో వెండి విరాళంగా అందజేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బంగారు తెలంగాణ కోసం బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వంద సంవత్సరాలు జీవించాలని రాష్ట్ర ప్రజలు అంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకోవడం తోపాటు రైతులు పాడి పంటలతో విలసిల్లాలని, దేశ ప్రజలు, రాష్ట్ర ప్రజలందరూ ఆనందంగా వుండాలని, అందర్నీ దీవించాలని ఆంజనేయ స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి ఉప్పల స్వప్న, కుమారులుతోపాటు దేవాలయం చైర్మన్, గంప సత్యనారాయణ గుప్త, టెంపుల్ డైరెక్టర్స్ రామకష్ణ, యాదగిరి, రవీందర్, ప్రభు, రాములు, నటరాజ్, దేవాలయ కమిటీ సభ్యులు, పండితులు, భక్తులు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు కార్యక్రమం విజయవంతం

నవతెలంగాణ-వనస్థలిపురం

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచనల మేరకు వనస్థలిపురం డివిజన్ పరిధిలోని నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమం విజయవంతమైంది. మంగళవారం నాగార్జున కాలనీ కమ్యూనిటి హాల్‌లోఉదయం 9.00 నుండి సాయంత్రం 4.00 గంటల వరకు కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో ఉచితంగా కళ్లజోళ్ళతో పాటు కాంటరాక్టు లెన్స్ అందజేశారు. మరికొందరికి మరింత మెరుగైన కంటి పరీక్షల కోసం సరోజినీదేవి కంటి హాస్పిటల్‌కి రెఫర్ చేశామని తెలిపారు. సరోజినీదేవి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ గుప్తా మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కంటి సమస్యలు ఉన్న వారికి ఈ శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిబిరానికి శనివారం, ఆదివారం సెలవని ప్రతి ఒక్కరు తమవెంట ఆధార్ కార్డు జీరాక్స్ తీసుకుని వెళ్లి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లేబర్ కమిషన్ ఆఫీస్ వద్ద ధర్నాను విజయవంతం చేయాలి

- హమాలి సంఘం జిల్లా అధ్యక్షులు వీరయ్య



నవతెలంగాణ-ఎల్బీనగర్

లేబర్ కమిషన్ ఆఫీస్ వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలంటూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. చైతన్యపురి డివిజన్‌లోని మునిసిపల్ కాలనీలోని సీఐటీయూ కార్యాలయంలో హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ లేబర్ కమిషన్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలంటూ రంగారెడ్డి జిల్లా హమాలి సంఘం అధ్యక్షులు పల్లెపాక వీరయ్య హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల వలె వెల్ఫేర్ ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 50 కిలోలకు మించిన బరువులు నిషేధించాలి అని, పని గంటలు పని భద్రత గుర్తింపు కార్డులో కనీస వేతనాలు పెన్షన్ 20 చట్టబద్ధం హక్కులు కల్పించాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలు మార్చి నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోర్డులను తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు డి శ్రీనివాస్, ఎం దూలప్ప, జి బిచ్చమ్మ ,జి రాజు, లింగయ్య ,శ్రీను ,సాయిలు, బసవయ్య కార్మికులు పాల్గొన్నారు

నందు ఆర్మీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్



నవతెలంగాణ- సరూర్‌నగర్

నందు ఆర్మీ ఫిజికల్ ట్రైనింగ్ అకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ఫిజికల్ డైరెక్టర్ నందులాల్ నాయక్ తెలిపారు. 6 నుంచి 15 సంవత్సరాల విద్యార్థిని, విద్యార్థులకు ఉదయం 6 గంటల నుంచి 7:30 వరకు శిక్షణ ఇస్తామని చెప్పారు. అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్‌బాల్, టైక్వాండ్ లాంటి ఆటలు నేర్పిస్తామన్నారు. ఏప్రిల్ 24 నుంచి మే 20 వరకు ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9666994708 సంప్రదించొచ్చని సూచించారు.

పార్కు స్థలాలను కాలనీవాసులే పరిరక్షించుకోవాలి

- హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్



నవతెలంగాణ- వనస్థలిపురం

కాలనీలో పార్కు స్థలాలు కబ్జాకు గురికాకుండా కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పరిరక్షించుకోవాలని హయ త్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ అన్నారు. బీఎన్‌రెడ్డి డివిజన్ గాయత్రినగర్ ఫేస్-4లో పార్కు స్థలాన్ని ఆయన మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. గతంలో గాయత్రి నగర్ ఫేస్ ఫోర్ కాలనీ లేఅవు ట్‌లో పార్కు అభివృద్ధి కోసం 1600 గజాల స్థలాన్ని కేటాయించారని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు చెప్పారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. ఎల్బీనగర్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పార్కు స్థలాలకు ఫెన్సింగ్ వేయించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ పార్కు స్థలానికి సంబంధించిన లేఔట్ పత్రాలను ఇస్తే త్వరలోనే పార్కు ప్రహరీ నిర్మాణం పనులు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బి.యన్.రెడ్డి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, టీపీఎస్ ఉమాదేవి, గాయత్రి నగర్ కాలనీ పేస్ ఫోర్ అధ్యక్షుడు మనోజ్ కుమార్, కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భూకబ్జాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి

- గతంలో అక్రమాలను అధికారులు అడ్డుకున్నా ఆగని అవినీతి బాగోతం
- చైర్ పర్సన్ చెవుల స్వప్న



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

పెద్ద అంబర్ పేట మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు 23 వ వార్డు కౌన్సిలర్ సిద్దంకి కృష్ణారెడ్డి అధికారం అండతో ప్రభుత్వ భూములు కబ్జా చేసి తనను బెదిరిస్తున్నారని, అతని పై చట్టరీత్యా చర్యలు తీసుకో వాలని అదే అధికార పార్టీకి చెందిన మున్సిపల్ చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అధికారం ముసుగులో అనేక అక్రమాలకు పాల్పడుతూ ,భూ అక్రమాలకు సహకరించనందుకు పెద్ద అంబర్ పేట మున్సిపాల్టీ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని చైర్ పర్సన్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి మాట్లాడారు. పెద్ద అంబర్ పేట గ్రామ రెవెన్యూ సర్వేనెం.123, 123/1, 123/3 లో పసు మాముల రెవెన్యూ సర్వేనెం. 386 లలో గల ప్రభుత్వ భూమిలో సుమారుగా రూ. 25 కోట్ల విలువైన 12 వేల గజాల స్థలాన్ని సిద్దంకి కృష్ణారెడ్డి అతని కుటుంబీకులు ఆక్రమించుకొని జీవో నెం 59 కింద భూ క్రమబద్దీకరణకు దరఖాస్తు చేసుకున్నారని ఆరోపించారు. అక్రమ డబ్బుల సంపాదలతో రాజకీయాలు చేస్తూ మున్సిపాల్టీలో తనకి ఎదురు లేదంట విర్రవీగుతున్నారని అన్నారు. ఈదుల చెరువులో భాగమైన సర్వే నెం. 292 లోని ఎఫ్ టి ఎల్ , బఫర్ జోన్ లో మట్టిని పూర్చి ఒక ఏకరం భూమిని ఆక్రమించారని,ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కబ్జాకు గురైన చెరువును పరిశీలించేందుకు వెళ్లగా వారిపై దౌర్జన్యాలకు పాల్పడి, భయభ్రాంతులకు గురి చేయడంతో వారు పోలీసులకు పిర్యాదు చేశారన్నారు. అలాగే తన అనుచరుడు పెద్ద అంబర్ పేట రెవెన్యూ పరిధిలోని జాతీయ రహదారి పక్కన సర్వే నెం. 244లో 4 ఎకరాల భూమిలో మూడు రూములు అక్రమంగా నిర్మించి 59 జీవో కింద క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆరోపించారు. పెద్ద అంబర్ పేట రెవెన్యూ సర్వే నెం 64 లోని ప్రభుత్వ భూమిలో సుమారుగా రెండు ఎకరాల స్థలంలో ప్రహరీ గోడ నిర్మించినారని ఆరోపించారు. గతంలో వైస్ చైర్మెన్‌గా ,ప్రస్తుతం కౌన్సిలర్ గా ఉంటూ ప్రభుత్వ భూములు లూటీ చేస్తున్నారన్నారని ఆరోపించారు.. పెద్ద అంబర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం . 245,246 ,249 నుంచి పెద్ద అంబర్ పేటప్ చెక్ డ్యామ్ నుండి గ్రావిటీ పైకి అబ్దుల్లాపూర్‌మెట్ చింతల చెరువుకు వరద నీరు వెళ్ల కుండా అడ్డుకున్నారన్నారు. ఇలాంటి అవినీతి అక్రమా లకు పాల్పడుతూ అడ్డగోలుగా డబ్బు సంపాదిస్తూ రాజ కీయ అవసరాల కోసం కబ్జా భూములు కాపాడుకోవడం కోసం తరచూ పార్టీలు మారి నీచ రాజకీయాలు సిద్దంకి కృష్ణ రెడ్డి చేస్తూన్నారన్నారు. రాజకీయ అవసరాల కోసం కాంగ్రెస్ పార్టీ కి చెందిన కౌన్సిలర్ల తో మిలాఖత్ అయ్యారన్నారు. ఎమ్మెల్యే సహకారంతో ఎన్ని అక్రమాలకు పాల్పడిన చట్టం తన పనిని తాను చేసుకుంటుందననేది మారిచిపోవద్దని హితవు పలికారు. 9 వ వార్డు కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి 5 ఎకరాల భూమిలో ఎలాంటి అనుమ తులు లేకుండా విల్లాలు కడుతూ పెద్ద అంబర్ పేట్ ఈదుల చెరువులోని ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ భూమిని ఆక్రమించి తప్పుడు ఎల్ ఆర్ ఎస్ తో విల్లాస్ కట్టి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు.కుంట్లూర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెం. 24 లో స్మశాన వాటికలోని ప్రభుత్వ భూమిని 22వ వార్డు కౌన్సిలర్ ఒక ఎకరా 20 గుంటల భూమిని కబ్జా చేసి స్మశాన వాటికకు ప్రహరి గోడ నిర్మించ కుండా అడ్డుకుంటూ, 2022లో 59 జీవో కింద సుమారు 5 దరఖాస్తులు పెట్టుకున్నారాని,దీనిని తిరస్కరించి స్మశాన వాటికను రక్షించి ప్రహరి గోడను నిర్మించాలన్నారు.

ఒకటవ వార్డు కౌన్సిలర్ కుంట్లూర్ సర్వేనెం. 78లో ఎలాంటి నిర్మాణం, ఇంటి నెం. కరెంట్ బిల్లులు లేకుండానే సుమారుగా 450 గజాల స్థలాన్ని ఆక్రమించుకొని తన కుటుంబ సభ్యుల పేరుతో 59 జీవో క్రింద క్రమబద్ధీక రణకు దరఖాస్తు చేసుకున్నారని, ఇలా అధికారం ముసుగులో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. చైర్ పర్సన్ గా ఎన్నికైన ఏడాది నుండే దళిత మహిళ అనే వివక్ష కారణంగా అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తనను అనేక రకాలుగా ఇబ్బందులు గురి చేసినప్పటికీ అభివృద్ధి విషయంలో ఏమాత్రం వెనుక అడుగు వెయ్యకుండారాజకీయాలకు అతీతంగా ముందుకు వెళుతున్నానన్నారు. 24 వార్డులకు సమాన నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేస్తూన్నానన్నారు.



పట్టాలు పంచిన కౌన్సిలర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పేదల కల నిజమైంది. సుదీర్ఘకాలంగా ఇండ్లపట్టాల కోసం ఎదురు చూస్తున్న జవహర్‌నగర్ మున్సిపాల్టీ పరిధిలోని అంబేద్కర్ నగర్ ప్రజలకు స్థానిక కౌన్సిలర్ మురుగేష్ ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. మంగళవారం అయిదో వార్డులో జీవో నెంబర్ 58 కింద రెగ్యులరైజ్ చేసిన ఇండ్ల పట్టాలను ఆయన లబ్దిదారులకు అందచేశారు. డివిజన్ పరిధిలో దాదాపు 400 మందికి పట్టాలు పంపిణీ చేసినట్టు కౌన్సిలర్ మురుగేష్ తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తుందనీ, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో బంగారు తెలంగాణ కల నిజమవుతున్నదని చెప్పారు. పట్టాలు అందుకున్న పేదలకు గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలనీ, అదే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని చెప్పారు. ఈ సందర్భంగా లబ్దిదారులు కౌన్సిలర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

యోగా శిబిరానికి విశేష స్పందన



నవతెలంగాణ -ఎల్బీనగర్

యోగా శిబిరానికి విశేష స్పందన లభించింది. మహిళ పతంజలి యోగా సమితి తెలంగాణ సౌత్ ఈస్ట్ అధ్యక్షురాలు కే.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో వారం రోజులపాటు యోగా శిబిరం కొనసాగింది. ఎల్బీనగర్‌లోని రాక్ టౌన్ కాలనీలోని గొట్టేటి కల్యాణ మండపం భవనంలో కొనసాగిన ఇంటిగ్రేటెడ్ యోగ శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ యోగా శిక్షణ శిబిరంలో వందలాది మంది మహిళలు, పురుషులు పాల్గొని యోగాసన మెళుకువలను నేర్చుకున్నట్లు నిర్వాహకురాలు, యోగా ట్రైనర్ జ్యోతిర్మయి తెలిపారు. నేటి యాంత్రిక జీవన శైలిలో ఆరోగ్య పరిరక్షనకు యోగాసనాలు ఎంతో మేలు చేస్తాయన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఒక గంట సమయాన్ని యోగాకు కేటాయిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. యోగా తరగతుల అనంతరం వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చిన ట్రైనర్ జ్యోతిర్మయిని ఘనంగా సత్కరించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు.

విజ్ఞాన రంగంలో విద్యార్థులు రాణించాలి

- ఎం.వీ.ఎస్.ఆర్. చైర్మెన్ కే.పి.శ్రీనివాస్ రావు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ఇంజనీరింగ్ విద్యార్థులు విజ్ఞాన రంగంలో రాణించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఎం.వీ.ఎస్.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కే.పి.శ్రీనివాస్‌రావు అన్నారు. ఇ యంత్ర ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మంగళవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాధర్‌గుల్ గ్రామంలోని ఎం.వీ.ఎస్.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మెన్ మాట్లాడుతూ.. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం నుండి అభిషేక్ కోటి, కార్తికేయ కొల్లూరి అనే ఇద్దరు విద్యార్థుల బృందం, ప్రొఫెసర్ అఖిల్ ఖరే, అసిస్టెంట్ ప్రొఫెసర్ టి. సుజనావన్ మార్గదర్శకత్వంలో ఐఐటీ ముంబాయిలో జరిగిన ఇ-యంత్ర ఇన్నోవేషన్ ఛాలెంజ్ చివరి రౌండ్లో ఒక ప్రాజెక్ట్ ను ప్రదర్శించారని తెలిపారు. దేశం నలుమూలల నుండి పాల్గొన్న 490 జట్లలో టాప్ 10 జట్లలో వీరు విజేతగా నిలిచారన్నారు. ఈ బృందం డిజిటల్ పరికరాలను ఉపయోగించుకోలేని, దృష్టి లోపం ఉన్న వారి కోసం 'డిజిటల్ ఐ' అనే ఒక పరికరాన్ని ప్రదర్శించిందని తెలిపారు. ఆరు నెలల వ్యవధిలో అనేక సవాలు రౌండ్ల తర్వాత వారి ఆలోచనను ప్రదర్శించడానికి ఫైనలిస్టులు 05, 06 ఏప్రిల్, 2023న ఐఐటీ బాంబేకి ఆహ్వానించారని తెలిపారు. ఇ-యంత్ర అనేది భారత ప్రభుత్వ చొరవతో, విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా నిధులు సమకూర్చబడి, ఐఐటీ బొంబాయిలో జరుపబడిన ఇ-ఛాలెంజ్. వివిధ డొమైన్లలో సమస్యలను పరిష్కరించడానికి యువ ఇంజనీర్ల ప్రతిభను ఉపయోగించుకోవడం వీరి లక్ష్యమన్నారు. ఈ ఎలక్ట్రానిక్ క్యాప్ కెమెరా, అల్ట్రాసోనిక్ సెన్సార్లు మొదలైన బహుళ మాడ్యూల్స్తో పాటు అధిక ఫంక్షనల్ సాక్‌ని ఉపయోగించి నిర్మించబడిందన్నారు. దృష్టి లోపానికి సహాయం చేయడంలో తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారాన్ని అందించడంపై బృందం దృష్టి సారించిందన్నారు. ముఖ్యంగా వృద్ధులలో వయస్సుతో పాటు దృష్టి తగ్గుతుంది. దీంతో కరెన్సీ నోట్ల వంటి రోజువారీ వస్తువులను గుర్తించడం వారికి కష్టమవుతుంది. ఈ పరికరం ద్వారా యంవీయస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ఇలాంటి అనేక సమస్యలకు సులభమైన, సమర్ధవంతమైన పరిష్కారాన్ని అందించగలిగారు. ఈ పరికర రూపకల్పన ద్వారా యంవీయస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు వివిధ జాతీయ, అంతర్జాతీయ సమావేశాలలో అంతర్జాతీయ ప్రొఫెసర్లు, పరిశ్రమ నిపుణుల నుండి ఎన్నో ప్రశంసలను అందుకున్నారు. సామజిక ప్రయోజనం కోసం తయారు చేయబడిన ఈ పరికరానికి ఇలాంటి ప్రోత్సాహం రావడం ఎం వి ఎస్ ఆర్ కళాశాల విద్యార్థుల లో, అధ్యాపకులలో ఎంతో ఉత్సాహాన్ని నింపిందని మాతశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డా. కె.పి. శ్రీనివాస్ రావు, సెక్రటరీ,. కె. కష్ణ కుమార్, కోశాధికారి శ్రీ. జె. సుధాకర్, ఇతర కార్యవర్గ సభ్యులు, ఎం.వి.ఎస్.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. కనకదుర్గ, వైస్-ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జి.ఎస్. మూర్తి తెలిపారు. మాతశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, ఎం.వి.ఎస్.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది విద్యార్థులు ఈ ఇన్నోవేషన్ ఛాలెంజ్ లో పాల్గొన్న బందానికి అభినందనలు తెలియ చేశారు.

భూగర్భ డ్రయినేజీ సమస్యను పరిశీలించిన కార్పోరేటర్



నవతెలంగాణ-నాచారం

నాచారం డివిజన్ పరిధిలోని స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న భూగర్భ డ్రయినేజీ సమస్యను మంగళవారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వాటర్ వర్క్స్ సివరేజ్ అధికారుల అలసత్వంతో డ్రయినేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సరైన సమయానికి స్పందిస్తే స్థానిక ప్రజలు మురుగు సమస్య ఎదుర్కోరని జలమండలి మేనేజర్ సందీప్‌కు చెప్పారు. తక్షణమే ఎయిర్ టెక్ మిషన్ ద్వారా డ్రయినేజీ మురుగు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అయినా సమస్య పరిష్కారం కాకపోతే భూగర్భ డ్రయినేజీ ప్రతిపాదనలు పంపిస్తే జీహెచ్ఎంసీ నుంచి నిధులు మంజూరు చేసి నూతన భూగర్భ డ్రయినేజీ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, ముత్యం రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, శ్రీశైలం, రాజయ్య, వెంకటేష్, పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



నవతెలంగాణ-బేగంపేట

గోషామాయిల్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జి నందకిషోర్ వ్యాసబిలాల్ తెలిపారు. ఆయన సమక్షంలో రాజ్ పుత్రు సమాజ్ 5000 మందితో సోమవారం రాత్రి బేగంబజార్ లో బీఆర్ఎస్ పార్టీలో చేరారనిఅన్నారు కమిటీ అధ్యక్షుడు జోగి సింగ్ జి బాలవతన్ సింగ రాజ్ పుత్రు కార్యకర్తలు పాల్గొన్నారు

జనవాసాల మధ్య 'కట్టెల మండి'

- చుట్టూ అపార్ట్మెంట్లు నడుమ టింబర్ డిపోలు
- మండీలో మంట రగిలితే చుట్టుపక్కల చుట్టేస్తుంది
- కట్టె కోతలు.. ప్రజల గోసలు
- పట్టించుకునే నాధుడే లేడు..?





నవతెలంగాణ-నాచారం

బతుకుతెరువు కోసం ఒకరు... బలి పశువు అయ్యేది మరొకరు. ప్రమాదమని తెలిసి కూడా జననివాసాల మధ్య టింబర్ డిపోలు కొనసాగడం సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపమా..? మామూళ్ల మత్తులో చూసి చూడనట్లు వ్యవహరి స్తున్నారా...! అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అనుకోని సంఘటన జరిగితే అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోవడం కోకోలలుగా ఈ మధ్యకాలం అనేక సంఘటనలు కండ్ల ముందు కనిపిస్తున్నా చూడలేని అధికారులు, నిర్వాహకుల తప్పిదంగా భావించాలా...? ఎవరు బాధ్యులు ఎవరికి శిక్ష పడాలి అనేది నేటి ప్రజల ప్రశ్న..? వివరాల్లోకి వెళితే... నాచారం డివిజన్ పరిధిలోని నాచారం విలేజ్ సమీపంలో రామ్ రెడ్డి నగర్, కార్తికేయ నగర్ లలో శ్రీ కన్నయ్య టింబర్ డిపో, ఆదిలాబాద్ టింబర్ మార్ట్, ఉమే స్వామి టింబర్ డిపో, శ్రీ బాలాజీ టింబర్ డిపో నాచారం ప్రధాన రోడ్డు భద్ర గార్డెన్ రిలయన్స్ మాల్ పక్కన, నాచారం చౌరస్తా టింబర్ డిపో గత 30 ఏండ్లుగా కొనసాగుతున్నాయి. కాలక్రమేనా కాలనీలు విస్తరించడం.. ప్రజలు అధికమవడంతో చుట్టూ అపార్ట్మెంట్లు వెలిశాయి. మధ్యలో కట్టెల మండీలు నిర్వహించడంతో కట్టెకోట మిషన్ శబ్దాలు, కట్టె కోత నుంచి వెలువడే నుసి పౌడర్ దుమ్ము ఊపిరితిత్తులు క్యాన్సర్ సమస్యలకు దారితీస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. అపార్ట్మెంటులకు ఆనుకొని జనజీవనానికి ఇబ్బందికరంగా కట్టెకోత ప్రజలకు గోసగా మారింది. ఆదిలాబాద్ టింబర్ మార్ట్ వీరారెడ్డి కాలనీలోని సాయి శ్రీనివాస అపార్ట్మెంట్ ,ఏ బి సి అపార్ట్మెంట్ ఆనుకొని ఉండడంతో ప్రజల అభ్యంతరం మేరకు కట్టెకోత నిలిపి వుడ్ డోర్ల విక్రయాలు కొనసాగిస్తున్నారు. గతంలో ఉమేస్వామి టింబర్ డిపోలో అగ్గి రాజుకొని పక్కనే ఉన్న ఏ బి సి అపార్ట్మెంట్ మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన సిబ్బంది టింబర్ డిపో నిర్వాహకులు మంటలు వ్యాపించకుండా నియంత్రిం చడంలో పెను ప్రమాదమే తప్పింది. నాచారం చౌరస్తా టింబర్ డిపోలో అగ్గి పడి పక్కనే ఉన్న కెమికల్ కంపెనీ కాలిపోయింది. ఆ పక్కనే సుప్రభాత స్కూల్‌కు ఎక్కడ మంటలు వ్యాపిస్తాయని భయాందోళనతో హుటాహుటిన పిల్లలను సురక్షిత ప్రాంతానికి తరలించి ఊపిరి పీల్చుకున్నారు. అప్పుడు ఇప్పుడు చెదురు,మదురు ఘటనలు చోటు చేసుకుంటున్నా వాటిని బయటికి పోకుండా కప్పిపుచ్చుకుంటూ టింబర్ డిపో నిర్వాహకులు కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కుషాయిగూడలో టింబర్ డిపో అగ్నిప్రమాద సంఘటన ప్రజలను ఎంతో కలచి వేసింది. అమాయకులైన ప్రజల ప్రాణాలు సజీవంగా గాలిలో కలిసిపోవడం బాధాకరం. పోయిన ప్రాణాలు తిరిగి తీసుకురాలేము నష్టపోయిన ఆస్తిని సమకూర్చుకోవటం సాధ్యం కాదు. అయినా నిర్లక్ష్యం వీడరు. అగ్ని ప్రమాదాలను నియంత్రణ చేయరు. ఇప్పటికైనా నివాస ప్రాంతాలలో ఉన్న టింబర్ డిపోలను దూర ప్రాంతాలకు తరలించి స్థానికుల ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నివాస ప్రాంతాల్లో టింబర్ డిపోలు నిబంధనలకు విరుద్ధం

2015 ,16 సంవత్సరం నుండి ఏదైనా కమర్షియల్ మాల్స్, వ్యాపార సముదాయాలు అగ్నిమాపక అనుమతి ఉంటేనే ఏర్పాటు చేయాలని నిబంధన ఉంది. సినిమా హాల్స్, పాఠశాలలకు, నివాస ప్రాంతాలకు దూరంగా ఉంటేనే ఫైర్ అనుమతి లభిస్తుంది. మా పరిధిలో అనేక టింబర్ డిపోలు నివాస ప్రాంతాల్లో ఉన్నట్లు సమాచారం ఉంది. సమగ్ర సమాచారం కోసం ఫైర్ స్టేషన్ల పరిధిలో ఎన్ని ఉన్నాయని అనే లెక్కలను తెప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాము. టింబర్ డిపోలు నివాసాల మధ్యలో ఉండడం నిబంధనలకు విరుద్ధమే అవుతుంది.

– నాగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్

టింబర్ డిపోలకు నోటీసులు జారీ

కాప్రా సర్కిల్ పరిధిలోని నివాస ప్రాంతాల్లో ఉన్న అన్ని టింబర్ డిపోలకు నోటీసులు జారీ చేశామని డిప్యూటీ కమిషనర్ ఎన్ శంకర్ నవతెలంగాణ వివరణ కోరగా తెలిపారు. 15 రోజుల్లో టింబర్ డిపోలను ఇండస్ట్రియల్ ఏరియాకు తరలించాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కుషాయిగూడ ఘటన పునరావృతం కాకుండా మున్సిపల్ శాఖ పరంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

– ఎన్ శంకర్ డిప్యూటీ కమిషనర్ కాప్రా సర్కిల్

కంటోన్మెంట్‌ను ఆదర్శ నియోజవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట/కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజక వర్గ అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి తలసాని శ్రీని వాస్ యాదవ్ తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్ చార్జిగా నియమితులైన మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే సాయన్న మృతితో కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలు పెద్దదిక్కును కోల్పోయినట్టు ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అన్ని కొనసాగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నియోజ కవర్గ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి, పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా కృషి చేయాలని మంత్రి సూచించారు. అదేవిధంగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి కూడా చర్చించారు.

ఆందోళన కలిగిస్తున్న ఫ్యాటీ లివర్

- బీపీ, షుగర్, అధిక బరువుంటే జాగ్రత్తలు తప్పని సరి : డాక్టర్ విమలాకర్ రెడ్డి
- నేడు వరల్డ్ లివర్ డే



నవతెలంగాణ-బేగంపేట్

పెరుగుతున్న ఫ్యాటీ లివర్ కేసులు ఆందోళన కలిగిస్తు న్నాయి. ఇందులో బీపీ, షుగర్, అధికబరువుతో బాధపడు తున్న వారి సంఖ్య అధికంగా ఉంటోంది. మన దేశంలో 18–32శాతం జనాభా ఫ్యాటీ లివర్‌తో బాధపడుతున్నట్లు సర్వేలు చెప్తున్నాయి. వీరిలో 31శాతం మంది లివర్ పనిచేయకుండా చివరి స్టేజికి చేరుకొగా 8 శాతం మందికి లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయాల్సిన స్టేజికి చేరుకుంటున్నారని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, ల్యాప్రోస్కోపిక్ అండ్ బేరియాట్రిక్, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ విమలాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఈ వరల్డ్ లివర్ డే సందర్భంగా "ఫ్యాటీ లివర్‌గురించి జాగ్రత్తగా ఉండండి, రెగ్యులర్‌గా లివర్ చెకప్ చేయించుకోండి, ఇది ఎవరికైనా ఎసెక్ట్ చేయవచ్చు" అనే థీంను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. షుగర్, బీపీ, అధిక బరువు, మెటబాలిక్ సింగ్రోమ్ వల్ల లివర్‌లో కొవ్వు చేరుతుంది. లివర్ సాధారణంగా మన శరీరంలో నిత్యం 250 పనులు చేస్తుంది. లివర్‌కు 'సమస్యలు తలెత్తితే జాండిస్, కడుపులో నీరు చేరడం, కాళ్ల వాపులు, రక్తవాంతులు, మనిషి 'స్పృహ తప్పి పోయే లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే అది లివర్ ఫెయిల్యూర్‌కు దారితీస్తుంది. మీరు ఆల్కహాలిక్ కాకపోయినా, ఎటువంటి వైరస్ ఇన్‌ఫెక్షన్ సోకకపోయినా కేవలం మీరు లావుగా ఉండటం, షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ కంట్రోల్‌లో లేకపోవడం వల్ల కూడా లివర్ చెడిపోయే స్థాయికి చేరుతుంది. తరచుగా అల్ట్రాసౌండ్, ఫైబ్రోస్కాన్ చేయడం వల్ల లివర్‌లో ఎంత కొవ్వు చేరిందని తెలుసుకోవచ్చు. లివర్ ఫంక్షన్ టెస్ట్, బీపీ, షుగర్ చెక్ చేసుకుంటూ, కొలెస్ట్రాల్‌కు సంబంధించిన మందులు వాడుతూ బరువు మీ బాడీ మాస్ ఇండెక్స్ ప్రకారం ఉంచుకోవడం) ద్వారా ఫ్యాటీ లివర్ నుండి జాగత్త పడవచ్చు' అని తెలిపారు. ఫ్యాటీ లివర్ లెక్షణాలుంటే వెంటనే సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టను సంప్రదించి సరైన చికిత్స తీసుకుంటే ఫ్యాటి లివర్ బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు' అని తెలిపారు. వరల్డ్ లివర్ డే సందర్భంగా కిమ్స్ సన్‌షైన్, సికింద్రాబాద్ లో ప్రత్యేక లివర్ చెకప్ ప్యాకేజీని ప్రవేశపెట్టారు. ఈ ప్యాకేజీ ఈ నెల 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది.

సేవ చేయడంతోనే.. మానవజన్మ సార్ధకం

- మంత్రి చామకూర మల్లారెడ్డి



నవతెలంగాణ-జవహర్‌నగర్

సేవ చేయడంతోనే మానవజన్మ సార్ధకం అవుతుం దని, ప్రతి ఒక్కరూ ఆదుకునే గుణం అలవర్చుకోవాలని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మన స్నేహం, ఎన్ఎస్ ఫ్రెండ్స్ గ్రూప్ ఫౌండేషన్, వికలాంగుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 16న రవీంద్రభారతిలో జరగనున్న మన కీర్తి అవార్డ్స్‌కు సంబం ధించి పోస్టర్‌ను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగు లను తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుం దని, వారి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన మహనీయుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. స్వచ్ఛంధ సంస్థ సేవలు అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి, కోఆప్షన్. సభ్యురాలు శోభారెడ్డి, తెలంగాణ దివ్యాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్ కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మెరుగు శివకష్ణ, నాయకులు నాగరాజు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు కావేరి ధర్మేందర్ పాల్గొన్నారు.

దమ్మాయిగూడాలో తై బజార్ వేలం పాట



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

దమ్మాయిగూడా మున్సిపల్‌లో తై బజార్ వేలం పాటలో మల్లారం గణేష్ రూ.18,60,000/- లతో వేలం పాట దక్కించుకున్నారని మున్సిపల్ చైర్ పర్సన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం లో చైర్ పర్సన్‌వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ అధ్యక్షత తై బజార్ వేలం పాట నిర్వహించారు. సందీప్ కుమార్ , అనిల్ గౌడ్, లోకేష్, గణేష్,. కష్టారావు పాల్గొన్నారు. ఆఫీసు వేలం పాట రూ. 16,71,600/-లతో మొదలు పెట్టగా మల్లారం గణేష్ రూ.18,60,000తో దక్కించుకోగా రెండవ స్థానంలో మంగళ్ పూరి లోకేష్ రూ.18,50,000 పలికాడు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్వామి, వైస్ చైర్మెన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు మంగళ్ పూరి వెంకటేష్, వరగంటి వెంకటేష్ ,రామారం శ్రీహరి గౌడ్, పాల్గొన్నారు.

'మున్సిపల్ కార్మికుల పని వేళలు తగ్గించండి'

నవతెలంగాణ-నాచారం

కాప్రా సర్కిల్ పరిధిలోని పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికుల పని వేళలను ఎండ తీవ్రత మూలంగా తగ్గించాలని కోరుతూ మేయర్ గద్వాల విజయ లక్ష్మికి బీఆర్ఎస్‌కేవీ కాప్రా సర్కిల్ అధ్యక్షులు జి కురుమన్న మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య విభాగం లో పనిచేస్తున్న కార్మికులు ఉదయం ఐదు గంటల నుంచి రెండు గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎండ తీవ్రత అధికం అవ్వడంతో ఉదయం ఐదు నుంచి 12 గంటల వరకు విధులు నిర్వహించే అవకాశం కల్పించాలని కోరారు. మున్సిపల్ కార్మికుల ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకొని పని వేళలు తగ్గించి కార్మికులను కాపాడుకోవాల్సిందిగా కోరారు. మేయర్ సానుకూలంగా స్పందించినందుకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి నరేష్, కాప్రా సర్కిల్ మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఆడుకుంటున్న బాలికపై వీధి కుక్కల దాడి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వీధి కుక్కలు ఎక్కడికక్కడే స్వైర విహారం చేస్తున్నాయి. అక్కడా ఇక్కడా అని లేదు. అన్ని ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా చేరి దొరికిన వారిని కరుస్తున్నాయి. ఇప్పటికే నగరంలో చాలా చోట్ల కుక్క కాట్లకు బలైన వారు ఉన్నారు. గాయపడిన వారిలో చిన్న పిల్లలు, పెద్దలు ఉంటున్నారు. తాజాగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నేరేడ్ మేట్ డివిజన్‌లో ఒక కుక్కల గుంపు బాలికపై దాడి చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డివిజన్ పరిధిలోని యాప్రాల్‌లో సీబీఆర్ కష్ణవేణి ఎంక్లేవ్ దగ్గర సోమవారం సాయంత్రం సమయంలో ఆడుకుంటున్న బాలిక అనుష వద్దకు కుక్కలు గుంపులుగా వచ్చి భయంతో దాడి చేసి గాయాలు చేశాయి. దాంతో ఆ బాలిక గట్టిగా అరవడంతో స్థానిక ప్రజలు వచ్చి కుక్కలను వెళ్లగొట్టారు. గాయపడిన బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఇలా కుక్కల దాడులు కొనసాగుతున్నా జరుగుతున్నా జీహెచ్ఎంసీ గానీ, సర్కిళ్ల అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ ప్రజలను కాపాడేందుకు తగు చర్యలు తీసుకోవడం లేదని పౌరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మడ్ ఫోర్ట్ మైదానాన్ని పరిశీలించిన జంపన ప్రతాప్



నవతెలంగాణ-కంటోన్మెంట్

మడ్ ఫోర్ట్ హాకీ మైదానాన్ని మంగళవారం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పరిశీలించారు. అనం తరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో తన హయాంలో దాతల సహాయంతో మడ్ ఫోర్ట్ క్రీడామైదానం అభివద్ధి జరిగిందని కానీ పార్టీల నేతలు సభలు సమా వేశాలు నిర్వహించుకుని బాస్కెట్ బాల్, హాకీ గోల్ పోస్టుల ను తొలగించారన్నారు. విచారం వెలిబుచ్చారు కంటోన్మెంట్ బోర్డు పరిధిలో జాతీయ అంతర్జాతీయ. రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని పేరు ప్రఖ్యాతులు సాధించిన క్రీడాకారులున్నారని వారితో సమావేశం నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకొని కమిటీ ఏర్పాటు చేసి బోర్డు పరిధిలోని బొల్లారం. మడ్‌ఫోర్ట్, తిరుమలగిరి, బోయినపల్లి క్రీడా మైదానాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించి క్రీడాకా రులను ప్రోత్సహించాలని సూచించారు. గతంలో శంకర్ రావు మంత్రిగా కొనసాగిన కాలంలో వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో మడ్‌ఫోర్ట్ లో స్టేడియం నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలు కేటాయించారని ఆ తరవాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అప్పటి క్రీడా శాఖ మంత్రి పద్మరావు సైతం స్టేడియం నిర్మాణానికి ముందుకు వచ్చారని గుర్తు చేశారు. బోర్డు పాలక మండలిలో నిర్ణయం తీసుకోకపోవడంతో స్టేడియం నిర్మాణం జరగలేదన్నారు. ఇప్పటికైనా బోర్డు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు సజావుగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవా లన్నారు. ఈ నెల 30 నుంచి కంటోన్మెంట్‌లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారని, మైదానాల్లో కనీస వసతులు లేకుండా ఎలా నిర్వహిస్తారని జంపన ప్రతాప్ ప్రశ్నించారు. ఏర్పాట్లు పూర్తి చేసి శిబిరాలను నిర్వహించాలని కోరారు. మాజీ క్రీడాకారులు డాఫదార్ రాజేష్ పాల్గొన్నారు.



దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

నవతెలంగాణ-మల్కాజిగిరి

డివిజన్లలో దోమలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. మంగళవారం 141 వ గౌతమ్‌నగర్ డివిజన్ లోని ఐ ఎన్ నగర్ లో హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గడప గడప తిరుగుతూ స్థానిక సమస్యలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డ్రయినేజీ, మంచినీరు, ముఖ్యంగా దోమల బెడద విపరీతంగా ఉందని ప్రజలు ఆయనతో అన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాటా డుతూ.. ప్రస్తుతం ఉన్న ఇండ్లు ఇందిరమ్మ రాజ్యంలో ఇచ్చినవని.. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, జీవన్ రెడ్డి, ఫరీద్, యాదగిరి, షేక్, భరత్, ప్రవీణ్, రామ్, సతీష్ సాయి, పీసీసీ డెలిగేట్ జి డి శ్రీనివాస్ గౌడ్, గుత్తి రామచందర్, ఉమేష్ సింగ్, శ్రీనివాస్ గౌడ్, కె రాములు, పోల్కం వెంకటేష్, సిరిగిరి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-నాచారం

రాష్ట్రంలో ఆటో మోటార్ రవాణా రంగంలో లక్షలాది మంది కార్మికులు జీవనం గడుపుతున్నారని ఆటో మోటార్ రవాణా రంగం రాష్ట్ర అధ్యక్షులు వేముల మార య్య అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్ కుమార్‌ను కలిసి ఆటో మోటార్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో అతిపెద్ద ఆటో యూనియన్ బీఆర్‌టీయూ అనుబంధంగా వందలాదిమంది కార్మికులు ఆటో నడుపుకొని జీవనం కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేస్తే కొంతమేరకైనా కార్మికుల సమస్యలు తీర్చినవారిమవుతామని వినోద్ కుమార్‌కు వివరించగా సానుకూలంగా స్పందిస్తూ ఆటో మోటార్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు అవసరాన్ని దాని ప్రాముఖ్యతను ముఖ్యమంత్రి కేసీఆర్ దష్టికి తీసుకువెళ్లి బోర్డు ఏర్పాటుకు కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు జి రాంబాబు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి నారాయణ, కార్మికులు రమణారెడ్డి, సాయికుమార్ పాల్గొన్నారు.

పలువురు జలమండలి ఉద్యోగులకు పదోన్నతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిలో వివిధ విభాగాల్లో జనరల్ పర్పస్ ఎంప్లాయిస్ (జీపీఈ)గా పనిచేస్తున్న 23 మంది ఉద్యోగులకు పదోన్నతి లభించింది. 15 మందికి అసిస్టెంట్ (పీ అండ్ ఏ), 5 మందికి అసిస్టెంట్ (ఎఫ్ అండ్ ఏ), ఇద్దరికి మేనేజర్లుగా, ఒకరికి జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ (జేటీవో)గా పదోన్నతి కల్పించారు. వీరికి ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సీజీఎం (పీ అండ్ ఏ) మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్, తెలంగాణ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ నియామక పత్రాలు అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అర్హతలను గుర్తించి, పదోన్నతి కల్పించినందుకు యాజమాన్యానికి, ఎండీ దానకిశోర్ గారికు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. జీ.ఎం సరస్వతి, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ, జనరల్ సెక్రటరీ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ మల్లాపూర్ డివిజన్ ఎస్టీ సెల్ చైర్మెన్ గా మహేష్ నాయక్



నవతెలంగాణ-నాచారం

కాంగ్రెస్ కాప్రా సర్కిల్ మల్లాపూర్ ఐదో డివిజన్ ఎస్టీ సెల్ చైర్మెన్ గా సింగం చెరువు తండాకు చెందిన మహేష్ నాయక్‌ను నియమించినట్టు పార్టీ మేడ్చల్ జిల్లా ఎస్టీ సెల్ చైర్మెన్ గణేష్ నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మల్లాపూర్ డివిజన్ యువ నాయకుడు నెమలి అనిల్ సమక్షంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ నాయక్ మాట్లాడుతూ మల్లాపూర్ డివిజన్‌లో ఎస్టీ సెల్ బలోపే తానికి, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిస్వార్ధంగా నిబద్ధతతో పని చేస్తానని తెలిపారు. గణేష్ నాయక్, రాగిడి లక్ష్మారెడ్డి, నెమలి అనిల్‌లకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మల్లాపూర్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతిని విస్మరించిన అధికారులు..!



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్‌లో భారతదేశ మొట్టమొదటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతిని జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా విస్మరించినట్టు విమర్శలు వస్తున్నాయి. చర్లపల్లి డివిజన్లోని టీచర్స్ కాలనీలో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహం ఉంది. అలాగే ఆయన పేరు మీద కాలనీ ఏర్పడింది. కానీ ఆయన వర్ధంతిని ఎవరూ పట్టించుకోవడం లేదని పలు వురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఆయన వర్ధంతిని విగ్రహం వద్ద ఎవరూ జరపలేదు. అటు జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ కాలనీ సంక్షేమ సంఘా లు పట్టించుకోకపోవడం వల్ల ఆయన విగ్రహాన్ని శుభ్రం చేసి పూలదండ కూడా వేసే పరిస్థితి లేకుండా పోయింది. మామూలుగా రాజకీయ లబ్ధి పొందడానికి అన్ని రాజకీయ పార్టీలు కొందరి నాయకుల కార్యక్రమం నిర్వహిస్తుంటారు. కానీ ఇలాంటి వారి గురించి మాత్రం విస్మరించడం బాధాకరం. దేశానికి మొట్టమొదటి రాష్ట్రపతిగా పనిచేసి అనేకమంది ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సర్వేపల్లి రాధకృష్ణ ఆదర్శప్రాయుడు. అయితే ఇలాంటి నాయకుల గురించి ప్రభుత్వం విస్మరించడం బాధాకరం. జీహెచ్ఎంసి అధికారులను దీనిపై వివరణ కోరగా తమ అధికార షెడ్యూల్లో ఇది లేదని చెబుతున్నారు. ఏదేమైనా మహనీయుల స్మరణను నోచుకోకపోవడం బాధాకరం.

పరీక్షలను బహిష్కరించిన విద్యార్థులు

నవతెలంగాణ-ఓయూ



బషీర్‌బాగ్ న్యాయ కళాశాల విద్యార్థులు మంగళవారం పరీక్షను బహిష్కరించారు. పీజీసీఎల్(బషీర్‌బాగ్) సెల్ఫ్ సెంటర్ ఎత్తేయడంతో విద్యార్థులు తమ సెంటర్ తమకే కావాలని రెండు రోజులుగా వీసీ బిల్డింగ్ ఎదుట నిరసన తెలిపారు. అయినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులు ఇంగ్లీష్ ఎగ్జామ్ ఉండగా 70మంది విద్యార్థులు ఎగ్జామ్‌ను బహిష్కరించారు. అనంతరం ఓయూలో వీసీ బిల్డింగ్ ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసి ఓయూ పీఎస్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని, మా సెల్ఫ్ సెంటర్ మాకు వచ్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

పండుగలు సోదర భావాన్ని పెంచుతాయి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



పండుగలు సోదర భావాన్ని పెంపొందిస్తాయని గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.శ్రీహరిశంకర్ అన్నారు. రంజాన్ పండుగ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని అఫ్జల్‌గంజ్ రాష్ట్ర, కేంద్ర గ్రంథాలయంలో ముస్లిం సోదరులకు 'ఇఫ్తార్' విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకులు శ్రీహరి శంకర్, ముఖ్య గ్రంథ పాలకులు ఏవీఎస్ రాజు, గెజిటెడ్ గ్రంథపాలకులు పీవీజీ రాణి, కేసరి హనుమాన్ తదితరులు ముస్లిం సోదరులకు పండ్లు అందజేసి ఉపవాస దీక్షలు విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ గ్రంథ పాలకులు పీజీవి రాణి, గ్రేడ్ వన్ కేసరి హనుమాన్, ఉద్యోగులు రాకెష్, రవి, ప్రతాప్, శ్రీకాంత్, మహేష్, అబ్బాస్, చంద్రమణి, సైజీదా బేగం, రమ్యశ్రీ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

జీఓ 58 కింద ఇండ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు గడువును పొడిగించాలి

- **తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక**

నవతెలంగాణ-ముషీరాబాద్



జీవో 58 కింద ఇండ్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక డిమాండ్ చేసింది. మంగళవారం గోల్కొండ క్రాస్ రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు జె. కుమారస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ సీలింగ్ భూముల్లో నివసిస్తూ ఇండ్ల పట్టాలు లేని పేదలకు జీవో 58 కింద ఉచితంగా క్రమబద్ధకరించుకునేందుకు ప్రభుత్వం ఈ నలె 30వ తేదీ వరకు అవకాశం కల్పించిందన్నారు. కానీ నగరంలో క్రమబద్ధీకరణ చేసుకునే వేలాదిమంది ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన సమయం సరిపోదన్నారు. దీన్ని మే 31 వరకు పొడగించాలని కోరారు. ఎస్.మారన్న మాట్లాడుతూ 125 గజాల లోపు స్థలం కలిగి 2020 జూన్ 2 నాటికి ఆ ఇంట్లో నివసిస్తున్నట్టు ఏదైనా ఒక ఆధారం (రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, కరెంట్ బిల్, వాటర్ బిల్ ఆస్తిపన్ను రసీదు, నిర్మాణ అనుమతి) స్థలం స్వాధీనంలో ఉన్నట్టు సూచించే ఇతర డాక్యుమెంట్లు కలిగి ఉండాలన్నారు. దీనికి తోడు ఏదైనా గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉంటే ఉచితంగా ఇంటి పట్టా పొందేందుకు 2023 ఏప్రిల్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చనీ, 125 గజాలకు మించి ఉంటే కొంత రుసుం చెల్లించి జీవో 59 కింద క్రమబద్ధీకరించుకోవచ్చుని తెలిపారు. గతంలో కూడా ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ కుంటి సాకులతో అధికారులు తిరస్కరించారన్నారు. సొంత జాగా ఉంటే ప్రభుత్వం ఇల్లు కట్టుకోవడానికి మూడు లక్షల ఆర్థిక సహకారం అందిస్తానని ప్రకటించిందని.. దాన్ని హైదరాబాద్ నగరంలో ఐదు లక్షలకు పెంచి ఇండ్ల పట్టా ఉన్నా లేకపోయినా ప్రతి పేద కుటుంబానికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టాల కోసం దళారుల మాటలు నమ్మి మోసపోద్దనీ, తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక పేదలకు సహకారంగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎ.పద్మ, ఎండీ జావేద్ పాల్గొన్నారు.

మతపరమైన రాజకీయాలు దేశ సమగ్రతకు ప్రమాదకరం

- **సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఈ.టి. నరసింహ**



నవతెలంగాణ-అంబర్‌పేట

బీజేపీ, ఎంఐఎం పార్టీల మతపరమైన రాజకీయాలు దేశ సమగ్రతకు ప్రమాదకరంగా మారాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఈ.టి. నరసింహ ఆందోళన వ్యక్తం చేసారు. రాజకీయాల్లో మతం పాత్ర కొనసాగితే దేశంలో అనిశ్చిత్రి, అశాంతి తోపాటు వృద్ధిలో తీవ్ర మందగమనం, సంపద నష్టం జరుగుతుందన్నారు. విభజించి పాలించే నీచమైన విధానాలు పాటిస్తూ శాంతియుత సహజీవనంలోఉన్న ప్రజల మతపరమైన మనోభావాలను దెబ్బతీయడనికి పాల్పడే పార్టీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ ఫాసిస్ట్ ప్రజా వ్యతరేక విధానాలను 'బీజేపీ హటావ్-దేశ్ బచావ్' నినాదంతో ప్రజలకు తెలిపేందుకు ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం మంగళవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు బస్తీల్లో, కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందల మంది సీపీఐ శ్రేణులు ఎర్ర జెండాలు చేతబూని ప్రదర్శనగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ మోడీ ప్రభుత్వం దేశాన్ని ఎలా నాశనం చేస్తుందో ప్రజలకు వివరించి, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరారు. మోడీ ప్రభుత్వ పాలనా పనితీరు అధ్వాన్నంగా మారిందన్నారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం చాలా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభించి ఎనిమిదేండ్లలో 23 కోట్ల మందిని దారిద్ర్యరేఖకు దిగువకు నెట్టిందన్నారు. తిండి దొరక్క పేద ప్రజలు ఉపాధి కోసం వేరే రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారని తెలిపారు. ఉపాధి కల్పన విషయంలో మోడీ ప్రభుత్వం విఫలమైందనీ, నిత్యావసర వస్తువుల ధరలు, డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ సిలిండర్ ధరలు విపరీతంగా పెరగడం వల్ల దేశ ప్రజలు విపరీతమైన బాధను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతతత్వ, వినాశకరమైన విధానాలు అవలంభిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ బీజేపీ, ఎంఐఎం పార్టీలు మత ఉద్రిక్తతలు సృష్టించడం వల్ల హైదరాబాద్ నగరంలో ఆశించినంత అభివృద్ధి జరగడంలేదన్నారు. పెద్దపెద్ద అభివృద్ధి పథకాల అమలుకు బీజేపీ, ఎంఐఎం పార్టీలు అడ్డుపడుతున్నాయన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను ఓడించి బుద్ధి చెప్పాలని కోరారు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి బీజేపీ ప్రభుత్వం బదులుగా నాలుగు కోడ్‌ను తీసుకవచ్చి కార్మికుల బతుకులను రోడ్డు పలు చేసిందన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతరేక విధానాలను నిరసిస్తూ పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు ఆర్.మల్లేష్, తెలంగాణ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బైరగోని రాజు గౌడ్, సీపీఐ నాయకులు కృష్ణగౌడ్, రాజు గౌడ్, లతీఫ్, జె.కుమార్, భూపాల్, రాజు, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

రవాణాశాఖ సేవలు అద్భుతం

- **ఖైరతాబాద్ ఆఫీస్, నాగోల్ ట్రాక్‌ను పరిశీలించిన బీహార్ ఎంవీఐ బృందం**



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో రవాణాశాఖ సేవలు అబ్బురపరిచేలా ఉన్నాయని బీహార్ రాష్ట్ర రవాణాశాఖకు చెందిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ (ఎంవీఐల) బృందం అభిప్రాయపడింది. రాష్ట్ర పర్యటనలో ఉన్న 58 ఎంవీఐలతో కూడిన బీహార్ బృందం మంగళవారం ఖైరతాబాద్‌లో రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్, ఆర్టీవో కార్యాలయాన్ని సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రవాణారంగంలో ప్రజలకు పారదర్శకమైన సేవలను అందిస్తుందని ఖైరతాబాద్ ఆర్టీవో ఎల్. రాంచందర్ అధికారులకు వివరించారు. దాదాపు 18 పౌర సేవలు రవాణాశాఖ ఆన్‌లైన్‌లో అందిస్తుందని తెలిపారు. ఎంవీఐలు శ్రీనుబాబు, రాజు, టెక్నికల్ హెడ్ మధుసూదన్ బీహార్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సదుపాయాల గురించి వివరించారు. అనంతరం అధికారులు కార్యాలయంలో పర్యటించి పౌరులకు క్యాష్‌లెస్ రూపంలో అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. విప్లవాత్మకంగా అమలవుతున్న ఐటీ సేవలను వారు ప్రశంసించారు.

డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్, ఫిట్‌నెస్ పరీక్షల పరిశీలన

నాగోల్ టెస్టింగ్ ట్రాక్స్ విభాగాన్ని సందర్శించారు. ఇక్కడ డ్రైవింగ్ లైసెన్స్ జారీ అమలవుతున్న పరీక్షా విధానాలను ప్రత్యక్షంగా వీక్షించి తెలుసుకున్నారు. రాష్ట్రంలో లైసెన్స్ జారీకి ఖచ్చితమైన విధానాలు అమలులో ఉన్నాయనీ, ఈ సందర్భంగా నాగోల్ డ్రైవింగ్ ట్రాక్ ఆర్టీవో సురేష్‌రెడ్డి వివరించారు. ఇక్కడ వివిధ లైసెన్స్‌ల జారీకి చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. నాగోల్‌లో వాహన ఫిట్‌నెస్ జారీ ప్రక్రియ గురించి ఆడిగి తెలుసుకున్నారు. ఎంవీఐ ఉమా బీహార్ అధికారులకు ఆయా అంశాలను గురించి వివరించారు. డాక్టర్ ఎంసీఆర్ హెచ్ ఆర్డీ సంస్థ సౌజన్యంతో అధికారులు రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా డాక్టర్ పెదబోయిన శ్రీనివాస్, శ్రీనివాస్ వద్ద వ్యవహరించారు.

సైబర్ నేరాల నివారణకు మరింత పురోగతి అవసరం

- **ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు బాలలత**

నవతెలంగాణ-బంజారాహిల్స్



సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం సరిపోవట్లేదని, మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ(సీఎస్‌బి) ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు బాలలత అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సైబర్ నేరాలు భారీగా పెరిగిపోతున్న ప్రస్తుత సమయంలో వాటిని అరికట్టేందుకు నేరస్థుల కంటే గొప్ప సాంకేతిక పరిజ్ఞానం పోలీసుల వద్ద లేదని చెప్పారు. తన జీవిత లక్ష్యం కోసం ఐఏఎస్ ఉద్యోగాన్ని వదులుకొని తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్‌లో రాణించాలని వారి కోసం ప్రత్యేకంగా యూట్యూబ్‌లో వీడియోలు పెడుతున్నారన్నారు. ఇప్పటి వరకు 3800 వీడియోలు ఉచితంగా అందించానని చెప్పారు. తన మెయిల్ ఐడి, యూట్యూబ్ చానల్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరస్థులు.. ఇతరులవీ కూడా చేస్తారని ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నానని అన్నారు. రాబోయే కాలంలో విద్యార్థులకు ఇది శాపంగా మారవచ్చునని, వెంటనే దీనిపై చర్యలు తీసుకొని విద్యార్థుల భవిష్యత్తుకు భరోసాని ఇవ్వాలని కోరారు. ఈ సైబర్ హ్యాక్‌పై తాను సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు.

రేషన్ దుకాణాల్లో డిప్యూటీ మేయర్ ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-సిటీబ్యూరో/ఓయూ



తార్నాక డివిజన్ విజయ డైరీ, చింతల్‌లోని పౌరసరఫరాల డీలర్ షాపులను నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ దుకాణాల్లో బియ్యం సక్రమంగా సరఫరా జరుగుతుందా లేదా అనే విషయంతోపాటు తూకంలో ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా లబ్ధిదారులకు సరుకులు అందుతున్నాయా అన్న విషయాన్ని పరిశీలించారు. లబ్ధిదారుల పట్ల డీలర్ పనితీరు ఎలా ఉందిని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే ఉచిత బియ్యాన్ని అవకతవకలు లేకుండా లబ్ధిదారులకు అందించాలనీ, ఎలాంటి అక్రమాలకు పాలుపడొద్దంటూ డీలర్లను హెచ్చరించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాల్సిందిగా లబ్ధిదారులకు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో సరస్వతి, సర్కిల్ 9 ఇన్‌స్పెక్టర్లు లోకేష్, ఉత్తేజ్, కిరణ్, యూ.వీ.ఆర్.ఎస్. సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల నివాసాల వద్ద నిరసన

నవతెలంగాణ-బంజారాహిల్స్



తమ సేవలను గుర్తించి న్యాయం చేయాలని గిరిజన మినీ గురుకుల కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నిర్మల ఆధ్వర్యంలో 29మంది మహిళలు మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని మంత్రుల నివాసం గేటు వద్ద నినాదాలు చేశారు. వీరిని బంజరాహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మినీ గురుకుల కాంట్రాక్ట్ ఉద్యోగులకి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ కనీసా వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో 29 గురుకులాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులు అతి తక్కువ వేతనాలతో.. మారుమూల ప్రాంతాల్లో ఎన్నో ఇబ్బందులు పడుతూ పని చేస్తున్నారని తెలిపారు. పేద గిరిజన విద్యార్థులకు విద్యను అందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయులకు నెలకు రూ.15వేలు, పెట్‌లకు 11వేలు, అకౌంటెంట్‌కి రూ.10వేలు, వర్కర్లకు రూ.7500 చొప్పున ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. కానీ కాంట్రాక్ట్ లేబర్ యాక్ట్ ప్రకారం రెగ్యులర్ ఉద్యోగితో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. 5 సంవత్సరాల నుంచి ఇతర డిపార్ట్‌మెంట్స్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులకు లేబర్ యాక్ట్ ప్రకారం వేతనాలు అమలు అవుతున్నాయన్నారు. మినీ గురుకులం కాంట్రాక్ట్ ఉద్యోగులకు మాత్రమే కనీస వేతనాల జీవో ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని, ఇది అన్యాయమని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కనీస వేతనాల చట్టం ప్రకారం వేతనాలు పెంచి అమలు చేయాలని, ధరల పెరుగుదల వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మమ్మల్ని ఆదుకోవాలని కోరారు. అలాగే, పర్మినెంట్ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్, హెల్త్‌కార్డు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రజిని, సుశీల, శ్రీలత, వనిత, మంకు బాయ్, గిరిజ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

29న లేబర్ కమిషనర్ ఆఫీసు ఎదుట ధర్నా

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలనీ, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29వ తేదీన లేబర్ కమిషనర్ ఆఫీస్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ గోషామహల్ జోన్ కన్వీనర్ కె.జంగయ్య, బేగంబజార్ ట్రాన్స్‌పోర్ట్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు జి.నర్సింహ్మా, జి.ఆనంద్ తెలిపారు. మంగళవారం ధర్నా పోస్టర్‌ను హమాలీ కార్మికులతో కలిసి కిషన్ గంజ్ సీఐటీయూ ఆఫీస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల మాదిరిగానే హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని కోరారు. 55 ఏండ్ల వయస్సు పైబడిన వారికి నెలకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలనీ, గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలనీ, పని ప్రదేశాల్లో హమాలీల కోసం టాయిలెట్స్, విశ్రాంత గదులు ఏర్పాటు చేయాలనీ, హమాలీ కార్మికులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం లేబర్ కమిషనర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని హమాలీ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.కుర్మయ్య, కె.అంజప్ప, జె.బసంతు, జి.వెంకటేష్, జి.తిరుపతి, పి.తాయప్ప, భీమప్ప, నర్సింహ్మా, కె.ఆశప్ప, దేవప్ప, అశోక్, శరణ్, టి.రాజు, అంజప్ప, శ్రీను, క్రిష్ణ పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి

- **లేకపోతే మరో ఉద్యమానికి సిద్ధమవుతాం**
- **తెలంగాణ వీఆర్ఏ హక్కుల సాధన సమితి చైర్మెన్ ఆర్.విజయ్**



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రభుత్వం వీఆర్ఏలకు ఇచ్చిన హామీలు, పే స్కేలు అర్హత కలిగిన వీఆర్ఏలకు ప్రమోషన్ల హామీలను అమలు చేయాలని తెలంగాణ వీఆర్ఏ కుల సాధన సమితి చైర్మెన్ విజయ్ డిమాండ్ చేశారు. 55 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వీఆర్ఏ హక్కుల సాధన సమితి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని 80 రోజులు సమ్మె చేశామని, సుమారు 80 మంది వీఆర్ఏలను కోల్పోయామని, అయినా ఈ ప్రభుత్వంలో చలనం లేదన్నారు. మునుగోడు ఎన్నికలు అవ్వగానే మీ సమస్యలకు సంబంధించిన జీవోలు విడుదల చేస్తామని హామీ ఇచ్చి సమ్మెను విరమింపజేశారన్నారు. సమ్మెను విరమించి సుమారు 6 నెలలు గడుస్తున్నా మమ్మల్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని యెడల రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర చేసి వీఆర్ఏలను ఏకం చేస్తామని, జీవోలు విడుదల అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జాబ్ చార్ట్ ప్రకారం పార్ట్ టైం ఉద్యోగం కాబట్టి గ్రామాల్లోనే పనిచేస్తామని, అదనపు పనులు చెయ్యబోమని తెలిపారు. ఎన్నికల విధులను బహిష్కరిస్తామని చెప్పారు. అవసరమైతే ఇందిరా పార్క్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష కూడా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వీఆర్ఏ హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి అంబాల శ్రీధర్‌గౌడ్, కో చైర్మెన్లు లక్ష్మల్ల నరసింహారావు, దాసరి వీరన్న, షర్మిల, రాజయ్య, చల్ల లింగరాజు, కన్వీనర్లు నార్ల శ్రీనివాస్ ముదిరాజ్, సునీత, కోకన్వీనర్లు ఆరుట్ల బాలయ్య, ఎడ్ల మల్లయ్య, అశోక్, వివిధ జిల్లాల వీఆర్ఏలు పాల్గొన్నారు.

పేదలకు వరంగా ప్రభుత్వ పథకాలు

- **డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్**
- **షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**



నవతెలంగాణ-ఓయూ

ప్రభుత్వ పథకాలు పేదలకు వరంలా ఉంటాయని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. మంగళవారం సితాఫలమండీలోని క్యాంపు కార్యాలయంలో రూ. 40 లక్షలకు పైగా విలువ జేసే 20 షాదీ ముబారక్, 9 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్దిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లల వివాహాలు తల్లిదండ్రులకు భారంగా మారకుండా షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని చెప్పారు. నిరుపేద ప్రజల సంక్షేమానికి వివిధ సంక్షేమ పథకాలను అమలు జరుపుతున్నారన్నారు. పేద ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకుంటున్నామన్నారు. షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, పెన్షన్ లబ్దిదారులు ఎవరికీ చిల్లి గవ్వ చెల్లించాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే తమ కార్యాలయం నెంబరు 040-27504448కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునిత, కంది శైలజ, నేతలు కంది నారాయణ, లింగాని శ్రీనివాస్, బీఆర్ఎస్ యువ నేత తీగుళ్ళ రామేశ్వర్ గౌడ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 58 జీవో కింద వెంటనే పట్టాలు ఇవ్వాలి

- **ఖైరతాబాద్ ఎమ్మార్వోకు సీపీఐ(ఎం) నాయకుల వినతి**

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బస్తీల్లో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ఉంటున్న పేదలకు వెంటనే జీవో 58 కింద పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) నాయకులు కోరారు. జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఖైరతాబాద్ ఎమ్మార్వోకు వినతి పత్రం ఇచ్చారు. జీవో 58 కింద ఈ నెల 16 నుంచి 30 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని, దీనిని మే నెల మొత్తం పొడిగించాల్సిందిగా కోరారు. ఈ నెలలో ప్రభుత్వ సెలవులు ఎక్కువగా ఉన్నందున అప్లికేషన్ పెట్టుకోవడానికి గడువు పెంచాలని డిమాండ్ చేశారు. ఇంతకుముందు అప్లికేషన్ పెట్టుకున్న వారికి, మళ్ళీ అప్లికేషన్ పెట్టుకోకుండా పాత అప్లికేషన్లనే ఓకే చేసి సర్వే చేయాలని సూచించారు. స్థలం ఉండి రేకుల ఇల్లు ఉన్న వారందరికీ రూ.3లక్షల స్కీం కింద దరఖాస్తులు తీసుకోవాలని కోరారు. ప్రజలందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు రాపర్తి అశోక్, టి.సాయి శేషగిరిరావు, జి.స్వామి, జి.కిరణ్, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నవతెలంగాణ-అంబర్‌పేట



అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. మంగళవారం నల్లకుంట డివిజన్‌లోని స్ట్రీట్ నంబర్ 7లో రూ.49 లక్షలతో నూతనంగా వేయనున్న డ్రైనేజీ పైప్ లైన్ పనులకు ఎమ్మెల్యే నల్లకుంట కార్పొరేటర్ అమృతతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో పాదయాత్ర నిర్వహించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకుని తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్కడ చెపట్టాల్సిన పలు అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా లేక ఇబ్బందులు

నవతెలంగాణ-ముషీరాబాద్



బాగ్‌లింగంపల్లి వాటర్ వర్క్స్ కార్యాలయం పరిధిలోని అచ్చయ్య నగర్, పాలమూరు బస్తీ, ఎంఐజీ క్వార్టర్స్ తదితర ప్రాంతాలలో వేలాపాలలేని నీటి సరఫరాతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మంచి నీటి సరఫరాకు నిర్దిష్టమైన సమయాన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బాగ్‌లింగంపల్లి జలమండలి కార్యాలయం వద్ద స్థానికులతో కలిసి రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవి చారి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేకంగా కుటుంబంలో ఒక వ్యక్తి సమయం కేటాయిస్తే తప్ప తాగునీరు దొరికే పరిస్థితి లేదన్నారు. జలమండలి అధికారుల నిర్లక్ష్యంతో డ్రైనేజ్ మ్యాన్ హెూల్స్ పొంగిపొర్లుతున్నాయని, అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి సరఫరా పైపులైన్లు కాలం చెల్లినవి కావడంతో నిత్యం కలుషిత నీరు సరఫరా కావడంతో స్థానికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా వాటర్ వర్క్స్ అధికారులు స్పందించి అవసరమైన చోట కొత్త పైపులైన్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు యశోద, మహేశ్వరి, సుగుణ, రాధ, బాలయ్య శ్రీధర్, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



నాంపల్లి మండల పరిధిలోని గన్ ఫౌండ్రీ డివిజన్‌లోని లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్, గన్ ఫౌండ్రి డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్. నాంపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్, తదితరులు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- **ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్**



నవతెలంగాణ-బంజారాహిల్స్

సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. మంగళవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని సీబీఐ క్వార్టర్స్‌లో పర్యటించిన ఎమ్మెల్యే డిసెంబర్‌లోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజలతో ప్రత్యక్ష భేటీ కార్యక్రమంలో కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని సత్వరంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని అధికారులు వాటిని పరిష్కరించే విధంగా సత్వరం తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ డీఎంసీ మోహన్ రెడ్డి, ఈఈ ఇందిరా బాయ్, విద్యుత్తు, శానిటైజేషన్ శాఖల అధికారులు, రాజ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేస్ -1 మజీద్ వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంగళవారం డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసీ బీఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లీం సోదరులు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ 13, 14వ డివిజన్ అధ్యక్షుడు రంజిత్ రెడ్డి, బొబ్బ శీను, యువ నాయకులు ఆనంద్ రెడ్డి, ఇందిరమ్మ కాలనీ ఫేస్ -1 మజీద్ ప్రెసిడెంట్ పాషా భాయ్, మజీద్ కమిటీ సభ్యులు అజాజ్ అహమ్మద్, మెహబూబ్ భాయ్, కరీమ్ భాయ్, ఫాసి భాయ్, మైనార్టీ నాయకులు షాజహాన్, నాయకులు, మైనార్టీ నాయకులు, మైనార్టీ సభ్యులు అఖిల్ పాషా, యువకులు సాయి, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యాలకు ప్రతీక ఇఫ్తార్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మతసామరస్యాలకు ప్రతీకగా ఇఫ్తార్ విందులు దోహదపడతాయని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. మంగళవారం సాయంత్రం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ చంద్రగిరి నగర్ పరిధిలో ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ముస్లింలు సోదర భావంతో ఐక్యత చాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవాబ్ భాయ్, హాసన్ ఖాన్, బిలాల్ భాయ్, జహంగీర్ భాయ్, తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధనకు దశల వారీ పోరాటాలు

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌కె.సలీమా, తన్నీరు శ్రీనివాస్
- సంతకాల సేకరణకు విశేష స్పందన

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధన కోసం దశలవారీగా పోరాటాలు నిర్వహించాలని టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్ కె. సలీమా, తన్నీరు శ్రీనివాస్ అన్నారు. జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీడిమెట్ల ప్రెస్‌క్లబ్ ఆవరణలో మంగళవారం చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సుమారు 100 మంది జర్నలిస్టులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం



టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఇండ్ల, ఇండ్ల స్థలాల సాధన కోసం దశలవానీ ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధన కోసం చేపడుతున్న ఆందోళన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, మండపాక కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఇండ్ల సాధన కోసం చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి హరిప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శి యాట రాజు, రమేష్, కావలి మోహన్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షుడు గడ్డమీద బాలరాజు, వీరేష్ ముదిరాజ్, నాగరాజు డప్పు రామస్వామి, పి.ఉపేందర్, మన్నె వినోద్ ముదిరాజ్, శేఖర్, యాదగిరి, శ్రీను, నామమోహన్, నాగేష్, మంజుల, సౌభాగ్యవతి, లక్ష్మీ, దివాకర్, జి.ఆంజనేయులు మెరుగు విష్ణు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయం

- మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అగ్నిమాపక సిబ్బంది సేవలను మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద అభినందించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ అధికారులు మంగళవారం జీడిమెట్ల ఫైర్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన అగ్నిమాపక వారోత్సవాల్లో మంత్రి, ఎమ్మెల్యే పాల్గొన్నారు. రక్తదాన శిబిరాలను ప్రారంభించారు. అనంతరం అగ్ని ప్రమాదాల సమయంలో వినియోగించే యంత్ర సామాగ్రి, పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రమాదాలు సంభవించినప్పుడు తమ ప్రాణాలను ప్రాణంగా పెట్టి మంటలను అదుపు చేసేందుకు కృషి చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది సేవలను కొనియాడారు. ప్రజల రక్షణ కోసం మరికొన్ని ఫైర్ స్టేషన్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీజీఎఫ్ఎస్ వై.నాగిరెడ్డి, డీఎఫ్ఎస్ లక్ష్మీ ప్రసాద్, అడిషనల్ డైరెక్టర్ నారాయణ రావు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ పాపయ్య, జిల్లా ఫైర్ ఆఫీసర్ సుధాకర్ రావు, అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ సైదులు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుభాష్ రెడ్డి, ఫైర్‌మెన్స్ చాంద్ పాషా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక 'పబ్లిక్ కాంటాక్ట్' ప్రోగ్రాం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కాలనీలలోని పలు సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'పబ్లిక్ కాంటాక్ట్' కార్యక్రమం అని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని మహాత్మా గాంధీ నగర్‌లో పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ సమావేశం ఎల్లమ్మబండ పరిధిలోని మహాత్మాగాంధీ నగర్, దత్తాత్రయ కాలనీ, కమలమ్మ కాలనీ, శివమ్మ కాలనీల్లోని సమస్యలను తెలుసుకోవడానికి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతి కాలనీ, బస్తీ, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లలో ఉన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జీహెచ్ఎంసీ, వివిధ విభాగాల అధికారులతో కలిసి ముందుకెళ్తామన్నారు. ప్రత్యక్షంగా వెళ్లి సమస్యలు తెలుసుకోవాలనే ముఖ్య ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. కాలనీ సమస్యలను నేరుగా చెప్పుకోవడానికి ఇది ఒక చక్కటి కార్యక్రమం అని, ప్రతి కాలనీ వారు సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు చిన్నోళ్ల శ్రీనివాస్, రాజేష్ చంద్ర, మాజీ అధ్యక్షులు పాండుగౌడ్, బీఆర్ఎస్ నాయకులు శివరాజ్‌గౌడ్, జగదీష్, రాజు పటేల్, పోశెట్టిగౌడ్, వాసుదేవరావు, బిరాదర్, దేవేందర్, కరణ్ సింగ్, జలమండలి మేనేజర్ ఝాన్సీ, ఎంటమాలజీ ఏఈ ఉషారాణి, టీపీఎస్ సోమేశ్వర్, డాక్టర్ సౌమ్య, అర్బన్ హెచ్‌ఏ నాగరాణి, ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు, స్ట్రీట్ లైట్స్ సూపర్‌వైజర్ నరేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్స్ రవి కుమార్, రవీందర్ రెడ్డి, జల మండలి సూపర్‌వైజర్ శివ, పోలీస్ శాఖ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరా లగ్జరీ సెలూన్ ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో



జూబ్లీహిల్స్‌లో అత్యంత వైభవంగా ఆత్యాధునికమైన హంగులతో ఏర్పాటు చేసిన ఆరా లగ్జరీ సెలూన్‌ను నిర్వాహకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరా లగ్జరీ సెలూన్ యజమాని రమ్య రచ్చ మాట్లాడుతూ జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్ పరిధిలోని మెన్ అండ్ ఉమెన్‌లను మరింత అందంగా తీర్చిదిద్దేలా తమ ఆరా లాగ్జరీ సెలూన్‌ను ఏర్పాటు చేశామన్నారు.. ప్రీమియం నుంచి లగ్జరీ ఉత్పతులను వినియోగించి వినియోగదారులకు సేవలను అందిస్తుంటామని తెలిపారు. మేకప్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. గతేడాది మిస్ ఇండియా తెలంగాణ అందాల పోటీల్లో తమ వినియోగదారులు పాల్గొన్నారని తెలిపారు.

ప్రతిభ టాలెంట్ టెస్ట్‌కు అపూర్వ స్పందన

నవతెలంగాణ-ఓయూ



ఏఎస్ రావు నగర్, ఈసీఐఎల్‌లోని లిటిల్ ఫ్లవర్ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభ టాలెంట్ టెస్ట్ 2023-కు అపూర్వ స్పందన లభించింది. ఇటీవల పదో తరగతి పరీక్షలు పూర్తి చేసుకున్న 123 మంది విద్యార్థులు ఈ టెస్ట్‌లో పాల్గొన్నారని కళాశాల కరస్పాండెంట్ డా.సదానంద, ప్రిన్సిపాల్ జ్యోతి సదానంద తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి సాయి మోహిత్ 10 వేల రూపాయలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, కె.సాయి స్ఫూర్తి, తృతీయ బహుమతి కీర్తి ప్రియ, తరుణ్‌కు రెండు వేల రూపాయలు అందజేశారు.

'పబ్లిక్ కాంటాక్ట్'తో పేరుకుపోయిన సమస్యలకు పరిష్కారం

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



కాలనీలలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడానికి పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమం చక్కటి వేదిక అని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్‌రావు అన్నారు. డివిజన్ పరిధిలోని బందావన్ కాలనీ, వర్టెక్స్ ప్రెస్టేజ్, జై భారత్ నగర్‌లో మంగళవారం అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి కాలనీ, బస్తీ, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లలో జీహెచ్ఎంసీ, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు. సుమారు 15 శాఖల అధికారులు ఒకే వేదిక ను పంచుకోవడం జరుగుతుందన్నారు. మీ కాలనీ సమస్యలను నేరుగా చెప్పుకోవడానికి ఇది ఒక చక్కటి అవకాశం అన్నారు. ప్రతి కాలనీ వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. మన కాలనీలను, మన ప్రాంతాలను ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ మహేందర్‌రెడ్డి, ఏఈలు రాజీవ్, ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహాదేవ్, కమ్యూనిటీ ఆర్గనైజర్ ముస్తఫా, స్ట్రీట్ లైట్స్ సూపర్‌వైజర్ సుధాకర్, లైన్‌మెన్ కాళీ, హరికల్చర్ దాసు, ఎస్ఎఫ్ఏ భరత్, డివిజన్ గౌరవ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పోతులరాజేందర్, రాగప్రసాద్ పాల్గొన్నారు.

అవిశ్వాసంపై వెనక్కి తగ్గిన పూడూరు సొసైటీ డైరెక్టర్లు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామ రైతు సేవా సహకారం సంఘం డైరెక్టర్లు సొసైటీ చైర్మన్ ఎస్.సుధాకర్ రెడ్డిపై ఇటీవల పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని మంగళవారం వెనక్కి తీసుకున్నారు. సొసైటీ చైర్మన్ పనితీరు సరిగ్గా లేదని ఆరోపిస్తూ 10 మంది డైరెక్టర్లు ఈనెల 15వ తేదీన జిల్లా కో-ఆపరేటివ్ అధికారికి అవిశ్వాస తీర్మానానికి ప్రవేశపెట్టాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. మంగళవారం సొసైటీ చైర్మన్ ఎస్‌జసుధాకర్ రెడ్డితో కలసి డైరెక్టర్లు విఠల్‌రెడ్డి, సత్తెమ్మ, శ్రీశైలం, అర్జున్, శ్యామ్‌లాల్, స్వరూప, శ్రీనివాస్ గౌడ్, మల్లేష్ అవిశ్వాస తీర్మానాన్ని ఉపసంహరించుకుట్టునట్టు జిల్లా కో-ఆపరేటివ్ అధికారికి నోటీసు అందజేశారు.

సూపర్ మాక్స్ కంపెనీ కార్మికుల దీక్షకు సంఘీభావం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జీడిమెట్ల ఇండస్ట్రియల్‌లో గల సూపర్ మాక్స్ కంపెనీ కార్మికులు 10 నెలల నుంచి జీతాల్లేక అనేక ఇబ్బందులు పడుతూ యాజమాన్యం తమకు న్యాయం చేయాలని కంపెనీ వద్ద 51వ రోజు చేపడుతున్న రిలే నిరాహారదీక్షకు మంగళవారం మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని సంఘీభావం తెలిపి మాట్లాడారు. సూపర్ మాక్స్ కంపెనీ కార్మికులకు అండగా ఉంటామన్నారు. కార్మికులు ఎలాంటి దిగులు చెందాల్సిన అవసరం లేదనీ, న్యాయం జరిగేలా తోడుంటామని భరోసానిచ్చారు. యజమాన్యం మెడలు వంచైనా కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి



కార్మికులకు న్యాయం జరిగేలా సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ యూనియన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్‌కేవీ యూనియన్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి, సీఐటీయూ ప్రెసిడెంట్ మల్లికార్జున్, జేసీఎల్ చతుర్వేది, కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానంద పాదయాత్ర



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

"ప్రగతి యాత్ర"లో భాగంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కుత్బుల్లాపూర్ 131 డివిజన్ పరిధిలో 47వ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా గణేష్ నగర్ కాలనీ -1, 2లలో మాజీ కార్పొరేటర్ కేఎం గౌరేష్‌తో కలిసి సీసీ రోడ్లు, డ్రైనేజ్ వంటి అభివృద్ధి పనులను పరిశీలించారు. మిగిలిన రోడ్డు పనులను త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. గతంలో తమ కాలనీలో నెలకొన్న అనేక సమస్యలకు ఎమ్మెల్యే శాశ్వత పరిష్కారం చూపినందుకు కాలనీవాసులు ఘన స్వాగతం పలికి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, నార్లకంటి బాలయ్య, జయం చారి, సుధాకర్ రెడ్డి, వెంకటేష్, అజయ్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలను ప్రయివేటీకరణ చేస్తే బ్యాగరులకు అన్యాయం

నవతెలంగాణ-అడిక్‌మెట్



స్మశాన వాటికలను ప్రైవేటీకరణ చేసి బ్యాగరి కులస్తులకు అన్యాయం చేస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మాల బ్యాగరీ కాటికాపరుల వృత్తిదారుల సంఘం మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మల మహా నాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య, మాల బ్యాటరీ వృత్తిదారుల సంఘం అధ్యక్షులు మన్నె శ్రీధర్ రావు హాజరై మాట్లాడారు. హిందూ స్మశాన వాటికలను ప్రవేట్ ఏజెన్సీలకు కాంట్రాక్టర్లకు అప్పగించడం వెంటనే ఆపాలన్నారు. శ్మశాన వాటికలను అభివృద్ధి చేసి మాల బ్యాగరీ కులవృత్తిదారులకు ఇవ్వాలన్నారు. మాల బ్యాగరీ కుల వృత్తిదారులకు కలెక్టర్ ద్వారా గుర్తింపు కార్డులు జీవిత బీమా ఆరోగ్య బీమా ఇవ్వాలన్నారు. సంక్షేమ భవన నిర్మాణం కోసం రెండెకరాల భూమి ఐదు కోట్ల నిధులు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి హిందూ శ్మశాన వాటికలను కబ్జా కాకుండా కాపాడాలని కోరారు. ఈ మహా ధర్నాలో మాల బ్యాగరీ వృత్తిదారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఫిరోజి మహేందర్, ప్రధాన కార్యదర్శి తునికి పద్మాకర్, కోశాధికారి నాత శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు దాసరి సత్యనారాయణ, పెగడ రమేష్, వేముల జగన్ కొల్లూరి, బొంతపల్లి బలవంతరావు, హరినాథ్, కొల్లూరి రవిశంకర్, ఎస్.సురేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

25న ముషీరాబాద్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-ముషీరాబాద్



ఈనెల 25వ తేదీన బీఆర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తలు, ప్రజలు కలిసిపోయేలా అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి నగర ఇన్‌చార్జిలు, మంత్రులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు ముఠా జై సింహ, సీనియర్ నాయకులు రెబ్బ రామారావు, లక్ష్మీ గణపతి ఆలయం చైర్మన్ ముచ్చ కుర్తి ప్రభాకర్, డివిజన్ అధ్యక్షులు ఎం.రాకేష్ కుమార్, వల్లాల శ్యామ్ యాదవ్, నర్సింగ్ ప్రసాద్, నాయకులు ముఠా నరేష్, శ్రీధర్ చారి, శంకర్ ముదిరాజ్, మహంకాళి దేవస్థానం చైర్మన్ ఎయిర్టెల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాలను ఆదరిస్తున్న ప్రభుత్వం

- బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీషా బాబురావు
- ముస్లింలకు తోఫాలు అందజేత

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అన్ని మతాలను ఆదరిస్తూ ప్రాధాన్యత ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని హబీబ్‌నగర్, వివేక్ నగర్‌లో ప్రభుత్వం తరఫున తోఫాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల పవిత్ర మాసంలో ఉపవాసాలు ఆచరించే ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఖదీర్, హబీబ్‌నగర్ అసోసియేషన్ అధ్యక్షులు



యధుల్, కరీన్‌సాబ్, ఫేయాజ్, రషీద్, ఇద్రిస్, మెహబూబ్, హుస్సేన్, శ్రీనివాస్ చారీ, సంతోష్ కుమార్, భాస్కర్ రావు, వివేక్‌నగర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రకాష్, కార్యదర్శి అనిల్ కుమార్, లలిత, మోహన్, కృష్ణ, బాలనర్సింహ, సదక్, హుస్సేన్, యాసిన్, రషీద్, సలీం ఖాన్, షామిమ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

పూడూరు గ్రామ అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి

నవతెలంగాణ-మేడ్చల్



పూడూరు గ్రామ అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం పని చేస్తానని ప్రముఖ న్యాయవాది నక్క మల్లికార్జున్ అన్నారు. మంగళవారం గ్రామ పరిధిలోని వైకుంఠ దామం, బస్ స్టాప్, కట్ట మైసమ్మ ఆలయం వద్ద గ్రామస్తులు కూర్చోవడానికి వీలుగా వారి తల్లి నక్క వరమ్మ జ్ఞాపకార్థంగా 15 సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం పరిధిలోని సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. వైకుంఠదామంలో గ్రామస్తులు దహన సంస్కారాలు, ఇతర కార్యక్రమాలు చేస్తున్నప్పుడు కూర్చోవడానికి వీలుగా 10 సిమెంట్ బెంచ్‌లు, బస్టాప్‌లో ప్రయాణికులు కూర్చోవడానికి, కట్ట మైసమ్మ వద్ద వాకర్స్ కూర్చోవడానికి వీలుగా 2బెంచ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అనంత్ రెడ్డి, కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని పుష్పగిరి బస్తీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ కమిటీ సభ్యులు మరియు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



ఐపీఎల్‌లో నేడు
రాజస్థాన్ X లక్నో
వేదిక : జైపూర్ , సమయం : రా: 7.30
స్టార్‌స్పోర్ట్స్,జియో సినిమాలో ప్రసారం

గ్రీన్, తిలక్ షో

రాణించిన కిషన్, రోహిత్/ముంబయి ఇండియన్స్ 192/5

లోకల్ బాయ్ తిలక్ వర్మ (37) ఉప్పల్‌లో ధనాధన్ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. కామెరూన్ గ్రీన్ (64 నాటౌట్) అర్థ సెంచరీతో చెలరేగటంతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ 192/5 పరుగుల భారీ స్కోరు సాధించింది. హైదరాబాద్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టినా.. బ్యాటింగ్ అనుకూల పిచ్‌పై ముంబయి ఇండియన్స్ మంచి స్కోరు నమోదు చేసింది.



నవతెలంగాణ-హైదరాబాద్

కామెరూన్ గ్రీన్ (64 నాటౌట్, 40 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీతో కదం తొక్కాడు. పించ్ హిట్టర్‌గా బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోట్ అయిన కామెరూన్ గ్రీన్ అజేయ అర్ధ సెంచరీ సాధించాడు. ఓపెనర్ ఇషాన్ కిషన్ (38, 31 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), తెలుగు తేజం తిలక్ వర్మ (37, 17 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) సైతం రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ 192/5 పరుగుల భారీ స్కోరు చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ పేసర్ మార్కో జాన్సెన్ (2/43), భువనేశ్వర్ కుమార్ (1/31) రాణించారు.

గ్రీన్, తిలక్ షో : టాస్ నెగ్గిన సన్‌రైజర్స్ హైదరాబాద్ మంచు ప్రభావం దృష్టిలో ఉంచుకుని తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఉప్పల్‌లో బ్యాటింగ్ పిచ్‌పై ముంబయి ఇండియన్స్ ఓపెనర్లు అదిరే ఆరంభాన్ని ఇచ్చారు. కెప్టెన్ రోహిత్ శర్మ (28, 18 బంతుల్లో 6 ఫోర్లు), ఇషాన్ కిషన్ (38) తొలి వికెట్‌కు 4.4 ఓవర్లలోనే 41 పరుగులు జోడించారు. జోరుమీదున్న రోహిత్‌ను నటరాజన్ వెనక్కి పంపించాడు. ఇషాన్ కిషన్, కామెరూన్ గ్రీన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. పేసర్ మార్కో జాన్సెన్ ఒకే ఓవర్లో ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్ (7)ను అవుట్ చేసి ముంబయి ఇండియన్స్‌ను దెబ్బ కొట్టాడు. కానీ లోకల్ బాయ్, తెలుగు తేజం తిలక్ వర్మ (37) ఇన్నింగ్స్‌ను దూకుడు పట్టాలు ఎక్కించాడు. తిలక్ వర్మ తోడుగా కామెరూన్ గ్రీన్ రెచ్చిపోయాడు. తిలక్ వర్మ నాలుగు సిక్సర్లతో ఉప్పల్ మైదానాన్ని ఊపేశాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్‌తో కామెరూన్ గ్రీన్ అర్థ సెంచరీ సాధించగా.. బౌండరీల జోరుమీదున్న తిలక్ వర్మను భువనేశ్వర్ వెనక్కి పంపించాడు. చివర్లో టిమ్ డెవిడ్ (16, 11 బంతుల్లో 2 ఫోర్లు) తోడుగా ముంబయి ఇండియన్స్‌కు కామెరూన్ గ్రీన్ మంచి ముగింపు అందించాడు. 20 ఓవర్లలో 5 వికెట్లకు ముంబయి ఇండియన్స్ 192 పరుగులు చేసింది. హైదరాబాద్ బౌలర్లలో మార్కో జాన్సెన్ రెండు వికెట్లు పడగొట్టగా.. భువనేశ్వర్ కుమార్, టి.నటరాజన్ చెరో వికెట్ తీసుకున్నారు.



చీఫ్ సెలక్టర్ లేకుండానే?

- సెలక్షన్ కమిటీలో ప్రస్తుతం నలుగురే
- దృష్టి సారించని భారత క్రికెట్ బోర్డు

న్యూఢిల్లీ : ఐసీసీ టోర్నమెంట్లకు భారత క్రికెట్ జట్టు ఎంపిక ఎప్పుడూ చర్చనీయాంశంగా మారుతోంది. గత ఆసియా కప్, గత రెండు ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లకు పూర్తి స్థాయి సెలక్షన్ కమిటీ లేకుండానే జట్లను ఎంపిక చేశారు. తాజాగా ఐసీసీ 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ముంగిట సైతం సీనియర్ సెలక్షన్ కమిటీకి సారథి లేకుండా పోయాడు. ఓ టెలివిజన్ చానెల్ స్టింగ్ ఆపరేషన్ ఫలితంగా చేతన్ శర్మ చీఫ్ సెలక్టర్ పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరిలో చేతన్ శర్మ రాజీనామా ఆమోదించిన బీసీసీఐ కార్యదర్శి జై షా ఆమోదించారు. ఆ తర్వాత సెలక్షన్ కమిటీకి నూతన చైర్మెన్‌ను ఎంపిక చేసే బాధ్యతను బోర్డు విస్మరించింది.

ఆసియా కప్ ముంగిటే! : ఈ ఏడాది జూన్ తొలి వారంలో ఐసీసీ 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఆడాల్సి ఉంది. లండన్‌లోని ది ఓవల్ మైదానంలో భారత్, ఆస్ట్రేలియా జట్లు డబ్ల్యూటీసీ గద కోసం పోటీపడనున్నాయి. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు జట్టును ఎంపిక చేసేందుకు మే 7 తుది గడువు. బీసీసీఐ మే 7న భారత జట్టును ఎంపిక చేసే అవకాశం ఉంది. మే 22 వరకు జట్టులో మార్పులు చేర్పులకు ఐసీసీ అనుమతి ఉంటుంది. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ బిజీలో ఉన్న భారత క్రికెట్ యంత్రాగానికి చీఫ్ సెలక్టర్ ఎంపిక ఇప్పుడు ప్రాధాన్యత అంశంగా కనిపించటం లేదు. దీంతో సెప్టెంబర్‌లో ఆసియా కప్‌కు ముందు మాత్రమే చీఫ్ సెలక్టర్‌ను ఎంపిక చేసేందుకు అవకాశం కనిపిస్తోంది. చేతన్ శర్మ రాజీనామాతో శివ్ సుందర్ దాస్ తాత్కాలిక చీఫ్ సెలక్టర్‌గా కొనసాగుతున్నారు. శివ్ సుందర్ దాస్ ప్యానల్ ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు జట్టును ఎంపిక చేయనుంది. 'సరైన సమయంలో చీఫ్ సెలక్టర్ ఎంపికపై నిర్ణయం ఉంటుంది. ఇప్పుడు దానిపై తొందర లేదు. టెస్టుల్లో భారత్‌కు కుదురైన జట్టు ఉంది. ప్రస్తుత సెలక్షన్ కమిటీకి ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు జట్టును ఎంపిక చేసే సామర్థ్యం ఉంది. గాయాలు, ఫిట్‌నెస్, ఫామ్ ఇలా అన్ని అంశాలపై ప్రస్తుత ప్యానల్‌కు పూర్తి అవగాహన ఉందని' బీసీసీఐ ఆఫీస్ బేరర్ ఒకరు తెలిపారు.



చరిష్మా ఉన్నవారేరీ? : కొంతకాలంగా భారత క్రికెట్ చీఫ్ సెలక్టర్ పదవి చేపట్టే వ్యక్తుల అర్హతలపై చర్చ నడుస్తోంది. చీఫ్ సెలక్టర్ స్థాయి వ్యక్తులు పదవిలో ఉండటం లేదని క్రికెట్ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. అందుకు బీసీసీఐ చెల్లిస్తున్న వేతనమే కారణమని వ్యాఖ్యానిస్తున్నారు. బీసీసీఐ సెలక్టర్లకు రూ.90 లక్షల వేతనం దక్కుతుండగా, చీఫ్ సెలక్టర్ రూ.1 కోటి అందిస్తున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష అనుభవం కలిగిన మాజీ క్రికెటర్లకు ఐపీఎల్ వ్యాఖ్యాతలుగా మూడు నెలల్లోనే ఇంతకంటే ఎక్కువ ఆదాయం దక్కుతోంది. ద్వైపాక్షిక సిరీస్‌ల్లో సైతం వ్యాఖ్యాతలుగా ఆకర్షణీయ మొత్తం ఆర్జిస్తున్నారు. బీసీసీఐ చీఫ్ సెలక్టర్‌కు అందిస్తున్న వేతనంలో మార్పు చేయకుంటే.. చరిష్మా కలిగిన మాజీ క్రికెటర్లు ఎవరూ ఆ పదవిపై ఆసక్తి చూపరని గతంలో హర్భజన్ సింగ్ వ్యాఖ్యానించారు. విరుద్ధ ప్రయోజనాల నిబంధన సైతం కొందరి విషయంలో అడ్డుగా కనిపిస్తుందనే వాదన వినిపిస్తోంది.

నం.1 సమరం!

- అగ్రస్థానంపై రాయల్స్, జెయింట్స్ గురి
- నేడు రాజస్థాన్ రాయల్స్‌తో లక్నో ఢీ

నవతెలంగాణ-జైపూర్

రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్‌జెయింట్స్.. ఐపీఎల్16లో ఐదు మ్యాచుల్లో నాలుగు విజయాలు సాధించిన అగ్ర జట్లు. ఇటు రాయల్స్, అటు జెయింట్స్ నాలుగేసి విజయాలు సాధించినా.. రెండు జట్ల శైలి పూర్తి భిన్నం. విరుద్ధ మ్యాచ్ ప్రణాళికలతో విజయవంతంగా విజయాలు నమోదు చేస్తున్న రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్‌జెయింట్స్ నేడు అగ్రస్థానం కోసం పోటీపడుతున్నాయి. నెట్ రన్‌రేట్‌తో ప్రస్తుతం రాయల్స్ నం.1గా కొనసాగుతున్నప్పటికీ.. నేటి మ్యాచ్ ఫలితం పాయింట్ల పట్టికలో స్పష్టమైన నం.1ను నిర్ణయించనుంది. జైపూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్‌జెయింట్స్ నేడు ముఖాముఖి తలపడనున్నాయి.

పైచేయి ఎవరిదో? : ఐపీఎల్15 రన్నరప్ రాజస్థాన్ రాయల్స్ ఈ సీజన్లోనూ అదరగొట్టే ప్రదర్శనలు చేస్తుంది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు, స్పిన్నర్లు ఆ జట్టు విజయాల్లో కీలక భూమిక వహిస్తున్నారు. రాజస్థాన్ రాయల్స్ టాప్-4 బ్యాటర్ల స్ట్రయిక్‌రేట్ దాదాపు 150గా ఉంది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్, జోశ్ బట్లర్ ధనాధన్ ఆరంభాలు ఇవ్వటంలో నిలకడ చూపిస్తున్నారు. కెప్టెన్ సంజు శాంసన్, రియాన్ పరాగ్‌లు మంచి ఫామ్‌లో ఉన్నారు. షిమ్రోన్ హెట్‌మయర్ సంచలన ఇన్నింగ్స్ జోరుమీదున్నాడు.



గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో ఆశలు ఆవిరైన వేళ హెట్‌మయర్ అసమాన బాదుడు రాయల్స్‌ను విజేతగా నిలిపింది. ఈ ఉత్సాహంలో ఉన్న రాజస్థాన్ రాయల్స్‌ను నిలువరించటం లక్నోకు కష్టసాధ్యమైన సవాలే. స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్, ఆడం జంపా, యుజ్వేంద్ర చాహల్‌ల 12 ఓవర్లను ఎదుర్కోవటం లక్నోకు అతి పెద్ద సవాల్. చెన్నై సూపర్‌కింగ్స్‌పై చివరి ఓవర్లో ఒత్తిడిని అధిగించిన సందీప్ శర్మ ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నాడు. ట్రెంట్ బౌల్ట్‌తో కలిసి సందీప్ శర్మ మరోసారి కొత్త బంతిని పంచుకునేందుకు సిద్ధమవుతున్నాడు.

ఇక లక్నో సూపర్‌జెయింట్స్ కథ కాస్త భిన్నం. క్వింటన్ డికాక్ రూపంలో ధనాధన్ హిట్టర్ డగౌట్‌లో కూర్చోవాల్సిన పరిస్థితి. డికాక్ లేని వేళ కెఎల్ రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన కైల్ మేయర్స్ ఆ జట్టుకు మెరుపు ఆరంభాలన్ని అందించాడు. వాస్తవానికి లక్నో సూపర్‌జెయింట్స్ విజయాల్లో కైల్ మేయర్స్‌దే కీలక పాత్ర. అయితే, లక్నో సూపర్‌జెయింట్స్ టాప్ ఆర్డర్ స్ట్రయిక్‌రేట్ ఆ జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. జెయింట్స్ టాప్-4 బ్యాటర్ల స్ట్రయిక్‌రేట్ 130 దాటడం లేదు. కెఎల్ రాహుల్ దూకుడుగా ఆడటం లేదు. దీపక్ హుడా, కృనాల్ పాండ్యలు ఇంకా పూర్తి ఫామ్‌లోకి రావాల్సి ఉంది. నికోలస్ పూరన్ ఇన్నింగ్స్‌ను ముగించే నైపుణ్యం లక్నోకు అతిపెద్ద బలం. ఛేదనల్లో, లక్ష్యాన్ని నిర్దేశించటంలో పూరన్ ఇన్నింగ్స్‌కు కీలకంగా మారుతుంది. మార్కస్ స్టోయినిస్, ఆయుశ్ బదాని, కృష్ణప్ప గౌతమ్‌లు కీలకం కానున్నారు. రవి బిష్ణోయ్ స్పిన్, మార్క్‌వుడ్ పేస్ లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఎక్స్ ఫ్యాక్టర్ కాగలదు.



వెటరన్ క్రికెటర్ అజీమ్ కన్నుమూత

- అనారోగ్యంతో రంజీ స్టార్ తుది శ్వాస

నవతెలంగాణ, హైదరాబాద్ : వెటరన్ రంజీ క్రికెటర్, హైదరాబాద్ క్రికెట్ దిగ్గజాల్లో ఒకరైన అబ్దుల్ అజీమ్ మంగళవారం తుది శ్వాస విడిచారు. 1980-1995 మధ్య కాలంలో దేశవాళీ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అబ్దుల్ అజీమ్ తనదైన ముద్ర వేశారు. ఓపెనర్‌గా ధనాధన్ శైలికి ఆటను పరిచయం చేసిన అబ్దుల్ అజీమ్ రంజీ ట్రోఫీలో సౌత్ జోన్ నుంచి ట్రిపుల్ సెంచరీ సాధించిన తొలి క్రికెటర్‌గా, ఓవరాల్‌గా ఆరో ఆటగాడిగా రికార్డు సృష్టించారు. 62 ఏండ్ల అబ్దుల్ అజీమ్ ఇటీవల కిడ్నీ సంబంధిత సమస్యలకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. 2021 నుంచి కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న అబ్దుల్ అజీమ్‌కు ఫిబ్రవరిలోనే కిడ్నీ శస్త్రచికిత్స విజయవంతమైంది. 73 ఫస్ట్ క్లాస్ మ్యాచుల్లో 4644 పరుగులు చేసిన అబ్దుల్ అజీమ్.. 43.40 సగటుతో 12 సెంచరీలు, 18 అర్ధ సెంచరీలు సాధించారు.

నవచిత్రం



పవన్ కళ్యాణ్

ఓజీ సెట్‌లోకి ఎంట్రీ..

'ఓజీ' (ఒరిజినల గ్యాంగ్‌స్టర్) చిత్ర బృందం మంగళవారం అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చి అటు ప్రేక్షకులను, ఇటు పవన్‌కళ్యాణ్ అభిమానులను సర్‌ప్రైజ్ చేసింది. ముంబైలో జరుగుతున్న ఈ చిత్ర షూటింగ్‌లో పవన్‌కళ్యాణ్ పాల్గొంటున్న ఫొటోలను షేర్ చేయడంతో పవన్ అభిమానులు ఫుల్ ఖుషీలో ఉన్నారు. పవన్ కళ్యాణ్, యువ దర్శకుడు సుజీత్ కాంబినేషన్‌లో ఒక భారీ యాక్షన్ డ్రామాను డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న విషయం తెలిసిందే. జనవరి 30న ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ప్రకటన వచ్చినప్పటి నుంచే పవన్ కళ్యాణ్ అభిమానులలో, సినీ ప్రియుల్లో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమా షూటింగ్‌లో పవన్ కళ్యాణ్ ఎప్పుడెప్పుడు పాల్గొంటారా అని అభిమానులు, ప్రేక్షకులంతా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. అలాంటి తరుణం రానే వచ్చింది. 'ఓజీ' సెట్స్‌లో పవన్ కళ్యాణ్ అడుగుపెట్టారు. ఈనెల 15 నుంచి ముంబైలో తొలి షెడ్యూల్ ప్రారంభమైంది. ముంబై, పరిసర ప్రాంతాల్లో నెలాఖరు వరకు చిత్రీకరణ జరగనుంది. ఈ షెడ్యూల్‌లో కొన్ని కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్‌పార్ట్‌ని కూడా చిత్రీకరించనున్నారు. కళ్యాణ్ బలానికి, స్టార్‌డమ్‌కి సరిగ్గా సరిపోయే కథ అని నిర్మాత తెలిపారు.

సైఫే.. విలన్



కొరటాలశివ, సైఫ్ ఆలీఖాన్, ఎన్టీఆర్

ఎన్టీఆర్ నటిస్తున్న తన 30వ చిత్రంలో ప్రతినాయకుడిగా బాలీవుడ్ నటుడు సైఫ్ ఆలీఖాన్ నటిస్తారనే వార్తలు గత కొంత కాలంగా వినిపిస్తూనే ఉన్నాయి. అలాగే ఈ ప్రతినాయకుడి ఆఫర్‌ని సైఫ్ తిరస్కరించారనే పుకార్లు సైతం సోషల్ మీడియాలో షికార్లు చేశాయి. అయితే వీటన్నింటికి ఎన్టీఆర్ 30 చిత్ర బృందం చెక్ పెడుతూ మంగళవారం ఓ బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. ఈ సినిమాలో సైఫ్ ఆలీఖాన్ నటిస్తున్నారని చెబుతూనే చిత్ర బృందంతో ఆయన దిగిన ఫొటోలను షేర్ చేశారు. ఎన్టీఆర్ కథానాయకుడిగా, కొరటాల శివ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కొసరాజు హరికృష్ణ, సుధాకర్ మిక్కిలినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. రామోజీఫిల్మ్ సిటీలో జరుపుతున్న షెడ్యూల్‌లో ఇప్పటికే నాయిక జాన్వీకపూర్ జాయిన్ అయ్యింది. అలాగే లేటెస్ట్‌గా సైఫ్ కూడా చిత్రీకరణలో పాల్గొనబోతున్నారు. 'ఈ కథలో మనుషుల కన్నా ఎక్కువ మృగాలు ఉంటారు. భయమంటే ఏంటో తెలియని మృగాలుంటారు. దేవుడంటే భయం లేదు. చావంటే భయం లేదు. కానీ, ఒకే ఒకటంటే భయం వారికి. ఆ భయమేంటో మీ అందరికీ తెలిసే ఉంటుంది. భయం ఉండాలి. భయం అవసరం. భయపెట్టడానికి ఈ సినిమాలో నా ప్రధాన పాత్ర ఏ రేంజ్‌కి వెళ్తుందనేది ఎమోషనల్ రైడ్' అని దర్శకుడు కొరటాల శివ ఈ చిత్ర కథ గురించి తెలిపారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వచ్చే ఏడాది ఏప్రిల్ 5న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.

మొగిలయ్యకు చిరంజీవి సాయం



మొగిలయ్య

ఇటీవల 'బలగం' సినిమాలో భావోద్వేగ భరిత పాటను ఆలపించి ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న జానపద కళాకారుడు మొగిలయ్యకు అండగా చిరంజీవి నిలిచారు. మొగిలయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అలాగే ఆయన చూపు కూడా మందగించింది. ఈ విషయం తెలుసుకున్న చిరంజీవి ఆయన కంటి శస్త్రచికిత్సకు సంబంధించి అయ్యే మొత్తం ఖర్చును తానే భరిస్తానని చెప్పినట్టు ఓ యూ ట్యూబ్ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మొగిలయ్య దంపతులు తెలిపారు. 'మొగిలయ్యకు కంటి సమస్య ఉంది కదా. సంబంధిత చికిత్సకు ఎంత ఖర్చు అయినా నేను భరిస్తా' అని చెబితే, ఆ విషయాన్ని మాకు 'బలగం' దర్శకుడు వేణు ఫోన్ చేసి చెప్పాడని వివరిస్తూ వారు చిరంజీవికి కృతజ్ఞతలు తెలిపారు. మొగిలయ్యకి రెండు కిడ్నీలు పాడవ్వడంతో తీవ్ర అనారోగ్య సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున కూడా ఆయనకు మెరుగైన వైద్యం అందజేస్తున్నారు.

తగ్గేదేలే.. అనేలా



సంయుక్తా మీనన్

'బింబిసార', 'సార్' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైన కథానాయిక సంయుక్తా మీనన్. తాజాగా ఆమె నటించిన మరో చిత్రం 'విరూపాక్ష'. సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా నూతన దర్శకుడు కార్తీక్ దండు దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బాపినీడు బి.సమర్పణలో ప్రముఖ నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు. సుకుమార్ స్క్రీన్ ప్లే అందించిన ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈనెల 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాయిక సంయుక్తా మీనన్ మీడియాతో ముచ్చటించారు.'రుద్రవనం అనే గ్రామంలో జరిగే కథ. ఇందులో నేను నందిని అనే అమ్మాయి పాత్ర చేశా. పాత్ర పరంగా నేను చాలా ముక్కుసూటిగా, చాలా యారగెంట్‌గా ఉంటాను. నా పాత్ర బిహేవ్ చేసే విధానంగా కచ్చితంగా అందరికీ నచ్చుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే తగ్గేదేలే.. అన్నట్టుగా హీరోతో నా పాత్ర ఉంటుంది (నవ్వుతూ). ఇది హర్రర్ థ్రిల్లరే అయినా పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటాయి. తేజ్‌కి ఈ సినిమా పెద్ద హిట్ కావాలి.

కుటుంబం ముఖ్యమని చెప్పే సినిమా



ఖుష్బూ

'లక్ష్యం', 'లౌక్యం' వంటి సూపర్ హిట్ సినిమాల తరువాత గోపీచంద్, డైరెక్టర్ శ్రీవాస్ కలయికలో వస్తున్న హ్యాట్రిక్ ఫిల్మ్ 'రామబాణం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో గోపీచంద్ సరసన నాయికగా డింపుల్ హయతి నటిస్తుండగా, జగపతి బాబు, ఖుష్బూ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మే 5న ఈ చిత్రం భారీస్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం నటి ఖుష్బూ మీడియాతో మాట్లాడుతూ, 'ఈ సినిమా ప్రధానంగా కుటుంబ బంధాల గురించి ఉంటుంది. మనం ఎంత డబ్బు సంపాదించినా, ఉన్నత స్థాయికి చేరినా, కుటుంబ బంధం అనేది చాలా ముఖ్యం. అలాంటి కథతో ఈ చిత్రం రూపొందింది. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా కుటుంబమంతా కలిసి ఉండాలని, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని ఈ సినిమా చెబుతుంది. అందుకే ఈ సినిమా నాకు అంత దగ్గరైంది. ఇందులో నా పాత్ర మనం మరిచిపోతున్న సంప్రదాయాలు, ఆహార వ్యవహారాలను గుర్తు చేసేలా ఉంటుంది. సంప్రదాయ ఆహారం విలువని తెలిపేలా నా పాత్ర ఉంటుంది. నా పాత్ర పేరు భువనేశ్వరి. గోపీచంద్‌తో కలిసి మొదటిసారి నటించాను. ఇక జగపతిబాబు నటుడు కాకముందు నుంచే నాకు తెలుసు. బాల నటిగా వారి జగపతి ఆర్ట్స్‌లో రెండు సినిమాలు చేశాను. నేను చౌ మామ అని పిలుస్తాను. ప్రస్తుత కాలంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లాంటి గొప్ప నిర్మాణ సంస్థను చూడటం చాలా కష్టం. నేను శ్రీవాస్‌తో మొదటిసారి పని చేస్తున్నట్లు అనిపించలేదు. టీవీ షోలు చేయడం చాలా హ్యాపీగా ఉంది. ఎందుకంటే సినిమాలో దర్శకుడు రూపొందించిన పాత్రకి తగ్గట్లుగా నటించాల్సి ఉంటుంది. కానీ టీవీ షోలు అలా కాదు. నేను నాలాగా ఉండొచ్చు. తెలుగులో ఇప్పటిదాకా బాలకృష్ణతో సినిమా చేయలేదు. ఆయనతో చేయాలని ఉంది. అలాగే బిగ్‌బి అమితాబ్‌తో జోడీగా నటించలేదనే బాధ ఉంది. నేను ఆయనకి పెద్ద ఫ్యాన్‌ని. నా బెడ్‌రూమ్‌లో ఆయన ఫొటోలు ఉంటాయి' అని చెప్పారు.

ఒకే పాత్రతో గంటన్నర వినోదం



శ్రీనివాస్ కాకర్ల

భారీ భారీ డైలాగులు, అట్రాక్ట్ చేసే డ్యూయెట్స్, ఔరా అనిపించే ఫైట్ సీన్స్.. సినిమా అనగానే ఇవేకదా మనకు గుర్తొచ్చేవి. అయితే అందుకు పూర్తి భిన్నంగా కేవలం సింగిల్ క్యారెక్టర్‌తో సినిమా తీయడమంటే అది గొప్ప సాహసమే అని చెప్పాలి. ఆ సాహసాన్ని చేసి చూపించారు డైరెక్టర్ కాకర్ల శ్రీనివాస్. కేవలం ఒకే ఒక్క క్యారెక్టర్‌తో 'హలోమీరా' చిత్రంతో ఆయన ప్రేక్షకులను అలరించడానికి రెడీ అయ్యారు. వైవిధ్య భరితమైన కథలో ఊహించని ట్విస్టులతో ప్రేక్షకులను థ్రిల్ చేయబోతున్నారు. తెరపై కేవలం ఒక అమ్మాయిని మాత్రమే చూపిస్తూ ప్రేక్షకుడి బుర్రలో బోలెడు రోల్స్ మెదిలేలా ఈ సినిమాను తెరకెక్కించడం విశేషం. తెరపై కనిపించేది మీరానే అయినా వినిపించే పాత్రలన్నీ ప్రేక్షకుడి మదిలో మెదిలేలా రూపొందించారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్స్, వీడియోస్ రిలీజ్ చేసి తన సినిమాలోని వైవిధ్యాన్ని, ప్రయోగాత్మక విషయాలను ప్రేక్షకులకు పరిచయం చేసిన డైరెక్టర్ కాకర్ల శ్రీనివాస్.. ఈనెల 21న ఈ మూవీని రిలీజ్ చేస్తున్నారు. అయితే ఇప్పటికే ఈ సినిమా ఫైనల్ కాపీ చూసిన పలువురు సినీ ప్రముఖులు కాకర్ల శ్రీనివాస్ ప్రతిభను మెచ్చుకుని, విజయం ఖాయమని ఆకాంక్షించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot No. 8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Published At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot.8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2015/60815

అరకొర వేతనం.. సమస్యలతో సతమతం..!

20ఏండ్లుగా సేవలందిస్తున్నా పెరగని జీతం

- పెరిగిన పని ఒత్తిడి.. భారంగా కుటుంబ పోషణ
- సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రామాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధికి, స్వయం సహాయక సంఘాల అభ్యున్నతికి దోహదం చేస్తున్న ఐకేపీ వీఓఏల పరిస్థితి దయనీయంగా మారింది. ఆయా సంఘాలకు రుణాలు ఇప్పించడం, తిరిగి వాటిని రికవరీ చేయడం, పింఛన్లు అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను లబ్దిదారులకు చేర్చడంలో వీరిదే కీలకపాత్ర. ఆయా సంఘాల ఆర్థిక లావాదేవీలతో పాటు ప్రభుత్వ పథకాల లబ్దిదారుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. వీరికి ఈ పని తప్పితే మరో పని చేయడం వీలుకాని పరిస్థితి. ఎప్పటికైనా సెర్ప్ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తిస్తుందనే నమ్మకంతో పనిచేస్తున్నారు. నెలకు ప్రభుత్వం నుంచి వచ్చే రూ.3900తోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటడంతో వచ్చే జీతంతో కనీసం సరుకులు కూడా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు.

గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ స్వయం సహాయక సేవకులు ప్రభుత్వం అందించే అరకొర వేతనంతో జీవనం సాగిస్తూ ఆర్థిక భారాన్ని మోస్తున్నారు. వచ్చే వేతనంతో కుటుంబ పోషణ భారంగా మారడంతో మనోవేదనకు గురవుతున్నారు. 20 ఏండ్లుగా గ్రామాల్లో సేవలందిస్తున్నా ప్రభుత్వం తమను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు కేవలం రూ.3900 చెల్లించడంతో ఈ వేతనం ఎటూ సరిపోవడం లేదని చెబుతున్నారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెబాటపట్టారు. ప్రభుత్వం స్పందించే వరకు కొనసాగిస్తామని ఆ సంఘం నాయకులు స్పష్టం చేస్తున్నారు.

ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి :

అనేక ఏండ్లుగా అరకొర వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్న ఐకేపీ వీఓఏ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు రూ.26వేల వేతనం అందించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వం వీరి సమస్యలు పరిష్కరించే వరకు వారికి అండగా ఉండి పోరాడుతాం.

– అన్నమొల్ల కిరణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

కుటుంబ పోషణ భారంగా మారుతోంది



తమకు ప్రభుత్వం కేవలం రూ.3900 వేతనంగా అందజేస్తోంది. ఈ జీతంలో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ఇందులో పని ఒత్తిడి కారణంగా ఇతర పనులు కూడా చేయలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం స్పందించి సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి రూ.26వేల వేతనం అందించాలి. సమస్య పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తాం.

– కె.రాజేష్, ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షులు.

విధులు బహిష్కరించి సమ్మెబాట

దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఐకేపీ వీఓఏలు సోమవారం నుంచి సమ్మెబాట పట్టారు. ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 500మంది వీఓఏలు పనిచేయగా ఉమ్మడి జిల్లాలో 2వేలకు పైగా విధులు నిర్వర్తిస్తున్నారు. విధులు బహిష్కరించి మండలాల్లో నిరసన చేపట్టారు. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి రూ.10లక్షల సాధారణ, ఆరోగ్య బీమా కల్పించాలని, గుర్తింపు కార్డులు అందజేయాలని చెబుతున్నారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెలా వీఓఏ ఖాతాల్లో చెల్లించాలని, జాబ్‌చార్ట్‌తో సంబంధం లేని ఆన్‌లైన్, ఇతర పనులను చేయించకూడదని స్పష్టం చేస్తున్నారు.అర్హులైన వీఓఏలకు పదోన్నతులు కల్పించాలని తెలిపారు.

నీటి పారుదల శాఖ భూముల్లో మొక్కలు నాటాలి

- హరితహారం కార్యాచరణను రూపొందించాలి : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

నవతెలంగాణ-హైదరాబాద్

నీటి పారుదల శాఖ భూముల్లో మొక్కలు నాటాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఈమేరకు హరితహారం కార్యాచరణను రూపొందించాలని సూచించారు. హరిత హారం సన్నాహాలు, ఏర్పాట్లపై సంబంధిత శాఖలు, ఉన్నతాధికారులతో బీఆర్‌కే భవన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. ముఖ్యమంత్రి సూచన మేరకు నీటి పారుదల శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న అన్ని ప్రాంతాల్లో భారీగా మొక్కలు నాటాలని సూచించారు. చక్కటి పచ్చదనం పెంపుతో పాటు, సమీప గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన ఆక్సీజన్ ఫలసాయం అందేలా సంపద వనాలను సష్టించాలని సాగునీరు, పంచాయితీ రాజ్, అటవీశాఖ అధికారులను కోరారు. మూడు శాఖల క్షేత్రస్థాయి అధికారులతో జిల్లాల వారీగా ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి, స్థల పరిశీలన, స్థానికంగా అనుకూలతలు కలిగిన చెట్ల జాతులను గుర్తించాలనీ, మొక్కలు నాటిన తర్వాత వాటి రక్షణ చర్యలపై కూడా ముందస్తు ప్రణాళిక ఉండాలని సూచించారు.

ఇరిగేషన్ ప్రాజెక్టుల దగ్గర, కాలువల వెంట ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించటంతో పాటు, రక్షణ చర్యలు చేపట్టి, అన్ని కాలువల వెంట ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న చోట బ్లాక్ ప్లాంటేషన్ చేపట్టాలని సమీప గ్రామాల ప్రజలు, రైతుల సహకారం కూడా తీసుకోవాలని తెలిపారు. ఒక సారి పెట్టిన మొక్కలు, మంచి ఎదుగుదలతో పెరిగేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని అన్నారు. అటవీ భూముల్లో చేపట్టిన హరితవనాల్లో మొక్కలు నాటే కార్యక్రమం పురోగతిని కూడా సమీక్షించారు. రానున్న సీజన్‌లో అన్ని హరితవనాల్లో టార్గెట్లు పూర్తి కావాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో పీసీసీఎఫ్, హెచ్‌ఓఓఎఫ్ ఆర్.ఎం. డోబ్రియాల్, పంచాయితీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ ఎం. హన్మంత రావు, స్పెషల్ కమీషనర్ వీ.ఎస్.ఎన్.వీ ప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఐటీయూను భారీ మెజార్టీతో గెలిపించాలి

- మహీంద్రా కంపెనీ గేట్ మీటింగ్‌లో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



నవతెలంగాణ-జహీరాబాద్

మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమ చరిత్రను తిరగరాసి.. రిక్రూట్‌మెంట్ పాలసీని తీసుకువచ్చి.. 400కు పైచిలుకు జూనియర్ కార్మికులను పర్మినెంట్ చేయించిన ఘనత సీఐటీయూకే దక్కుతుందని, కాబట్టి వచ్చే ఎన్నికల్లో కూడా సీఐటీయూనే భారీ మెజార్టీతో గెలిపించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పిలుపునిచ్చారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని స్థానిక పరిశ్రమ ఎదుట నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న సంఘం సీఐటీయూ అని, మహీంద్రాలో మరోసారి సీఐటీయూను గెలవడం ద్వారా మరిన్ని సౌకర్యాలు సాధించి పెడతామని హామీ ఇచ్చారు. ఇంతకుముందు పరిశ్రమలో సీఐటీయూను గెలిపించగా.. మంచి వేతన ఒప్పందంతో పాటు 450 మంది కార్మికులను పర్మినెంట్ చేయించామన్నారు. ఇన్సూరెన్స్ సౌకర్యం, బస్సు సౌకర్యాన్ని కూడా కల్పించామని తెలిపారు. కంపెనీ యజమాన్యం త్వరలో ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేయబోతుందని, అందుకు రూ.1000 కోట్ల నూతన ప్రాజెక్టు కూడా రానుందన్నారు. దాంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందని చెప్పారు.

అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం మాట్లాడుతూ.. పరిశ్రమలో 39 ఏండ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులకు ఎంత జీతం వస్తుందో గతంలో ఉన్న యూనియన్లు ఏడు అగ్రిమెంట్లలో ఎంత సాధించారో కార్మికులు ఒకసారి బేరీజు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2011లో కార్మికులు సీఐటీయూని గెలిపించడంతో నాటి నుంచి నేటి వరకు చేసిన అగ్రిమెంట్లలో ఒక్కో కార్మికునికి రూ.39,500 జీతం పెంచుకోగలిగామని తెలిపారు. జిల్లా కార్యదర్శి జి. సాయిలు మాట్లాడుతూ.. కార్మిక హక్కులను కాలరాసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు కార్మికులందరూ ఐక్యంగా సంసిద్ధం కావాలన్నారు. కంపెనీ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం మాట్లాడాల్సింది.. కొట్లాడాల్సింది, కార్మికుల చట్టాల పట్ల అవగాహన కలిగిన నాయకులు మాత్రమేనని అన్నారు. ఎన్నికల ముందు వచ్చి ఏమి చేస్తామో కార్మికులకు తెలపకుండా కేవలం ఒక్క అవకాశం ఇవ్వండి అని ఇతర యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమన్నారు. మీటింగ్‌లో పరిశ్రమలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు సాజీద్, కోటిరెడ్డి, నరేష్, ఉమా మహేశ్వరరావులతోపాటు పలువురు కార్మికులు మాట్లాడి తమ అనుభవాలను తెలిపారు. సమావేశంలో మహేంద్ర ట్రాక్టర్స్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి వంశీ, పిరమిల్ పరిశ్రమ కార్యదర్శి నరసయ్య, రాకుల్ పరిశ్రమ కార్యదర్శి నారాయణ, ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ కార్యదర్శి నర్సింలు, సీఐటీయూ నాయకులు మహిపాల్, కనకా రెడ్డి, డీపీసీ శేఖర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్లకు బీమా

- సీఎం కేసీఆర్‌ను సంప్రదించి నిర్ణయం తీసుకుంటాం
- జిల్లా కేంద్రాలలో కార్యాలయ భవనాలు : మంత్రి జగదీశ్



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఫొటోగ్రాఫర్లకు బీమా వర్తింపజేసేందుకు ప్రయత్నిస్తామనీ, సీఎం కేసీఆర్‌ను సంప్రదించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి జగదీశ్‌రెడ్డి హామీ నిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని హైటెక్స్ శిల్పా కళావేదికలో తెలంగాణ ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ప్లీనరీ సమావేశాలు జరిగాయి.

ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ఫొటో గ్రాఫర్ల సంక్షేమ సంఘం కోరిన డిమాండ్లు సహేతుకమైనవే అయినప్పటికీ నిబంధనలనుసరించి ప్రాధాన్యాతా క్రమంలో తీర్చే ప్రయత్నం చేస్తామని హామీనిచ్చారు. సంక్షేమ సంఘానికి జిల్లా కేంద్రాల్లో కార్యాలయాలుండాలనే విజ్ఞప్తిపై ఆయన స్పందిస్తూ ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే ఇది అమలు పెడతామన్నారు. ఎలక్ట్రానిక్ రంగంలో వచ్చిన మార్పులు లాభంతో పాటు నష్టాన్ని కలిగిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందులో సెల్‌ఫోన్ రూపంలో మొదలు నష్ట పోయింది ఫొటోగ్రాఫర్లేనన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు యస్.వెంకట్ రెడ్డి, యస్‌కే హుస్సేన్, రాపర్తి శ్రీనివాస్ గౌడ్, మునగాల శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 58 ప్రకారం గుడిసెవాసులందరికీ వ్యక్తిగత పట్టాలివ్వాలి

- తహసీల్దార్ ఆఫీసు ఎదుట పేదలతో సీపీఐ(ఎం) ధర్నా
- పట్టాలు ఇచ్చేంతవరకూ పోరాటం ఆగదు : సీపీఐ(ఎం) హనుమకొండ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

జీవో 58 ప్రకారం గుడిసెవాసులందరికీ వ్యక్తిగత పట్టాలివ్వాలని హనుమకొండ తహసీల్దార్ ఆఫీసు ఎదుట వందలాది మంది పేదలతో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఆ పార్టీ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి పాల్గొని మాట్లాడారు. పట్టాలు ఇచ్చేంతవరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. నిలువ నీడలేని పేదలు ఏడాదికాలంగా పెగడపల్లి రింగ్ రోడ్డు వద్ద పలివెల్పుల శివారు కోమటికుంట సర్వే నంబర్ 288లోని 18 ఎకరాల ప్రభుత్వ భూమిలో 60 గజాల స్థలంలో గుడిసెలు వేసుకొని కనీస సౌకర్యాలు లేకపోయినా అక్కడే జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు.

వీరందరికీ ప్రభుత్వం జీవో నెంబర్ 58 ప్రకారం వ్యక్తిగత పట్టాలు ఇచ్చి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి ఇండ్లు లేని పేదలందరికీ ఇంటి స్థలం కొని డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పిన హామీని నిలుపుకోవాలని కోరారు. అలాగే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 75వ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి దేశంలో ఇల్లు లేని పేదలంటూ ఉండరని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి హామీలను నేటికీ అమలు చేయకపోవడంతో అద్దె ఇండ్లలో ఉండే పేదలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

హనుమకొండ మహానగరంలో ప్రభుత్వ భూములను కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారని, ప్రభుత్వ భూములను రక్షించడం కోసమే ఇండ్లు లేని పేదలను సమీకరించి సీపీఐ(ఎం) గతేడాది నుంచి భూ పోరాటాలు నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. గుడిసెవాసుల కనీస సౌకర్యాలైన కరెంటు, నీరు, మరుగుదొడ్లు, రోడ్లు లేకపోయినా అనేక ఇబ్బందులు పడుతూ అక్కడే నివాసం ఉంటున్నారని తెలిపారు.

గుడిసెవాసుల కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 58 జీవో ప్రకారం గుడిసె వాసులంతా అర్హులని వీరికి వ్యక్తిగత పట్టాలు ఇచ్చి డబుల్ బెడ్‌రూమ్ ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. లేనియెడల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గుమ్మడి రాజుల రాములు, మండల కమిటీ సభ్యులు పెండ్యాల రవి, నాయకులు సంపత్, ప్రభాకర్, రాజన్న, భాస్కర్, రవికుమార్, ఆనందం, ఎల్లన్న, అనిల్, చంద్రమౌళి, ప్రతాప్, లక్ష్మి, సరిత, లత, అనూష, వినోద, రాధా తదితరులు పాల్గొన్నారు.

రూ.5 వేలు లంచం తీసుకుంటూ..

- ఏసీబీకి చిక్కిన సైట్ ఇంజనీర్
- వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ఘటన



నవతెలంగాణ-వికారాబాద్ ప్రతినిధి

వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న సైట్ ఇంజనీర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఏసీబీ డీఎస్పీ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కలెక్టరేట్ పంచాయతీరాజ్ విభాగంలో ఇర్ఫాన్ ఔట్ సోర్సింగ్ పద్ధతిలో సైట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నవాబుపేట మండలం మదారం ప్రాథమిక పాఠశాలలో 'మన ఊరు–మన బడి' పనులకు సంబంధించి ప్రభు అనే వ్యక్తి కాంట్రాక్టుకు తీసుకున్నాడు. కాగా, ఈ పనులకు ఎస్టిమేషన్ కోసం కాంట్రాక్టర్ ప్రభును ఇర్ఫాన్ రూ. లక్ష లంచం డిమాండ్ చేశాడు. ప్రభు ఇప్పటి వరకు రూ.51 వేలు ఇవ్వగా, మరో రూ.50వేలు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ప్రభు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం ఇర్ఫాన్‌కు రూ.5 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఇర్ఫాన్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కేసును విచారిస్తున్నట్టు ఏసీబీ డీఎస్పీ సత్యానారాయణ తెలిపారు.

ఆపరేషన్ సమయంలో.. గర్భిణి కడుపులో గుడ్డను వదిలిన వైద్యులు

- 18నెలలుగా తీవ్ర కడుపునొప్పితో మహిళ వేదన
- ఆపరేషన్ చేసి తొలగించిన జగిత్యాల డాక్టర్లు



నవతెలంగాణ - జగిత్యాల టౌన్

జగిత్యాల ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యానికి అద్దం పట్టే ఘటన మరొకటి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 18 నెలల కిందట డెలివరీ కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన మహిళకు సిజేరియన్ చేసిన వైద్యులు.. పొట్టలోనే కాటన్ గుడ్డ ఉంచి కుట్లు వేశారు. దాంతో ఏడాదిన్నరగా సదరు మహిళ నరకయాతనను అనుభవించింది. వివరాల్లోకి వెళితే.. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన బాలింత నవ్యశ్రీ డెలివరీ కోసం జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలకొండలోని పుట్టింటికి రాగా, డెలివరీ కోసం జగిత్యాల ఏరియా ఆస్పత్రిలో 29 డిసెంబర్ 2021న నవ్యశ్రీ అడ్మిట్ అయింది. ఈ క్రమంలో నవ్యశ్రీకి సర్జరీ చేసిన వైద్యులు ఆపరేషన్ తర్వాత కాటన్ గుడ్డను పొట్ట లోపలే మరిచిపోయి కుట్లు వేశారు. అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన నవ్యశ్రీ నెల రోజుల నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నట్టు తెలిపింది. రోజులు గడుస్తున్నా కొద్దీ బాధ ఎక్కువ కావడంతో భరించలేని స్థితిలో వేములవాడలోని ప్రయివేట్ ఆస్పత్రిలో స్కానింగ్ చేయించగా పొట్టలో కాటన్ గుడ్డ ఉన్నట్టుగా వైద్యులు గుర్తించారు. వెంటనే సర్జరీ చేసి కాటన్ గుడ్డను తొలగించారు. ఈ విషయంపై జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషాకు బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా.. ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని, పూర్తిస్థాయిలో ఎంక్వయిరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎంపీ అవినాష్‌రెడ్డిని అరెస్టు చేయొద్దు : హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

ఈ నెల 25 వరకు కడప ఎంపీ అవినాష్‌రెడ్డిని అరెస్టు చేయొద్దని సీబీఐకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జస్టిస్ సురేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్ వివేకా హత్య కేసులో సాక్షిగా ఉన్న అవినాష్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం విచారణ జరిపి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఐ విచారణకు అవినాష్ సంపూర్ణంగా సహకరించాలని ఆదేశించింది. సీబీఐ దర్యాప్తును ఆడియో, వీడియో చిత్రీకరణ చేయాలంది. తన తండ్రి భాస్కర్‌రెడ్డిని కూడా సీబీఐ అరెస్టు చేసిందనీ, తనను కూడా సాక్షిగా విచారణకు పిలిచే సీబీఐ అరెస్టు చేసే అవకాశం ఉందని పిటిషనర్ లాయర్ వాదించారు. విచారణ తర్వాత తమ వద్ద ఉన్న ఆధారాల తర్వాతే భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేశామనీ, అదే విధమైన ఆధారాలుంటే అవినాష్‌రెడ్డిని కూడా అరెస్టు చేసే అవకాశాలు లేకపోలేదని సీబీఐ వాదించింది. వివేకాకు వివాహేతర సంబంధం ఉన్నందునే హత్యకు గురయ్యాంనేందుకు కారణాలు లేవని చెప్పింది. వివేకా హత్యకు గురైతే గుండెపోటు వల్ల చనిపోయారని అవినాష్ ఎందుకు చెప్పారో తేల్చాలని వివేకా కుమార్తె సునీత లాయర్ వాదించారు. వాదనల తర్వాత హైకోర్టు అవినాష్‌ను ఈ నెల 25 వరకు అరెస్టు చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

ఎమ్మెల్యే కాన్వాయ్‌పై మావోయిస్టుల మెరుపు దాడి

- తృటిలో తప్పించుకున్న బీజాపూర్ ఎమ్మెల్యే విక్రమ్ మండవి



నవతెలంగాణ-చర్ల

తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ఛత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్ జిల్లా ఎమ్మెల్యే విక్రమ్ మండావి కాన్వాయ్‌పై మావోయిస్టులు మంగళవారం మెరుపు దాడి చేశారు. ఈ ఘటనలో ఎమ్మెల్యే తృటిలో తప్పించుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగులూరులో ఓ సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే విక్రమ్ హాజరై తిరిగి బీజాపూర్ వస్తుండగా దండకారణ్యంలో మావోయిస్టులు కాపుకాసి హతమార్చేందుకు ప్రయత్నించారు. కాన్వాయ్‌పై మావోయిస్టులు విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్టు స్థానికులు తెలుపుతున్నారు. అయితే ఎంతో సమయస్ఫూర్తితో ఎమ్మెల్యే భద్రతా సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తప్పించుకున్నట్టు తెలుస్తోంది.

వడదెబ్బకు హమాలీ మృతి

- నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలంలో



నవతెలంగాణ-మాడుగులపల్లి

ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడదెబ్బతో హమాలీ కార్మికుడు ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలంలోని దేవతలబాయిగూడెంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. దేవతలబాయి గూడెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో సేత్యాతండాకు చెందిన రమావత్ జాను(56) హమాలీగా పని చేస్తున్నాడు. ఎండ తీవ్రతకు వడదెబ్బకు గురై ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే మృతిచెందాడు. అతనికి భార్య నలుగురు పిల్లలు ఉన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్, సీనియర్ అసిస్టెంట్ రేణుక మృతదేహానికి పంచనామా నిర్వహించారు.

కొత్త జిల్లాల్లో జెడ్పీజీపీఎఫ్ ఖాతాలు ప్రారంభించాలి

- పంచాయతీరాజ్ కార్యదర్శికి పీఆర్టీయూటీఎస్ వినతి



నవతెలంగాణ - హైదరాబాద్


కొత్త జిల్లాల్లో జెడ్పీజీపీఎఫ్ ఖాతాలను వెంటనే ప్రారంభించాలని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉమ్మడి తొమ్మిది జిల్లా కేంద్రాల్లో జెడ్పీజీపీఎఫ్ ఖాతాలు కొనసాగుతున్నాయని వివరించారు. కొత్తగా ఏర్పాటైన 32 జిల్లాల వారీగా శాశ్వత ప్రాతిపదికన జీపీఎఫ్ ఖాతాలను ప్రారంభించాలని కోరారు. 32 జిల్లాల్లో కొత్తగా జెడ్పీజీపీఎఫ్ ఖాతాలను ప్రారంభించాలంటూ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, సంబంధిత అధికారులను సుల్తానియా ఆదేశించారని తెలిపారు.

రెండు నెలల్లో పెండింగ్ బిల్లుల మంజూరు

రాబోయే మే, జూన్ రెండు నెలల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సుమారు రూ.700 కోట్ల పెండింగ్ బిల్లులను మంజూరు చేస్తామంటూ ఆర్థిక శాఖ అధికారులు హామీ ఇచ్చారని పీఆర్టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ పేర్కొన్నారు.

ఆదివాసీల నుంచి పాఠాలు నేర్చుకుందాం

వాతావరణ సంక్షోభ నివారణకు గుటెరస్ పిలుపు



ఐక్యరాజ్య సమితి : వాతావరణ సంక్షోభాన్ని నివారించడానికి ఆదివాసీల వద్ద అనేక పరిష్కారాలు వున్నాయని, వారి నుండి ప్రపంచం ఎంతో నేర్చుకోవాల్సి వుందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ సోమవారం వ్యాఖ్యానించారు. ఆదివాసీల సమస్యలపై ఐక్యరాజ్య సమితి శాశ్వత వేదిక 22వ సమావేశాలను ప్రారంభిస్తూ ఆయన మాట్లాడారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సవాళ్ళను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. మొత్తంగా ప్రపంచ జనాభాలో ఆదివాసీలు దాదాపు 5 శాతం మంది వుంటారు. కానీ ప్రపంచంలోని అత్యంత పేదల్లో 15 శాతం మంది వారిలోనే వున్నారని అన్నారు. వాతావరణానికి సంబంధించిన అత్యవసర పరిస్థితుల్లో వారు జీవిస్తున్నారన్నారు. వాతావరణ సంక్షోభానికి వారు కారణం కాకపోయినా అత్యంత అధ్వాన్నమైన, తక్షణమే ప్రభావం చూపగల ప్రభావాలను వారు ఎదుర్కొంటున్నారని అన్నారు. "ఐక్యరాజ్య సమితి ఆదివాసీలకు బాసటగా వుంటుంది." అన్నదే ఈనాటి తన సందేశమని గుటెరస్ స్పష్టం చేశారు. 2000లో ఐక్యరాజ్య సమితి శాశ్వత వేదిక ఏర్పడింది. ఐక్యరాజ్య సమితి ఆర్థిక, సామాజిక మండలి(ఇసిఓఎస్‌ఓసి) ద్వారా ఐక్యరాజ్య సమితి వ్యవస్థకు ఆదివాసీల సమస్యలపై సూచనలు, సలహాలను ఈ ఫోరం అందచేస్తుంది. ఈ నెల 28వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. "ఆదివాసీలు, మానవ ఆరోగ్యం, భూగోళం, ప్రాదేశిక ఆరోగ్యం, వాతావరణ మార్పులు : హక్కుల ఆధారిత విధానం" అన్న అంశం ప్రాతిపదికగా ఈ ఏడాది సమావేశాలు జరుగుతున్నాయి. ప్రకృతిని కాపాడేందుకు, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించేందుకు చేస్తున్న కృషిలో ఆదివాసీల అద్వితీయమైన పాత్రను గుటెరస్ ప్రశంసించారు.

ఉన్నతచదువులు చదవాలి.. సమాజ సేవ చేయాలి

- హిమాన్షురావుకు సీఎం దంపతుల ఆశీర్వాదం



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఉన్నత చదువులు చదివి జీవితంలో మరింతగా ఎదగాలనీ, సమాజానికి గొప్పగా సేవ చేయాలని హిమాన్షురావును సీఎం కేసీఆర్ దంపతులు ఆశీర్వదించారు. మంగళవారం హైదరాబాద్‌లోని వోక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 12 క్లాస్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించారు. సీఎం మనువడు, మంత్రి కేటీఆర్ తనయుడు హిమాన్షురావు 12 క్లాసు గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్నారు. వెంటనే పట్టాను కేసీఆర్ చేతుల్లో పెట్టి దీవెనలను తీసుకున్నారు. ఈ సందర్భంగా అతన్ని కేసీఆర్ అభినందించారు. క్రీడా, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో ప్రతిభ కనబర్చినవారికి ఇచ్చే అవార్డుల్లో 'కమ్యూనిటి యాక్టివిటీ సర్వీసెస్' (సీఎఎస్) విభాగంలో ఎక్సలెన్స్ అవార్డును హిమాన్షురావు అందుకున్నారు. పట్టా పొందిన వారిలో బీఆర్ఎస్ ఎన్నారై సెల్ గ్లోబల్ కో–ఆర్డినేటర్ మహేశ్ బిగాల తనయుడు అద్విత్ బిగాల కూడా ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం కేసీఆర్, ఆయన సతీమణి శోభమ్మ, మంత్రి కేటీఆర్, హిమాన్షు తల్లి శైలిమ, చెల్లెలు అలేఖ్య, అమ్మమ్మ మేనమామలు, ఎమ్మెల్యే గణేశ్ బిగాల పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షలను సజావుగా నిర్వహించండి

- అధికారులకు మంత్రి సబిత ఆదేశం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో ఉమ్మడి ప్రవేశ పరీక్షలను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులను మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. వచ్చేనెల పది నుంచి జూన్ ఒకటో తేదీ వరకు జరిగే ప్రవేశ పరీక్షల ఏర్పాట్లపై మంగళవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలిలో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని సూచించారు. ప్రత్యేకంగా పర్యవేక్షకులను నియమించాలని ఆదేశించారు. పరీక్షల కన్వీనర్లు, వీసీలు, ఉన్నత విద్యామండలి అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా నిర్వహించాలని కోరారు. గతేడాది ఎంసెట్‌కు 2,66,719 దరఖాస్తులు రాగా, ఈ ఏడాది 3,18,018 దరఖాస్తులొచ్చాయని వివరించారు. ప్రవేశ పరీక్షల విధులు నిర్వహించే సిబ్బందికి ఎట్టిపరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లను అనుమతించొద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, వర్సిటీల వీసీలు, వివిధ సెట్ల కన్వీనర్లు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలిపై మంత్రి ఆగ్రహం

ఎంసెట్ భద్రత చర్యలపై జేఎన్‌టీయూహెచ్ అధికారులు, ఎంసెట్ కన్వీనర్, ఉన్నత విద్యా మండలి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రశ్నాపత్రాల లీకేజీల వ్యవహారం జరుగుతున్నా, భద్రతపై అధికారులు ఇప్పటికీ ఒక్క సమావేశాన్ని నిర్వహించకపోవడం ఏమిటని ఆమె ప్రశ్నించినట్టు సమాచారం. గతంలో ఎంసెట్ కన్వీనర్‌గా ఉన్న గోవర్ధన్ ఎప్పటికప్పుడు వివరాలు పారదర్శకంగా ఉంచేవారని, ప్రస్తుత కన్వీనర్ కొత్త కావడం వల్ల ఏమీ తెలియడం లేదనే అభిప్రాయం మంత్రి వ్యక్తం చేసినట్టు తెలిసింది. జేఎన్‌టీయూహెచ్ అధికారులు సహకరించడం లేదంటూ మంత్రి వద్ద లింబాద్రి ఈ సందర్భంగా వాపోయినట్టు సమాచారం.

పల్లె ప్రగతికి నిదర్శనమే అవార్డులు

- టీఎస్‌పీహెచ్‌ఐసీ చైర్మెన్ కోలేటి

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

పల్లె ప్రగతికి నిదర్శనమే రాష్ట్రానికి జాతీయ అవార్డులని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల వల్లనే జాతీయ స్థాయిలో రాష్ట్రం మరోసారి సత్తా చాటగలిగిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని పంచాయతీల అభివృద్ధితో పాటు, వాటి పరిధిలోని ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులను మెరుగుపర్చే దిశగా ప్రభుత్వం కార్యక్రమాలను అమలు చేసిందని తెలిపారు. ఫలితంగానే రాష్ట్రానికి జాతీయ అవార్డుల పంట పండుతున్నదని వివరించారు.

మరో రెండు కొత్త మండలాలు

- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర సర్కార్
- కామారెడ్డి జిల్లాలో పాల్వంచ,
- జోగులాంబ–గద్వాల్ జిల్లాలో ఎర్రవల్లి

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రాష్ట్రంలో మరో రెండు కొత్త మండలాలను ప్రభుత్వం ప్రకటించింది. కామారెడ్డి జిల్లాలో పాల్వంచ, జోగులాంబ–గద్వాల్ జిల్లాలో ఎర్రవల్లి మండలాలను ఏర్పాటు చేస్తూ రెవెన్యూ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. గద్వాల్ రెవెన్యూ డివిజన్‌లోని ఇటిక్యాల మండలం నుంచి బొచువీరాపూర్, పుటాన్‌దొడ్డి, రాజాశ్రీగార్లపాడు, కాప్రాకుల, సాసానూల్, ధర్మావరం, కొండేర్, వేముల, తిమ్మాపూర్‌లతో ఎర్రవల్లి మండలాన్ని ఏర్పాటు చేశారు. కామారెడ్డి రెవెన్యూ డివిజన్‌లోని మాచారెడ్డి మండలం నుంచి పాల్వంచ, ఎలుపుగొండ, వాడి, ఫరీద్‌పేట్, బండారామేశ్వర్‌పల్లి, ఇసాయిపేట్, దేవన్‌పల్లి, పోతారం, భవానిపేట్ గ్రామాలతోపాటు రామారెడ్డి మండలంలోని సింగాయిపల్లి గ్రామాన్ని కలిపి పాల్వంచ మండలాన్ని ఏర్పాటు చేశారు.

ఎర్రజెండాయే అండదండ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బెహార్ ప్రాంతంలో ప్రజలు మళ్లీ ఎర్రజెండా చేత పట్టి పోరుబాట పడుతున్నారు. తృణమూల్ కాంగ్రెస్, బిజెపి హామీల గొప్పలకు మోసపోయి ఆ పార్టీల్లో చేరిన వీరంతా ఆ పార్టీలిచ్చిన హామీలు నీటి మీద రాతలనేని గ్రహించారు. రాష్ట్రంలో పెరిగిపోతున్న భారీ అవినీతి, బిజెపి మతోన్మాద రాజకీయాలు ప్రజా ఐక్యతను దెబ్బతీస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి లేక యువత అఘోరిస్తోందని తెలిపారు. కూచ్‌బెహార్‌కు చెందిన దాదాపు 400 కుటుంబాలు మంగళవారం నాడు ఎర్ర జెండా పట్టి ఉద్యమబాట పట్టారు. అవినీతి, నిరుద్యోగం ఇతర సమస్యలను పరిష్కరించేది వామపక్షాలు మాత్రమేనంటూ నినదించారు. భారీ ర్యాలీ చేపట్టి బిజెపి, తృణమూల్ కాంగ్రెస్ పాలనాతీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఎల్లప్పుడూ అండదండగా నిలుస్తూవస్తున్న ఎర్రజెండాయేనని, అందుకే మళ్లీ ఎర్రజెండా చేబూనామని వారు తెలిపారు.

టీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్‌పీఆర్.మల్లేష్‌కుమార్ ఎన్నిక

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్‌పీఆర్ మల్లేష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రాములు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన రమేష్‌పాక తన వ్యక్తిగత కారణాలతో స్వచ్ఛందంగా ఆ పదవీ నుంచి తప్పుకున్నారు. దీంతో రాష్ట్ర కమిటీ సమావేశంలో మల్లేష్‌కుమార్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాస్‌శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిపిలోనే ఉన్నా.. : అజిత్ పవార్

ముంబయి : ఎన్‌సిపి నుంచి కొందరు ఎమ్మెల్యేలను తనవైపు తిప్పుకొని ఒక ముఠాగా బిజెపిలోకి పిరాయించనున్నట్లు వచ్చిన వార్తలను ఎన్‌సిపి సీనియర్ నేత అజిత్ పవార్ తీవ్రంగా ఖండించారు. ఇవన్ని తప్పుడు ఊహాగానాలని ఆయన కొట్టిపారేశారు. ఎన్‌సిపి అనేది ఒక కుటుంబమని, పార్టీ అధ్యక్షులు శరద్ పవార్ నాయకత్వంలో పని చేస్తూనే ఉంటుందని తెలిపారు. ముంబయిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పారు.

బదిలీల కోసం పదోన్నతులు వాయిదా సరికాదు

పీఆర్టీయూ తెలంగాణ



నవతెలంగాణ – హైదరాబాద్

ఉపాధ్యాయ బదిలీలు సాధ్యం కాకుంటే పదోన్నతులను వెంటనే చేపట్టాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. బదిలీల కోసం పదోన్నతులను వాయిదా వేయడం సరైంది కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పాలనలో ఒక్కసారైనా పదోన్నతుల్లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అది ఉద్యోగి హక్కని తెలిపారు. 60 శాతానికిపైగా గెజిటెడ్ హెడ్మాస్టర్లు, వేలాదిగా స్కూల్ అసిస్టెంట్లు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల విద్యావ్యవస్థ దారుణంగా ఉందని విమర్శించారు. జీహెచ్‌ఎం, కిందిస్థాయి పోస్టుల పదోన్నతులకు ఎలాంటి కోర్టు అభ్యంతరం లేకున్నా బదిలీలకు ముడిపెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యాశాఖ అధికారులు ఆలోచించాలని కోరారు. కాలయాపన లేకుండా సీనియార్టీ జాబితాను అనుసరించి వెంటనే పదోన్నతులకు షెడ్యూల్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేండ్లుగా మోడల్ స్కూల్ పాఠశాలల ఉపాధ్యాయులకు సాంకేతిక కారణాలు చూపి బదిలీలు, పదోన్నతులు చేపట్టకపోవడం విద్యాశాఖ నిర్లక్ష్యం బయటపడుతున్నదని తెలిపారు. వెంటనే పదోన్నతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్ల సంఘం (టీఎంఎస్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షులు భూతం యాకమల్లు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణా నివారణకు

రాష్ట్ర సరిహద్దుల్లో 50 చెక్‌పోస్టులు

- ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన డీజీపీ



నవతెలంగాణ–ప్రత్యేక ప్రతినిధి

యాసంగిలో బియ్యం కొనుగోళ్ల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల నుంచి బియ్యం అక్రమ రవాణాను నిరోధించడానికి 50 సాయుధ చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ ప్రకటించారు. మంగళవారం సరిహద్దు రాష్ట్రాల నుంచి బియ్యంతో పాటు మద్యం అక్రమ రవాణాలను నిరోధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో డీజీపీ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సందర్భంగా రాష్ట్రంలో పండిన దాదాపు 161 లక్షల టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నదనీ, ఈ నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుంచి అక్రమ దారుల్లో బియ్యం రవాణా జరుగుతున్నదనీ, దీనిని నిరోధించాల్సినవసరం ఉన్నదని తెలిపారు. ఇందుకోసం నాలుగు సరిహద్దు రాష్ట్రాలకు ఆనుకొని ఉన్న పదిహేడు జిల్లాలలో మొత్తం సాయుధ చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. దీనికి సంబంధించి పౌర సరఫరాల శాఖ, రాష్ట్ర ఎక్సైజ్ విభాగం, పోలీసు శాఖలు సమన్వయంలో పని చేయాల్సినవసరం ఉన్నదని విజిలెన్స్ విభాగాలను అప్రమత్తం చేయాల్సినవసరం ఉన్నదని తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల మీదుగానే కాక ఇతర మార్గాల నుంచి కూడా బియ్యం అక్రమ రవాణా రాష్ట్రంలోకి జరిగే ప్రమాదమున్నదని అన్నారు. దీనిని అరికట్టడానికి ఆయా జిల్లాల పోలీసులతో పాటు పౌర సరఫరాల శాఖ విజిలెన్సు విభాగం కూడా సంయుక్తంగా కాపు కాయాల్సినవసరమున్నదని, అందుకు ప్రత్యేకమైన టీమ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. సరిహద్దు రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోకి నాన్‌పెయిడ్ లిక్కర్ పెద్ద ఎత్తున అక్రమ రవాణా జరగకుండా పోలీసులతో కలిసి నిరోధక చర్యలు చేపడతామని అన్నారు. ఎక్కువగా మద్యం అక్రమ రవాణా జరిగే సరిహద్దు ప్రాంతాలు గుర్తించి అక్కడ నిఘాను పెంచాల్సినవసరం ఉన్నదని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. అంతేగాక మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, భూపాలపల్లి జిల్లాల్లో గుడుంబా తయారీని, విక్రయాలను కఠినంగా అణచివేయడానికి పోలీసు శాఖతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మొత్తమ్మీద సరిహద్దు నుంచి జరిగే బియ్యం అక్రమ రవాణా, మద్యం స్మగ్లింగ్‌లను అరికట్టడానికి కలిసి కట్టుగా కృషి చేద్దామని పోలీసు, పౌర సరఫరా, ఎక్సైజ్ శాఖాధికారులు నిర్ణయించారు. వీడియో కాన్ఫరెన్సు ద్వారా జరిగిన ఈ సమావేశంలో పలువురు సీనియర్ పోలీసు అధికారులతో పాటు ఆయా జిల్లాల ఎస్పీలు, అదనపు పోలీసు కమిషనర్లు పాల్గొన్నారు.

స్వలింగ సంపర్కుల వివాహాల చట్టబద్ధత...

సుప్రీంలో కొనసాగనున్న వాదనలు

న్యూఢిల్లీ : స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధతను ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై మంగళవారం సుప్రీంకోర్టులో వాదనలు ప్రారంభమయ్యాయి. బుధ, గురువారాల్లో కూడా ఈ వాదనలు కొనసాగనున్నాయి. కేంద్రప్రభుత్వం వచ్చే వారం తన వాదనలు వినిపించనుంది. విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది ముకుల్ రోహాతగి మాట్లాడుతూ, ఒక కమ్యూనిటీ ప్రాథమిక హక్కులను తిరస్కరించడానికి ప్రజామోదాన్ని పరీక్షించడం సరిపోదని వ్యాఖ్యానించారు. "అసలు ఇక్కడ జరుగుతున్న కళంకం ఏమిటి? రాజ్యాంగ ప్రకటన ద్వారా మాత్రమే దాన్ని తొలగించగలుగుతాం." అని అన్నారు. "లైంగిక దృక్పథం ప్రాతిపదికగా వివక్ష చూపడమనేది ఒక వ్యక్తి పరువు, ప్రతిష్టను దారుణంగా దెబ్బతీస్తుంది." అని వ్యాఖ్యానించారు. అంతకుముందు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ మాట్లాడుతూ, ప్రత్యేక వివాహాల చట్టం కింద వివాహం చేసుకోవాలనుకుంటున్న జంట తప్పనిసరిగా 30 రోజుల నోటీసు ఇవ్వాలనడం కూడా రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించారు. "సాధారణ వివాహంలో కూడా ఆ వివాహానికి అభ్యంతరం వున్న వారు వెంటనే వాటిని తెలియచేయాలంటూ నోటీసులివ్వాలనడం కూడా రాజ్యాంగ విరుద్ధం." అని ఆయన వ్యాఖ్యానించారు. అంతకుముందు ఈ పిటిషన్ల విచారణకు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని సుప్రీం ప్రకటించింది. అందుకు అనుగుణంగా జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ ఎస్‌కె కౌల్, జస్టిస్ రవీంద్ర భట్, జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ పిఎస్ నరసింహాతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారణను ప్రారంభించింది. బయోలాజికల్ పురుషుడు లేదా బయోలాజికల్ మహిళ అన్న భావన సంపూర్ణం కాదు, మీ జననాంగాలు ఏమిటనేది మాత్రమే ఇక్కడ ప్రశ్న కాదు" అని విచారణ సందర్భంగా విడిగా చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఏ సంబంధమైనా సామాజికంగా ఆమోదం పొందడమనేది కేవలం న్యాయ స్థానాలపైనో లేదా చట్టసభలపైనో ఎన్నడూ ఆధారపడి వుండదని సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందిస్తూ చంద్రచూడ్ పై వ్యాఖ్యలు చేశారు.

ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలంటే పేపర్ ట్రెయిల్ వుండాల్సిందే !

వివిపిఎటిల లెక్కింపు కోరుతూ సుప్రీంలో పిల్



న్యూఢిల్లీ : రాబోయే రాష్ట్ర ఎన్నికల్లో అన్ని వివిపిఎటి(ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రెయిల్) లను లెక్కించాలని కోరుతున్న ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. జస్టిస్ ఎం.ఆర్.షా నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం దీన్ని విచారించనుంది. ఎన్‌జిఓ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. తమ ఓటు నమోదైందా లేదా అని ఓటర్లు నిర్ధారించుకునేందుకు గానూ ప్రయోగాత్మక ప్రాతిపదికన ఈ పద్ధతిని చేపట్టేందుకు భారత ఎన్నికల కమిషన్‌కు అవసరమైన ఆదేశాలు జారీ చేయాల్సిందిగా పిల్ కోరింది. సీనియర్ న్యాయవాది దుష్యంత్ దావె అందుబాటులో లేకపోవడంతో ఈ అంశంపై విచారణ వాయిదా పడింది. స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు జరిగేలా చూడడంలో పేపర్ ట్రెయిల్ అనేది విడదీయరాని భాగమని పిల్ పేర్కొంది.

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని వివిపిఎటిలు లెక్కించేలా భారత ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాల్సిందిగా పిల్ కోరింది. పేపర్ ట్రెయిల్‌ను ప్రవేశపెట్టడం ద్వారా మాత్రమే ఇవిఎంల పట్ల ఓటర్ల విశ్వాసాన్ని పొందగలుగుతామని పేర్కొంది. వివిపిఎటి వ్యవస్థతో కూడిన ఇవిఎంలు ఓటింగ్ వ్యవస్థకు కచ్చితత్వాన్ని కల్పిస్తాయని పేర్కొంది. వివిపిఎటి స్లిప్ ఏడు సెకన్ల పాటు డిస్‌ప్లే అవడం ద్వారా తమ ఓటు రికార్డయిందా లేదా అని తెలుసుకోవడానికి వీలు వుంటుంది. "ఓటు నమోదు అయినట్లుగా లెక్కించబడింది" అనడానికి సంబంధించి ఇప్పటివరకు చర్యలు శూన్యం. దీనికి తోడు ఏదైనా తేడా వుంటే నిరూపించుకోవాల్సిన భారం సదరు వ్యక్తిపైనే వుంటుందని పిల్ పేర్కొంది. కరెన్సీ నోట్లను లెక్కించే యంత్రాలతోనే వివిపిఎటి స్లిప్‌లను లెక్కించాలనే ప్రతిపాదన భారత ఎన్నికల కమిషన్ నుండి రావడం ఆసక్తికరం. కరెన్సీ లెక్కింపు యంత్రాలను గనక ప్రవేశ పెడితే సెకన్ల వ్యవధిలో అన్ని స్లిప్‌లను లెక్కబెట్టవచ్చునని మాజీ సిఇసి ఒకరు వ్యాఖ్యానించారు. ఈ యంత్రాలను ఆ రీతిలో ప్రోగ్రామింగ్‌చేయాల్సి వుంటుంది లేదా యంత్రాలకు అనుగుణంగా వుండేలా పేపర్ సైజ్‌ను పెంచాల్సి వుంటుందని పేర్కొన్నారు. అందుకు అవసరమైన సాంకేతికత కూడా అందుబాటులో వుంది. కావాల్సిందల్లా సంకల్పబలం మాత్రమేనని పిల్ పేర్కొంది. ఇవిఎంలు, వివిపిఎటిలు రాజ్యాంగ విరుద్ధమని జర్మనీలో వారి సుప్రీం కోర్టు పేర్కొనడంతో తిరిగి పేపర్ బ్యాలెట్ వ్యవస్థకే మళ్ళారని మాజీ ప్రభుత్వ ఉద్యోగి, ఎన్నికలపై పౌరుల కమిషన్ సభ్యుడైన ఎం.జి.దేవసహాయం వ్యాఖ్యానించారు. అనవసరం, సమయం ఎక్కువ పడుతుందనే కారణంతో భారత ఎన్నికల కమిషన్ వివిపిఎటి స్లిప్‌లను లెక్కించే పద్ధతిని తిరస్కరించిందని పిల్ పేర్కొంది. కనీసం 50శాతం వివిపిఎటి స్లిప్‌లను లెక్కించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ చీఫ్ చంద్రబాబు నాయుడు, మరో 21 పార్టీలు పెట్టుకున్న రివ్యూ పిటిషన్‌ను 2019లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గగోయ్ తిరస్కరించారు.

మార్గదర్శి డిపాజిటర్ల చెల్లింపుల్లో రహస్యం ఎందుకు?

సుప్రీంకోర్టు



నవతెలంగాణ–న్యూఢిల్లీ బ్యూరో

డిపాజిటర్లకు చేసిన చెల్లింపుల్లో రహస్యం ఎందుకని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను సుప్రీం కోర్టు ప్రశ్నించింది. అలాంటిదేమీ లేనప్పుడు ఆయా వివరాలు కోర్టుకు అందజేయాలని ఆదేశించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జెబి పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏపి ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం నుంచి కొన్ని డాక్యుమెంట్లు తీసుకోవాల్సి ఉందని, రెండు వారాలు గడువు ఇవ్వాలని కోరారు. ఏపి ప్రభుత్వం వాయిదా కోరుతూ లెటర్ సర్క్యులేట్ చేయగా.. దానిపై అభ్యంతరం తెలుపుతూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ సోమవారం రాత్రి లెటర్ సర్క్యులేట్ చేసింది. దీన్ని గుర్తుచేస్తూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ తరపు సీనియర్ న్యాయవాది సిద్దార్ధ లూత్రా అభ్యంతరం తెలిపారు. ఈ దశలో జస్టిస్ జెబి పార్దీవాలా జోక్యం చేసుకొని కొన్ని ప్లీడింగ్స్‌లో ప్రొప్రయిటరీ అని, కొన్ని ప్లీడింగ్స్‌లో హెచ్‌యుఎఫ్ (హిందూ అన్‌డివైడెడ్ ఫ్యామిలీ) అని పేర్కొనడం సమస్యాత్మక అంశం కదా అని ప్రశ్నించారు. తదుపరి విచారణకు దీనిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. హెచ్‌యుఎఫ్ అంటే అసోసియేషన్ ఆఫ్ ఇన్‌డివిడ్యుయల్స్ కదా.. ప్రొప్రయిటరీ షిప్‌ను కూడా ఇందులో వ్యక్తిగత కెపాసిటీలో చూపుతున్నారా? దీనికి లీగాలిటీ లేదు కదా అని జస్టిస్ పార్దీవాలా ప్రశ్నించారు. గత విచారణలో డిపాజిటర్లందరికీ సొమ్ములు వెనక్కి ఇచ్చేశామని చెప్పారు కదా అని లూత్రానుద్దేశించి జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు.

ఈ సమయంలో పార్టీ ఇన్ పర్సన్ ఉండవల్లి అరుణ్‌కుమార్, న్యాయవాది అల్లంకి రమేశ్‌లు... డిపాజిటర్లకు సొమ్ములు తిరిగి ఇచ్చేశామని అన్నారు. కానీ వివరాలు ఎక్కడా వెల్లడించలేదని గుర్తుచేశారు. ఇటు ప్రభుత్వానికి కానీ, అటు కోర్టుకు గానీ వివరాలు చెప్పలేదని అన్నారు. ఆయా వివరాలు అందజేయాలని కోరాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఆడిటర్ చట్టం ప్రకారం తాము వివరాలు ఇచ్చామని లూత్రా తెలిపారు. వారిని వివరాలు అందజేయాలని కోరాలని మరోసారి ఉండవల్లి కోర్టును అభ్యర్థించారు. వివరాలు వెల్లడించడంలో ఏమైనా సీక్రెట్ (రహస్యం) దాగుందా అని లూత్రాను జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. ఇందులో ఏమీ రహస్యం లేదని లూత్రా చెప్పగా అయితే, కోర్టులో ఫైల్ చేయాలని జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. ఈ దశలో మార్గదర్శి తరపు మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి జోక్యం చేసుకొని హైకోర్టు ఆర్డర్‌లో పేరా 27 ప్రకారం ఎవరైనా వివరాలు కావాలని ముందుకొస్తే అందజేస్తామని పేర్కొన్నారు. "డిపాజిట్లు తిరిగి ఎవరెవరికి ఇచ్చారు. ఎంతెంత ఇచ్చారు. మీరు చెప్పాల్సిన అవసరం ఉంది" అని లూత్రా, సింఘ్విలనుద్దేశించి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. "2007 మార్చి చివరి నాటికి డిపాజిట్ల రూపంలో సేకరించిన మొత్తం రూ.2,541 కోట్లు. తిరిగి వెనక్కి ఇచ్చింది రూ.2,596 కోట్లు.. తదనంతరం ఖాతాలో బ్యాలెన్స్ రూ.5.43 కోట్లు" అని ఆడిటర్ స్టేట్‌మెంట్ ఇచ్చిన విషయాన్ని లూత్రా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

అయితే, తదుపరి విచారణ సమయానికి ఆయా వివరాలు కోర్టుకు అందజేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎవరికి ఫిర్యాదు చేయాలనే అంశంపై తగిన యంత్రాంగం లేదని ఉండవల్లి కోర్టుకు తెలిపారు. రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై పలు కేసులు ఉన్నాయని, గూగుల్‌లో చూస్తే అన్ని తెలుస్తాయని పేర్కొన్నారు. గత విచారణ సమయంలో డిపాజిటర్ల వివరాలు రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) చెప్పాలని సుప్రీంకోర్టు సూచించగా.. ఆయా వివరాలు ఆర్‌బిఐకు అందజేశామని ఇక సమస్య ఏముందని లూత్రా చెప్పగా... ఆర్‌బిఐ కూడా ఈ కేసులో పార్టీ అన్న విషయాన్ని ఉండవల్లి గుర్తుచేశారు. వివరాలు వెల్లడించ డానికి మాకేం ఇబ్బంది లేదని లూత్రా పేర్కొన్నారు. "రిజాయిండర్ దాఖలు చేయడానికి ఏపి ప్రభుత్వానికి గడువు ఇస్తున్నాం" అని జస్టిస్ సూర్యకాంత్ ఆర్డర్ చదువుతుండగా.. డిపాజిటర్ల వివరాలు వెల్లడించాలని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఆదేశించాలని ఉండవల్లి కోరారు. "డిపాజిటర్లకు చెల్లింపు వివరాలు అందజేయాలని మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావు"లను ఆదేశిస్తున్నా మని జస్టిస్ సూర్యకాంత్ ఆర్డర్‌లో పేర్కొన్నారు. అనంతరం "హైకోర్టులో ఉన్న కేసులో ఒకరు స్టేట్, ఒకరు ఎక్యూజ్డ్ ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి కన్సెంట్ ఎవరిచ్చారు" అనేది తేల్చాలని రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది వైద్యనాధన్‌ను జస్టిస్ జెబి పార్దీవాలా కోరారు.

అసోం ఎమ్మెల్యేకు సుప్రీం బెయిల్

- కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారంటూ కేసు
- 567 రోజుల జైలు జీవితం

న్యూఢిల్లీ : పౌరసత్వ సవరణ చట్ట (సీఏఏ) వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొన్నారనీ, మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ నమోదు చేసిన కేసులో అసోం స్వతంత్ర ఎమ్మెల్యే అఖిల్ గొగోయ్‌కి సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. సీఏఏ వ్యతిరేక నిరసన సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పారంటూ గొగోయ్‌పై కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఆయనపై అభియోగాల నమోదుకు ప్రత్యేక ఎన్‌ఐఏ కోర్టును అనుమతిస్తూ ఫిబ్రవరి 9న అసోం హైకోర్ట్ ఆదేశాలు జారీ చేసింది. అయితే అంతకుముందు గొగోయ్, మరో ముగ్గురిపై నమోదు చేసిన కేసును ఎన్‌ఐఏ కోర్టు కొట్టివేసింది. వీరందరికీ క్లీన్‌చిట్ ఇచ్చింది. దీనిపై ఎన్‌ఐఏ కోర్టుకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేస్తూ అభియోగాల నమోదుకు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను గొగోయ్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అంతకుముందు గొగోయ్ బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చడంతో ఆయన 567 రోజులు జైలులో గడిపారు. ఎన్‌ఐఏ కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చిన తర్వాతే ఆయన విడుదలయ్యారు. గొగోయ్‌పై నమోదైన రెండు కేసుల్లో ఒక దానిలో బెయిల్ వచ్చినా, రెండో కేసులో రాకపోవడంతో జైలులో గడపాల్సి వచ్చింది. కేంద్రానికి వ్యతిరేకంగా మాట్లాడడం దేశ ఆర్థిక భద్రతకు ముప్పు కలిగించినట్లు కాదని, అది ఉగ్రవాద చర్య కూడా కానేరదని కోర్టు స్పష్టం చేసింది.


దభోల్కర్ హత్య కేసు విచారణపై పర్యవేక్షణ కొనసాగించం

- బాంబే హైకోర్టు

ముంబయి : హేతువాది నరేంద్ర దభోల్కర్ హత్య కేసుపై సిబిఐ నిర్వహిస్తున్న విచారణపై పర్యవేక్షణను కొనసాగించబోమని బాంబే హైకోర్టు మంగళవారం ప్రకటించింది. విచారణపై పర్యవేక్షణ కొనసాగించాలని దభోల్కర్ కుమార్తె ముక్తా దభోల్కర్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎఎస్ గడ్కారీ, జస్టిస్ పిడి నాయిక్‌తో కూడిన డివిజన్ బెంచ్ కొట్టి వేసింది. 2013 ఆగష్టు 20న పుణేలో ఉదయపు నడక చేస్తున్న దభోల్కర్ హిందుత్వ గూండాలు దారుణంగా కాల్చి చంపారు. ఈ కేసు విచారణను పుణే పోలీసుల నుంచి 2014లో సిబిఐకు అప్పగించిన హైకోర్టు అప్పటి నుంచి విచారణను పర్యవేక్షిస్తుంది. ఎప్పటికప్పుడు నివేదికలను కోర్టుకు సిబిఐ అప్పగిస్తుంది. అయితే, కేసు విచారణ ముగిసిందని, ముగింపు నివేదికను అనుమతి కోసం ప్రధాన కార్యాలయానికి దర్యాప్తు అధికారి పంపారని సిబిఐ ఈ జనవరిలో కోర్టు తెలిపింది. దీంతో పర్యవేక్షణను హైకోర్టు ఉపసంహరించుకుంది. 2014 పుణే పోలీసులు నుంచి కేసును స్వాధీనం చేసుకున్న సిబిఐ ఐదుగుర్ని నిందితులుగా పేర్కొంటూ చార్జిషీట్ దాఖలు చేసింది. వీరిపై పుణేలోని సెషన్స్ కోర్టులో విచారణ కొనసాగుతోంది.

బిజినెస్

ఎలన్ మస్క్ ఎఐ ట్రూత్‌జిపిటి వస్తోంది..



వాషింగ్టన్ : కార్పొరేట్లు చెప్పే మాటలకు చేసే అనేక పనులకు సంబంధం ఉండదని ఎలన్ మస్క్ వ్యవహారం స్పష్టం చేస్తోంది. కృత్రిమ మేధా (ఎఐ) వల్ల ప్రపంచానికి, మానవాళికి తీవ్ర నష్టం వాటిల్లనుందని.. అలాంటి వాటి జోలికి పోవద్దని ఇటీవల ఎలన్ మస్క్ సహా గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ సహా అనేక మంది దిగ్గజ కార్పొరేట్లు ఓ బహిరంగ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. నాగరిక సమాజ భవిష్యత్తుకు ఉన్న అతిపెద్ద ప్రమాదాల్లో ఎఐ ఒకటని పేర్కొన్నారు. ఎఐ భద్రతను నియంత్రించే వ్యవస్థ ఉండాలని అభిప్రాయపడ్డారు. దీని నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ లేఖ రాసి నెల రోజులు కూడా కాకముందే టెస్లా, ట్విట్టర్ అధినేత ఎలన్ మస్క్ మంగళవారం ఎఐ ఆధారిత ట్రూత్‌జిపిటి పేరుతో ఎఐ చాట్‌బాట్‌ను ఆవిష్కరించనున్నట్లు ప్రకటించడం గమనార్హం. మైక్రోసాఫ్ట్ చాట్ జిపిటి బాటలో ఇప్పుడు అన్ని టెక్ దిగ్గజాలు పరుగులు పెడుతున్నాయి. చాట్ జిపిటికి పోటీగా గూగుల్ తన బార్డ్‌ను అభివృద్ధి చేస్తోన్న విషయం తెలిసిందే.

ట్విట్టర్‌కు రెట్టింపు చెల్లించా.. : మస్క్

ట్విట్టర్ విలువ కంటే తాను ఎక్కువగా చెల్లించి ఆ సంస్థను కొనుగోలు చేశానని ఎలన్ మస్క్ పేర్కొన్నారు. ట్విట్టర్ స్వాధీనంపై ఆయన తాజాగా స్పందిస్తూ.. " సంస్థ విలువకంటే రెట్టింపు ధరకు కొనుగోలు చేశాను. అది సరైన ఆర్థిక నిర్ణయం కాదు. కొనుగోలుకు సరైనా సమయం కూడా కాదు. ప్రస్తుతానికి ట్విట్టర్ కొనుగోలు పేలవమైన ఆర్థిక నిర్ణయం. ఇటీవల చేపట్టిన మదింపులో దాని విలువ.. కొనుగోలు చేసినదాంట్లో సగం ఉంటుందని లెక్కగట్టాం. 44 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3.5 లక్షల కోట్లు)తో ట్విట్టర్‌ను కొంటానని ఆఫర్ ఇచ్చిన సమయం సరైనది కాదు." అని మస్క్ పేర్కొన్నారు.

భారత్‌లో ఆపిల్ తొలి రిటైల్ స్టోర్ ప్రారంభం



ముంబయి : భారత్‌లో ఆపిల్ తొలి రిటైల్ స్టోర్ ప్రారంభమైంది. ముంబయిలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన 'ఆపిల్ బికెసి'ని మంగళవారం ఆ కంపెనీ సిఇఒ టిమ్ కుక్ వేడుకగా ప్రారంభిం చారు. ఆయనే స్వయంగా ద్వారాలు తెరిచి.. వినియోగదారులను లోపలికి ఆహ్వానించారు. ఈ స్టోర్‌ను 20,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. రెండో స్టోర్‌ను ఢిల్లీలో తెరువనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థకు 500 రిటైల్ స్టోర్లు ఉన్నాయి. భారత్‌లోని విస్తృతావకాశాలపై ఆపిల్ దృష్టి సారించింది.